ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమగోదావరి
16
శనివారం 19 ఆగస్టు 2017





రోగాలు ఫాస్ట్


- పాస్ట్ ఫుడ్ సెంటర్‌లో తింటే ఆసుపత్రికే
- నిల్వ వున్న కల్తీ పదార్థాలతో జీర్ణ కోశ వ్యాధులు
- ప్రాణానికే ముప్పు అంటున్న వైద్యులు
- జిహ్వ చాపల్యం చంపుకోలేక జనం మక్కువ
- క్యాష్ చేసుకుంటున్న పాస్ట్‌ఫుడ్ సెంటర్లు

ముక్కు పుటాలు అదిరే ఘుమఘుమలు.. నోరూరించే రుచులు.. చూడగానే చటుక్కున నోట్లో పెట్టుకోవాలని అనిపించే జిహ్వ చాపల్యం. వెరసి మన ఆరోగ్యాన్ని హరించే విషతుల్యమైన ఆహారం. జిల్లాలోని పట్టణాలు.. మండల కేంద్రాల్లో సాయంత్రం అయ్యే సరికి పాస్ట్ ఫుడ్ సెంటర్లు జనంతో కిటకిటలాడుతున్నాయి. కొన్నిసెంటర్ల నిర్వాహకులు ఉపయోగించే పదార్థాలు జీర్ణకోశ వ్యవస్థను దెబ్బ తీసే విధంగా ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. దీనికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని హెచ్చరిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కల్తీపై ప్రత్యేక కథనం మధ్య పేజీల్లో...



మధురం.. మకరందం

నేడు ప్రపంచ తేనెటీగల దినోత్సవం మధ్యపేజీల్లో



మళ్లీ వచ్చాయ్

- తీర గ్రామాల్లో విజృంభిస్తున్న దక్షిణాఫ్రికా విషపు ఈగలు
- ఇవి కుడితే ఇక అంతే సంగతులు
- వీటి బారినపడి గతంలో ఇద్దరి మృతి
- నాలుగేళ్ల క్రితం ఈ ఈగలను చంపేందుకు పలు శాఖలు సంయుక్త ఆపరేషన్
- తాజాగా మొగల్తూరు, నరసాపురం మండలాల్లో తోటలు, తాటాకిళ్లపై పుట్టలు
- ఒంటరిగా పనులకు వెళ్లని వైనం
- కుడితే సకాలంలో వైద్యం అందించాలి : డాక్టర్ అప్పాజీ
- వాటి నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం : తహసిల్దార్

■15లో..






ప్రాజెక్టు నిర్మాణంపై కమిటీకి వివరిస్తున్న అధికారులు

- దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. ఇదే వేగంతో కొనసాగితే 2019కి పోలవరం పూర్తవుతుంది. అదే జరిగితే దేశంలో ఎక్కడైనా నీటిఎద్దడి ఏర్పడుతుందేమో గాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సాగు నీటికి ఇబ్బందులు ఉండవు. ఒక ప్రణాళికతో ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలగా పనులు పూర్తి చేయిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పనులు బాగా జరుగుతున్నాయి.

  \- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుంసింగ్

పోలవరమే



- పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పరిశీలించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ
- చైర్మన్ హుకుంసింగ్ సహా తొమ్మిది మంది సభ్యుల బృందం పర్యటన
- స్పిల్‌వే, కాంక్రీట్ పనులు, గేట్ల తయారీ పనులు పట్టిసీమ ఎత్తిపోతల పరిశీలన
- ప్రాజెక్టు నిర్మాణ పనులపై సంతృప్తి.. కాంట్రాక్టు ఏజెన్సీకి అభినందన
- పోలవరం పూర్తయితే ఆంధ్రాలో సమృద్ధిగా సాగు నీరు
- చంద్రబాబు ముందుచూపున్న నేతని.. ప్రణాళికతో పనులు చేయిస్తున్నారని వెల్లడి
- కమిటీ వెంట మంత్రులు దేవినేని, పితాని, ఏలూరు, రాజమండ్రి ఎంపీలు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు తొమ్మిది మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ కమిటీ శుక్రవారం వచ్చింది. కమిటీ చైర్మన్ హుకుంసింగ్ నేతృత్వం లోని సభ్యులు ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రాకు నిజంగా వరమని అన్నారు.

❖ ప్రధాన వార్త మెయిన్‌లో.. వివరాలు 15,16ల్లో

జిల్లాలో పది ఇసుక ర్యాంపులకు అనుమతి

ఆర్టీసీలో పదవీ విరమణ వయసు పెంపుపై మిశ్రమ స్పందన

ప్రయాణికులకు మెరుగైన సేవలు : రైల్వే డీఆర్ఎం ధనంజయులు

■లోపలి పేజీల్లో..

ముంచెత్తిన వాన

- జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వర్షంతో జనం ఇబ్బందులు

■16లో..



● కామెంట్



నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ తన భాష తీరును మార్చుకోవాలి.. సీఎం చంద్రబాబును ఉరి తీయాలి, కాల్చి చంపాలంటూ దూషించడం సరికాదు. లేదంటే ప్రజలే తగిన బుద్ది చెబుతారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు తిరిగి టీడీపీనే గెలిపిస్తారన్న భయంతోనే జగన్ ఇలా ప్రచారం చేస్తున్నారు.. ఒక రాష్ట్రానికి సీఎంగా ఉన్న చంద్రబాబునే ఇలా దూషిస్తున్నాడంటే.. ఇక ప్రజలను ఏ స్థాయిలో గౌరవిస్తాడో అర్థం చేసుకోవచ్చు..

\- ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్

● గణనాథా ఇదీ సంగతి..

వినాయక చవితి సందడి మొదలైంది.. పట్టణాల్లో ఎక్కడ చూసినా రోడ్ల వెంట విక్రయించేవారు భారీ వినాయకుడి విగ్రహాలను సిద్ధం చేశారు.. ఇప్పటికే చాటా గ్రామాలకు గగణనాథుడు తరలివెళ్లాడు.. వేలాది విగ్రహాలు అమ్ముడుపోతున్నాయి. విగ్రహం సైజును బట్టి రూ.3 నుంచి రూ. 15 వేల వరకు ధర పలుకుతోంది.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసి రంగులు వేయడంతో విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నాయి. అయితే వీటితోనే ముప్పు పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రంగులు, రసాయనాలు వినియోగించి తయారుచేసిన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. అందుకే మట్టితో చేసిన విగ్రహాలనే వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

\- పాలకొల్లు రూరల్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ interview

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో

పేరు నమోదు తప్పని సరి

రవికుమార్, జిల్లా ఉపాధి అధికారి, ఏలూరు



ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లలో నిరుద్యోగులు తమ పేరును తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.అందుకే గతంలో జిల్లా ఉపాధి కార్యాలయం చుట్టూ నిరుద్యోగులు ప్రదక్షిణలు చేసేవారు.. ఇప్పటి నిరుద్యోగులు ఎక్చేంజీల్లో తమ పేరును నమోదు చేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకుంటే కలిగే ప్రయోజనాల గురించి జిల్లా ఉపాధి అధికారి రవికుమార్ మాటల్లో తెలుసుకుందాం..

జిల్లా ఉపాధి కార్యాలయానికి ఎందుకు ఆదరణ తగ్గింది?

నిరుద్యోగులు ఉపాధి కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకోవడం తగ్గిన మాటల్లో కొంత వాస్తవం ఉంది.గతంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కువగా ఉండేవి. క్రమేపీ ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఎక్కువగా ప్రైవేటులో ఉద్యోగావకాశాలు పెరిగాయి. దీని వల్ల రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో అభ్యర్థులు ఆసక్తి చూపడం లేదు. నిరుద్యోగులు తమ పేరు నమోదు చేసుకోవడం మంచిది.

నమోదు చేయించుకోవడం వల్ల ఉపయోగాలేమిటి?

ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిన నేపథ్యంలో ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. ప్రతీ నెలా మొదటి వారంలో జిల్లా ఉపాధి కార్యాలయంలో ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఈ జాబ్‌మేళాలు ఎంతో ఉపయోగం. ప్రభుత్వ కార్యాలయాల్లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలకు ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజీల్లో తమ పేర్లు నమోదై ఉండాలి. ప్రభుత్వ పర్మినెంట్ ఉద్యోగానికి ఎంపికైన వారిని ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ అడుగుతారు. అందుకే తప్పకుండా నమోదు చేయించుకోవాలి..

జాబ్‌మేళాలు ఎప్పుడు నిర్వహిస్తున్నారు?

నెలకు నాలుగు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. ఈ మేళాల్లో జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకున్న వారికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. ఉద్యోగాల కోసం ఎంపిక చేసుకున్న ప్రైవేటు సంస్థల యాజమాన్యానికి కూడా జవాబుదారీతనం ఉంటుంది. ఉద్యోగాల నుంచి తీసివేసే యాజమాన్యాన్ని వివరణ అడగడానికి అవకాశం ఉంటుంది. ఈ ఏడాదిలో 15 జాబ్‌మేళాలు నిర్వహించాం. సుమారు 1500 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో సుమారు 400 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఇప్పటి వరకు ఎంత మంది నమోదు చేయించుకున్నారు?

ఉపాధి కార్యాలయంలో ఇప్పటి వరకు 67 వేల 547 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 45 వేల 592 మంది పురుషులు, 20 వేల 295 మంది స్త్రీలు ఉన్నారు. డిగ్రీ లు,పీజీలు చేసిన వారు 17వేల 805 మంది, ఇంటర్ చదివిన వారు 17 వేల 801, పదో తరగతి చదివిన వారు 29 వేల 654, తొమ్మిదవ తరగతిలోపు చదివిన వారు 2 వేల 276 మంది, విభిన్న ప్రతిభావంతులు 6 వేల 762 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

\- ఏలూరు టూటౌన్



సెల్‌ఫోన్‌లో లీనమైన యువకులు

జీవన గోదావరి

మన జీవన చిత్రం పూర్తిగా మారిపోయింది.. ఒకప్పుడు ల్యాండ్ ఫోన్‌లు మాత్రమే ఉండేవి.. ఏదైనా సమాచారాన్ని ఉత్తరాల ద్వారానో.. లేక ల్యాండ్ ఫోన్ ద్వారానో తెలుసుకునేవారు.. సెలవులు వస్తే బంధువుల ఇళ్లకు వెళ్లడం, లేదంటే కుర్రకారంతా ఒక చోటకు చేరి ఇష్టమైన ఆటలు ఆడుకునేవారు.. స్నేహితులతో సరదాగా గడిపేవారు.. ఒకరికొకరు తమ భావాలను వ్యక్తపర్చుకునేవారు.. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. నిమిషం ఖాళీ దొరికినా జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను బయటకు తీస్తున్నారు.. చిన్నారుల నుంచి పెద్దవారి వరకు అంతా సెల్ మాయలో పడ్డారు.. ప్రేమానురాగాలకు, స్నేహబంధానికి సెల్‌ఫోన్‌లే శత్రువులుగా మారాయి. సెల్‌ఫోన్‌లనే స్నేహం చేస్తున్నారు. జిల్లాలో 50లక్షల మంది జనాభా ఉంటే 40లక్షలు సెల్‌ఫోన్‌లు ఉపయోస్తున్నారు. ఒక కుటుంబంలో నలుగురు ఉంటే ముగ్గురికి సెల్‌ఫోన్ తప్పనిసరిగా ఉంటోంది. ఆ సెల్‌ఫోన్ కాస్త సుమారుగా నెలసరి బిల్లులు రూ.500 పైనే చెల్లించక తప్పడం లేదు. యువత అయితే నెట్‌లో, వాట్సాప్‌ల్లో మరింత మునిగి పోతున్నారు.. ఈ ఆధునిక జీవన విధానం ఎటువైపు వెళ్తుందోనని చాలామంది ఆందోళన చెందుతున్నారు..

\- భీమవరం రూరల్

సెల్ బంధం..

దూరమైన స్నేహ బంధాలు, బంధుత్వాలు - ప్రేమగా పలకరించుకునే రోజులు పోయాయి - సెల్‌తోనే గడుపుతున్న చిన్నాపెద్దా

ఆటపాటలన్నీ సెల్‌ఫోన్‌లోనే..

ఏ మాత్రం మాట్లాడటం వచ్చినా చిన్నారుల చెవుల దగ్గరకు ఫోన్‌లు చేరుతున్నాయి.. అవతలివారికి ఆ సంభాషణలు వినిపించేందుకు పెద్దలు పడరానిపాట్లు పడుతున్నారు. ఇలా వచ్చీరాని మాటలప్పుడే ఫోన్ చేతికందడంతో.. ఫోన్ నొక్కడం వస్తే ఆ చిన్నారులు వాటితోనే ఆడుకుంటున్నారు. చిన్నాపెద్దా అంతా సెల్‌ఫోన్‌లోనే క్రికెట్, చదరంగం, సూడోక్, కార్‌రేస్ వంటివి ఆడుతూ బిజీగా మారిపోతున్నారు. ఆరు బయట ఆడే క్రీడలు పూర్తిగా యువత దూరమైనట్టు అయ్యింది.. దాని వల్ల చిన్నారుల్లో కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తడం, నెలకు ఒకసారి అయినా ఆస్పత్రులకు పరుగులు తీయడం తప్పనిసరిగా మారింది.

చదువుకు ఆటంకం..

పూర్వపు రోజుల్లో చదువడం.. ఖాళీ సమయంలో ఆటలు.. ఆపై తల్లిదండ్రులకు, తాతలకు చిన్నచిన్న పనుల్లో సాయం చేసేవారు.. ఇప్పుడు అవన్నీ విద్యార్థులు వదిలేశారు. చదువు, సెల్‌ఫోన్ అవసరమైతే చదువుకునే సమయాన్ని తగ్గించి మరీ సెల్ ఉపయోగించడానికే ఎక్కువ కేటాయిస్తున్నారు. దీనితో ప్రతిభ కలిగిన విద్యార్థులు కాస్త వెనుకబడుతున్నారు.దీనిని తల్లిదండ్రులు గుర్తించినా పిల్లల ఒత్తిడితో వారు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంటున్నారు.



పెరిగిన ప్రమాదాలు..

ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం నేరం.. వాహనదారులకు పోలీసులిచ్చే హెచ్చరిక ఇది.. చాలామంది దీన్ని అతిక్రమిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రమాదాలు ఇప్పుడు పరిపాటిగా మారాయి. ఆటోలు, కార్లు ఫోన్ మాట్లాడుతూ నడపడం సర్వసాధారణమైంది.. ఇలా సెల్‌ఫోన్ మరింత ప్రమాదికారిగా మారింది.. అన్నీ తెలిసినా మనం పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాం..

15 ఏళ్లకే రూ.10 వేల సెల్..

పిల్లల ఒత్తిడితో తలొగ్గి తల్లిదండ్రులు రూ.10 వేల సెల్‌ఫోన్ కొనివ్వక తప్పడం లేదు. దీనితో 15ఏళ్ల వయస్సు వచ్చేసరికే విలువైన ఫోన్‌లు వారి చేతుల్లో దర్శనమిస్తున్నాయి.. ఈ ఫోన్‌లు వారి జీవితాలనే నాశనం చేస్తున్నాయి.. ఇవన్నీ తెలిసిన విషయాలే అయినా సమాజం పోకడలతో వీటి నుంచి తప్పించుకోలేకపోతున్నారు.. యువత పాడవ్వడానికి ఇవే ముఖ్య కారణమని పలు సర్వేలు సైతం స్పష్టం చేస్తున్నా వీటి బంధం మాత్రం వీడటం లేదు..

శుభలేఖలు.. శుభాకాంక్షలు వీటితోనే..

సెల్‌ఫోన్‌లు వచ్చాక పలకరింపులు పోయాయి. ఒక ఇంట్లో శుభకార్యం జరుగుతుందంటే గతంలో ఇంటికి వెళ్లి ఆప్యాయంగా ఆహ్వానం పలికేవారు.. ఇప్పుడు ఆ తీరు మారింది. ఫోన్‌లో పిలవడం, అంతగా బిజీ అయితే బంధువులందరికీ మెసేజ్‌తో సరిపెడుతున్నారు. ఇలా సెల్‌ఫోన్‌తోనే శుభకార్యాల పిలుపులు, పలకరింపులు జరుగుతున్నాయి.అదే తరహాలో శుభాకాంక్షలు తెలపడంలో కూడా సెల్‌ఫోన్ మెసేజ్‌లే ఉపయోగిస్తున్నారు. ఇలా బంధువుల మధ్య దూరం పెరిగింది. ఎవరి పని వారిదే అన్నట్టుగా మారింది.

ప్రమాదకరమైన బోరుబావులను మూసేయండి..

దేవరపల్లి : సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలతో అధికారులు జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న బోరు బావులను వెతికే పనిలో పడ్డారు. మెట్ట ప్రాంతంలో ఎక్కువగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.. దేవరపల్లి మండలంలో మూడు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న బోరుబావులను అధికారులు గుర్తించారు. గౌరీపట్నం, దుద్దుకూరు, బంధపురం గ్రామాల్లో ఉన్న ఐదు బోరుబావులను గుర్తించి మూసివేతకు తక్షణ చర్యలు చేపట్టారు. గౌరీపట్నంలోని ఒక బావికి ఐరన్‌గ్రిల్స్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కె.రవి కుమార్ మాట్లాడుతూ మెట్ట కావడంతో బోరుబావులపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. వీటిని గుర్తించి తక్షణ ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా బోరుబావులు ఉన్నట్టు గుర్తిస్తే స్థానిక అధికారులకు సమాచారం అందజేస్తే రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతి ఇస్తుందని తెలిపారు.





వృద్ధ కళాకారులకు
పింఛన్ బకాయిల చెల్లింపు

ఏలూరు రూరల్: జిల్లాలో ఏప్రిల్ 2016 నుంచి జూలై 2016 వరకు బకాయి ఉన్న 57 మంది వృద్ధ కళాకారులకు పింఛన్ సొమ్ము వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు సమాచార శాఖ ఏడీ వి.భాస్కర నరసింహం తెలిపారు. సాంకేతిక కారణాల వలన 57 మంది పింఛన్ నాలుగు నెలల పాటు బ్యాంకు ఖాతాలకు జమకాలేదన్నారు. వాటిని సరిచేసి తిరిగి బకాయిలను వారి ఖాతాల్లో జమ చేసినట్టు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖాధికారులు తెలియచేశారని భాస్కర నరసింహం తెలిపారు. సంబంధిత సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ అయ్యింది, లేనిదీ కళాకారులు పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

ఏలూరు చేరిన సత్యసాయి రథం

ఏలూరు రూరల్: సత్యసాయి సంస్థలకు చెందిన రథయాత్ర శుక్రవారం రాత్రి ఏలూరు చేరుకుంది. సంస్థల ఆధ్వర్యంలో ఒడిశాలోని పూరి నుంచి ప్రారంభమైన రథయాత్ర ఈనెల 25న పుట్టపర్తి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. పూరిలో ప్రారంభమైన యాత్ర శుక్రవారం రాత్రి ఏలూరు చేరుకుంది. ఏలూరు సత్యసాయి సేవాసంస్థ సభ్యులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. పలువురు భక్తులు పూజలు చేశారు. రథంలో సత్యసాయి విగ్రహం దివ్యమనోహరంగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె.శశిశేఖర్, పయిడేటి రామారావు. కె.వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



సత్యసాయి రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

చేనేత, హస్తకళ వస్తువులను కొనుగోలు చేయండి



ప్రదర్శన ప్రారంభిస్తున్న చైర్మన్ పాలి ప్రసాద్

ఏలూరు రూరల్: చేనేత, హస్తకళ వస్తువులను కొనుగోలు చేసి హస్త కళాకారుల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పాలి ప్రసాద్ చెప్పారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో లేపాక్షి, ఆంధ్రప్రదేశ్ హస్తకళల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళా వస్తువుల, చేనేత ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. హస్తకళాకారుల శ్రేయస్సు, వారి అభివృద్ధి కోసం ప్రదర్శనలు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యా ప్తంగా 12 షోరూమ్‌ల ద్వారా ఏడాదికి రూ.40 కోట్లు టర్నోవర్ వ్యాపారం నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. మునిసిపల్ పరిధిలో హస్తకళల ప్రదర్శన ఏర్పాటుచేసి వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్టోబర్ 3 వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ విప్ గూడవల్లి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి ఉప్పాల జగదీష్‌బాబు, ఎంపోరియం మేనేజర్ సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏ కోర్సు ప్రవేశానికి దరఖాస్తు

ఏలూరు రూరల్: రెండేళ్ల కాలపరిమితి గల ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) డిప్లమో కోర్సు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.కోటేశ్వరి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు htpp//efw.ap.nic.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొందవచ్చన్నారు. సెప్టెంబర్ 4 లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి : ఆర్ఎస్ఆర్

ఏలూరు క్రైం: జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రాము సూర్యారావు సూచించారు. ప్రభుత్వాసుపత్రిలోని పలు వార్డులను శుక్రవారం రాము సూర్యారావు, డీసీహెచ్ఎస్ శంకరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్.మోహన్ తనిఖీ చేశారు. రాము సూర్యారావు మాట్లాడుతూ సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని హితవు పలికారు. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది ఏ విధంగా విధులు నిర్వర్తిస్తున్నారు, రోగులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయో, లేదో తెలుసుకునేందుకు ప్రతీవారం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. తనిఖీల్లో డీసీహెచ్ఎస్, సూపరింటెండెంట్లు ప్రతీ రోగితో మాట్లాడుతున్నారన్నారు. కొంతమంది బాలింతలు ప్రభుత్వం ఇచ్చిన కిట్స్‌ను ఉపయోగించకుండా పాత గుడ్డలను



వార్డులను తనిఖీ చేస్తున్న చైర్మన్ ఆర్ఎస్ఆర్

వాడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని ఇలా చేయడం వలన బిడ్డలకు వ్యాధులు సోకే అవకశం ఉందన్నారు. ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్నాధరావు, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ మనోజ్ పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు అధికం



పర్యాటక దినోత్సవ కరపత్రం విడుదల చేస్తున్న వీసీ

రాజానగరం: పర్యాటక రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎం. ముత్యాలు నాయుడు పేర్కొన్నారు. నన్నయ వర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. సంబంధించిన కరపత్రాన్ని వీసీ ముత్యాలు నాయుడు విడుదల చేశారు. పర్యాటక రంగం అనేది ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే కీలక అంశంగా పరిగణించవచ్చన్నారు. ప్రస్తుతం ఈరంగంలో ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, ఇతర దేశాలతో సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ఈ రంగానికి శాస్త్ర సాంకేతిక రంగాలు పాత్ర ఎంతో కీలకమన్నారు. సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నాలుగు రకాల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పోస్టర్ పెయింటింగ్, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, టూరిజయం ఫొటోగ్రఫీ అంశాలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు డిగ్రీ, పీజీ, విద్యారంగం, న్యాయ, వైద్య, ఇంజనీరింగ్ విభాగాల నుంచి పాల్గొనవచ్చని ఈకార్యక్రమ రీజినల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.టేకి పేర్కొన్నారు. ఐదు దశల్లో జరిగే కార్యక్రమాలు తొలి దశ కళాశాల స్థాయి, రెండవది రెవెన్యూ డివిజన్ స్థాయి, మూడోది జిల్లా, నాల్గవది రీజినల్ స్థాయిలో ఉంటుందన్నారు. చివరిగా రాష్ట్ర స్థాయిలో జరుగుతాయన్నారు. దరఖాస్తు గడువు ఈ నెల 24తో ముగుస్తుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 9701343045, 9701343046 ఫోన్ నంబర్లులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిష్ట్రార్ టి. మురళీధర్, డాక్టర్ ఎన్.ఉదయ్ భాస్కర్, డాక్టర్ పి.ఉమామ హేశ్వరరి, జి.రాజేంద్రప్రసాద్, ఏఎస్.పద్మవల్లి, ఐ.సత్యనారాయణ, జి.రవి శంకర్, ఆలిజ్ జోయ్, డాక్టర్ రమేష్, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నికలో అంబికా కృష్ణ ప్రచారం

ఏలూరు రూరల్: నంద్యాల అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ, మైనార్టీ నాయకులు ఎండీ.ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అంబికా కృష్ణ తనదైన శైలిలో ప్రసంగిస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. అక్కడి నుంచి ఫోన్‌లో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏలూరుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు కూడా అంబికా కృష్ణతోపాటు ప్రచారం సాగిస్తున్నారు.


ఆర్ఆర్‌పేటలో అమ్మవారికి గాజులతో పూజలు


లలితాదేవిగా కనకదుర్గమ్మ


గాజుల అలంకరణ


ధనలక్ష్మిగా సౌభాగ్యలక్ష్మి


సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు

శ్రావణ పూజలు

ఏలూరు రూరల్: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి లక్ష్మీ అష్టోత్తరాలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. సత్రంపాడు అంబికా దేవిని గాజులతో అలంకరించి కుంకుమ పూజలు చేశారు. సౌభాగ్యలక్ష్మి అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. పత్తేబాద కనకదుర్గమ్మను లలితాదేవిగా అలంకరించి పూజలు జరిపారు. కొత్తపేట పన్నెండు పంపుల సెంటర్‌లో కనకదుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి పూజలు చేశారు. కొత్తపేటలో నూకాలమ్మవారికి ఉదయం అష్టోత్తరపూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పవరుపేట కాశీ విశ్వేశ్వర స్వామిఆలయంలో అన్నపూర్ణాదేవిని సప్తవర్ణ పుష్పాలతో అలంకరించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాలను ఆచరించారు. తూర్పువీధిలోని పెద్దమ్మవారు గుడిలో అమ్మవారికి కుంకుమ పూజలు, విశేష అర్చనలు నిర్వహించారు. రామకృష్ణాపురం, బావిశెట్టివారిపేట కనకదుర్గమ్మ ఆలయాల్లో వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. పడమరవీధి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మహిళలు వాయనాలు పంచుకున్నారు. రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి మహిళలు గాజుల పూజల నిర్వహించారు.

రూరల్ మండలంలో..

శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా గ్రామాల్లో వేకువజామునే అమ్మవారికి వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. శనివారపుపేటలోని కనకదుర్గ అమ్మవారిని విశేషంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయాలు పోటెత్తాయి. ముత్తైదువులకు వాయనాలు సమర్పించి దీవెనలు అందుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రజా సేవ



రహదారులు, డ్రెయిన్లు అభివృద్ధి

పెరుమాళ్ళ హేమ శశికళ, కార్పొరేటర్

డివిజన్‌లో పది లక్షల రూపాయలతో రోడ్లు, ఎనిమిది లక్షల రూపాయలతో డ్రెయిన్లు నిర్మించాం. 48 లక్షల రూపాయలతో కల్వర్టులు కట్టాం. డివిజన్ అంతా ఎల్ఈడీ లైట్లతో వెలుగులు నింపాం. 50 లక్షల రూపాయలతో రామాలయాన్ని నిర్మించాం. డివిజన్‌లోని ప్రతీ కుటుంబానికి మరుగుదొడ్డి కట్టించాం. పేదలకు ఇచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీలకు సబ్సిడీ రుణాలు ఇప్పించాం. ప్రతీ గృహిణికి గ్యాస్ కనెక్షన్లు అందించాం. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేశాం.

సొంత ఇంటి కల నెరవేర్చుతాం : విప్ చింతమనేని


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విప్ చింతమనేని

ఏలూరు రూరల్: పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మల్కాపురం నుంచి ఆర్అండ్‌బి, గ్రామాల్లో సుమారు 12 కోట్లతో నిర్మించే రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్లు, ఆర్అండ్‌బి రోడ్లను విస్తృతంగా నిర్మిస్తున్నామన్నారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు అర్హులైన వారికి ఇళ్ళ స్థలాలు కేటాయించామని చెప్పారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న చింతమనేనికి మల్కాపురం గ్రామస్థులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఆరు నెలలుగా ఒంటిపూట తాగునీరు పంపిణీ చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై అధికారులను ప్రశ్నించారు. ఫిల్టర్ బెడ్స్ పాడయ్యాయని సర్పంచ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సమాధానం ఇచ్చారు. ఆరు నెలలుగా మరమ్మతులు చేయకుండా ఎందుకు పనిచేస్తున్నారని ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్స్ పాడైతే తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని, ఇన్ని నెలలుగా ఎందుకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు రూరల్: తంగెళ్ళమూడి సబ్ స్టేషన్ పరిధిలోని పాత కంట్రోల్‌రూమ్‌ను తొలగిస్తున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు డీఈ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఎంఆర్‌సి కాలనీ, తంగెళ్ళమూడి, కంద్రికగూడెం, చొదిమెళ్ళ, బాండినగర్, బీడికాలని, ఎస్ఎంఆర్ నగర్, ఆదివారపుపేట, గన్‌బజార్, స్టేడియం రోడ్డు పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

అశోక్ నగర్ పరిధిలో..

అశోక్‌నగర్ 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి లైన్స్ కొత్తపేట, పత్తేబాద ఫీడర్లలో మరమ్మతు చేస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మంచినీళ్ళతోట, చాణిక్యపురికాలనీ, ఆర్ఎంఎస్‌కాలనీ, గుబ్బలవారివీధి, రామచంద్రరావుపేట, అల్లూరి సీతారామరాజు సెంటర్, కొత్తపేట, సంతోష్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు.

వట్లూరు పరిధిలో..

వట్లూరు 33/11 కెవి ఉప కేంద్రం పరిధిలో ఎలక్ట్రికల్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యానగర్, కట్టా సుబ్బారావుతోట, గ్జేవియర్‌నగర్, సత్రంపాడు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు డీఈ కె.నాగేశ్వరరావు తెలిపారు.

కోటదిబ్బ పరిధిలో..

ఏలూరు కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు న్యూవెంకన్న ట్యాంకు ఫీడర్ పరిధిలోని కత్తేపువీధి, వెంకన్నచెరువు, కైకలూరు బైపాస్ రోడ్డు, జ్వాలాపహరేశ్వరి కాలని, చిరంజీవి బస్టాండ్, మాదేపల్లి రోడ్డు, చాటపర్రు రోడ్డు, తూర్పువీధి, మోతేపల్లివారివీధి, కోటదిబ్బ సబ్ స్టేషన్‌లో 11 కెవి కెనాల్ ఫీడర్ పరిధిలోని పాండురంగ థియేటర్, సత్యనారాయణపేట, నవాబ్‌పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, చెంచులకాలనీ, రామానగర్, శాస్త్రినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ మోరు హైమావతి

ఏలూరు రూరల్: బాలికా విద్య, గ్రామీణ ప్రాంత పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని ఎంపీపీ మోరు హైమావతి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వరల్డ్ విజన్ ఇండియా పిల్లల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పదో తరగతి అనంతరం బాలికలకు వివాహం కాకుండా ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. 18 ఏళ్ళ లోపు యువతులను చదువుపై మక్కువ కలిగించే చర్యలపై రక్షణ కమిటీ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వైస్ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే పదో తరగతి విద్యార్థినులకు ప్రభుత్వం ఉచితంగా సైకిళ్ళను అందిస్తుందన్నారు. వరల్డ్ విజన్ ఇండియా మేనేజర్ జేమ్స్‌వాట్ మాట్లాడుతూ కమిటీ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కమ్యూనిటీ డవలప్‌మెంటర్ కె.యేబు, బి.వెంకటేశ్వరరావు, కుటుంబరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ధ్వన్యాలోకంపై అతిథి ఉపన్యాసం

ఏలూరు రూరల్: స్థానిక సిఆర్ రెడ్డి పీజీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆనంద వర్ధనుడు రచించిన ధ్వన్యా లోకంపై శుక్రవారం అతిథి ఉపన్యాసం ఇచ్చారు. జరిగింది. డాక్టర్ శ్రీపాద రామకృష్ణ ధ్వని సిద్ధాంతాన్ని వివరించారు. పీజీ డైరెక్టర్ కొండయ్య మాట్లాడుతూ అతిథి ఉపన్యాసాల ద్వారా విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. ఆంగ్ల విభాగాధిపతి ఎంఎస్‌సి.సోఫియా మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలన్నారు. లెక్చరర్ డి.మేరీసుగుణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



గెస్ట్ లెక్చర్ ఇస్తున్న డాక్టర్ శ్రీపాద రామకృష్ణ

● ఏలూరు ఫైర్ స్టేషన్


ర్యాంకు సాధించిన విద్యార్థులు

ఒలింపియాడ్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్: సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ ఏడాది నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో స్థానిక నరసింహారావుపేటలోని భాష్యం స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన ఐఐటి విద్యార్థులు ఎస్.ధనుష్ స్టేట్ ఐదో ర్యాంకు, పి.వినయ్ స్టేట్ ఎనిమిదో ర్యాంకు సాధించారని భాష్యం స్కూలు డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. జిల్లా స్థాయిలో ఎం.చైతన్య వెంకట శశిధర్ ప్రథమ, ఆర్.చైతన్య తృతీయ ర్యాంకు కైవసం చేసుకున్నారని తెలిపారు. వీరిని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రేపు రచయితల సంఘం కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్: తెలుగు రచయితల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గ్జేవియర్‌నగర్‌లోని జిల్లా సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు సంఘం గౌరవ అధ్యక్షుడు నున్నా అంజారావు తెలిపారు. నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.



స్మార్ట్ సిటీ

రూ.696 కోట్లతో అంచనాలు సిద్ధం
ఆమోదించిన ప్రభుత్వం
త్వరలో పనులు ప్రారంభం



ఏలూరు టూటౌన్: నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపొందించడానికి షాపూర్జీ, పోల్లంజి కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు ప్రాజెక్టు రిపోర్టును రూపొందించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సంస్థ ప్రతినిధులు ప్రాజెక్టు రిపోర్టును నగర కమిషనర్ వై.సాయిశ్రీకాంత్‌కు అందజేశారు. సాయిశ్రీకాంత్ మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీగా ఎంపికచేసి ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేసిందన్నారు. స్మార్ట్ సిటీ అభివృద్ధికి షాపూర్జీ, పోల్లంజి సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ఈ సంస్థ సర్వే నిర్వహించి రూ.696 కోట్లతో నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపొందించవచ్చని అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. ప్రభుత్వం ఈ అంచనాను ధ్రువీకరించి నిధులు కూడా మంజూరు చేసిందన్నారు.


కమిషనర్‌కు ప్రాజెక్ట్ రిపోర్ట్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

స్మార్ట్ సిటీ పనులు ప్రారంభించడానికి షాపూర్జీ, పోల్లంజి సంస్థ పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసి కార్పొరేషన్‌కు సమర్పించిందని కమిషనర్ సాయి శ్రీకాంత్ తెలిపారు. త్వరలో స్మార్ట్ సిటీ పనులు ప్రారంభించనున్నామన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడం, ట్రాఫిక్‌కు అనుగుణంగా ప్రధాన రోడ్లను విస్తరించడం, సోలార్ వ్యవస్థతో కరెంటు మెరుగుపర్చడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీసీ కెమెరాలు ఏర్పాటు, పరిశ్రమలు స్థాపించే విధంగా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.

నిబంధనలు తెలుసుకోవాలి.. పాటించాలి

ఏలూరు క్రైం: సమాజంలో వాహనాల వినియోగం పెరిగిందని, వీటి వలన ట్రాఫిక్ సమస్య అధికమైందని, ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి.సునీత ఆదేశాల మేరకు బెనర్జీపేటలోని బాలగంగాధర తిలక్ మునిసిపల్ హైస్కూలులో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి కె.శైలజ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ హక్కులు, విధులను తెలుసుకుని బాధ్యతాయుతంగా నడుచుకున్నప్పుడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి ఉంటే భవిష్యత్తులో చక్కటి పౌరులుగా వర్ధిల్లుతారని, అలాంటి వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆరు సంవత్సరాల వయస్సు నుంచి 14 ఏళ్ళ బాలలకు నిర్బంధ విద్య చట్టం ఉందని, ఎవరైనా బాలలను కార్మికులుగా పనుల్లో పెట్టుకుంటే చట్టప్రకారం శిక్షించబడతారన్నారు. బాల్య వివాహాలను చేయకూడదని, వివాహానికి నిర్ణయించిన వయస్సు వచ్చినప్పుడే పెళ్ళిళ్ళు జరపాలన్నారు. రోజురోజుకు సమాజంలో మానవుల అవసరాల నిమిత్తం యంత్రాలు, వాహనల వినియోగం పెరిగిందని, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వేగం ఎంతో ప్రమాదకరమని, పరిమితమైన వేగంతో ప్రయాణించినప్పుడే సుఖంగా గమ్యానికి చేరుకోగలమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవడం వలన ప్రమాదాలను నివారించవచ్చున్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ వృద్ధులకు, మహిళలకు, పిల్లలకు, మతిస్థిమితం లేనివారికి, వికలాంగులకు లక్ష రూపాయలలోపు వార్షిక ఆదాయం కలిగిన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. చట్టాలపై అవగాహన కల్పించుకోవడం వలన తమ హక్కులను పొందగలుగుతారని జడ్జి శైలజ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు కూనా కృష్ణారావు, పి.బి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, బాలగంగాధర తిలక్ మునిసిపల్ హైస్కూలు హెడ్మాస్టార్ కుటుంబరావు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శైలజ

25 ఏళ్ల ఉద్యోగం
అప్పటి కలెక్టర్ అజయ్ కల్లాంతో ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్: 1992లో జిల్లా కలెక్టర్ అజయ్ కల్లాం.. ఆయన హయాంలో ఏలూరు మునిసిపాలిటీ పరిధిలో సుమారు 50 మంది ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అజయ్‌కల్లాం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్నో ఉన్నత స్థానాల్లో విధులు నిర్వహించానని, తన ఉపాధ్యాయుల యలవేనన్నారు. అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి సర్వోత్తమమైనదన్నారు. తాను నియమించిన ఉపాధ్యాయులతో గడపడం ఆనందంగా ఉందన్నారు. ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మునిసిపల్ కమిషనర్ వై.సాయిశ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అజయ్ కల్లాంతో ఉపాధ్యాయులు

విద్యా వ్యవస్థను పట్టించుకోరే..

ఏలూరు టూటౌన్: విద్యా వ్యవస్థను పటిష్టపరిచేవిధంగా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని పీడీఎస్‌యూ సహాయ కార్యదర్శి కె.నరేంద్ర ఆరోపించారు. ఈనెల 22, 23 తేదీల్లో అమలాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర రాజకీయ తరగతుల కరపత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విడుదల చేశారు. నరేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి మూడేళ్లలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకే మేలు చేసే చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఎటువంటి ప్రణాళికలు రూపొందించకపోగా, సంక్షేమ హాస్టళ్లను మూసివేసే చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ, కార్పొరేట్ విద్యా వ్యవస్థకు లబ్ధి చేకూరేవిధంగా తీసుకువచ్చిన సెల్ఫ్ ఫైనాన్స్ ఇండిపెండెంట్ యాక్టు ముసాయిదా రద్దు చేయాలన్నారు. ఫీజు రీయింబర్సుమెంటు, స్కాలర్‌షిప్ విడుదల కాక విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. విద్యార్థులను సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా లీలాకృష్ణ

ఏలూరు ఫైర్‌స్టేషన్: సిటీ, రూరల్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా నగరబోయిన లీలాకృష్ణ, కార్యదర్శిగా సీహెచ్.అమరకుమార్ ఎన్నికయ్యారు. ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు సారథ్యంలో శుక్రవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన 59 ఆటోస్టాండ్‌లలో 4,500 మంది ఆటో డ్రైవర్లు సభ్యులుగా ఉన్నారన్నారు. లీలాకృష్ణ సమీప ప్రత్యర్థి బలరాంపై ఏడు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అమరకుమార్ సమీప ప్రత్యర్థి నల్లా బాపినాయుడుపై మూడు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాకర్ల అప్పారావు, బద్దా వెంకట్రావు, ఎ.దుర్గారావు, అశోక్, వాసు ఎన్నిక పర్యవేక్షించారు.

వలసలు నిరోధించాలి

ఏలూరు టూటౌన్: రాయలసీమ, కోస్తా జిల్లాల్లో ఏర్పడిన కరువుతో గ్రామీణ పేదలు, సన్న, చిన్నకారు రైతులు వలసలు వెళ్ళిపోతున్నారని, వలసలు నిలుపుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రారావు, బి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కరువు నివారణ, వలసలు నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కరువు మండలాలను గుర్తించి అక్కడ పని దినాలతో సంబంధం లేకుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి లేనివారికి ఒక్కొక్కరికి పది కేజీల బియ్యం, నూనె, అపరాలు, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద సత్యాగ్రహం నిర్వహించనున్నట్టు తెలిపారు.



● మార్కెట్ ధరలు

ఏలూరు రైతు బజారులో
శుక్రవారం నాటి
కూరగాయల ధరలు

కిలోల్లో..	రూ.
టమాటా	48-00
వంగ	24-00
బెండ	18-00
మిర్చి	22-00
కాకర	16-00
బీర	14-00
క్యాబేజి	20-00
క్యారెట్	28-00
దొండ	18-00
బంగాళదుంపలు	14-00
ఉల్లిపాయలు	21-00
దోస	12-00
ఆనప	12-00
పొట్లకాయ	12-00
అరటి	4-00
చిక్కుడు	36-00
గోరుచిక్కుడు	24-00
చామదుంపలు	30-00
మునగ	4-00
ఆకుకూరలు (కట్ట)	3-00
కంద	24-00
బీట్‌రూట్	26-00
కీరదోస	28-00
ఫ్రెంచ్‌బీన్స్	80-00
రైస్	32-00
కందిపప్పు	70-00
మినపప్పు	72-00
పెసరపప్పు	74-00
చింతపండు	100-00
ఆయిల్	60-00

- ఏలూరు టూటౌన్

హలో 'ఆంధ్రజ్యోతి'

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.


ఏలూరు సిటీ	: 99854 01668
ఏలూరు అర్బన్	: 9848220735
ఏలూరు క్రైం	: 9848238482
ఏలూరు రూరల్	: 9441556656
ఏలూరు టూటౌన్	: 9247855290

సినిమా గైడ్ :

ఏలూరు:

విజయలక్ష్మి (వీ-మాక్స్-1)	నేనే రాజు.. నేనే మంత్రి
విజయలక్ష్మి (వీ-మాక్స్2)	గ్రీన్‌కార్డు
అంబికా స్క్రీన్ 1	దర్శకుడు
అంబికా స్క్రీన్ 2	జయ జానకి నాయక
అంబికా స్క్రీన్ 3	టాయిలెట్
మినీ సత్యనారాయణ	లై
సత్యనారాయణ	గౌతమ్‌నంద
సాయి బాలాజీ	జయ జానకి నాయక
బాలాజీ	లై
క్రాంతి	ఇదేం దెయ్యం

మినీ లోకం



సమాచారం..

ఉష్ణోగ్రతలు :	గరిష్ఠం	కనిష్ఠం
ఏలూరు	29	24
భీమవరం	29	25
తణుకు	30	25
తాడేపల్లిగూడెం	29	25
నరసాపురం	29	25
పాలకొల్లు	29	25
నిడదవోలు	30	25
కొవ్వూరు	30	25
జంగారెడ్డిగూడెం	29	25

ద్వారకా తిరుమల గదుల సమాచారం (ఖాళీలు)

టీటీడీసదనం	6
రాణి చిన్నయమ్మారావు సదనం	28
మావులేటి సదనం	5
ఆళ్వార్ సదనం	16
బాలాజీ సదనం	ఖాళీలేవు
ఆండాళ్ సదనం	ఖాళీలేవు
పద్మావతి సదనం	ఖాళీలేవు
ధర్మ అప్పరాయ సదనం	90
కాటేజీలు	12

రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం

ఫోన్ నెంబర్ : 08829 271427

చికెన్ ధరలు

ఫారం ధర	84.00
లైవ్ రిటైల్	99.00
విత్ స్కిన్	139.00
స్కిన్ లెస్	163.00

గుడ్డు ధర ఒక్కంటికి రూ. 3.59

బంగారం, వెండి ధరలు (నరసాపురం)

24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)	29,860
22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)	27,470
వెండి (కేజీ)	40,420

అపరాల ధరలు (తాడేపల్లిగూడెం)

	కిలో ధర
కందిపప్పు (నెంబర్ వన్)	రూ. 65
మినపప్పు	రూ. 65
శనగపప్పు	రూ. 75
వేపుడు శనగపప్పు	రూ. 90
పెసర పప్పు	రూ. 70

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

డీఆర్ఎం ధనుంజయులు

కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో పలు విభాగాల పరిశీలన


కొవ్వూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం ధనుంజయులు

కొవ్వూరు: ప్రయాణికులకు మెరుగైన సేవలందించే విధంగా రైల్వే శాఖ చర్యలు చేపట్టిందని డీఆర్ఎం ఆర్.ధనుంజయులు తెలిపారు. స్వచ్ఛత పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొవ్వూరు రైల్వేస్టేషన్ సందర్శించి స్వచ్ఛమైన సంభాషణ కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 16 నుంచి 31 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం ధనుంజయులు పాత్రికేయులతో మాట్లాడారు.

ఆధునిక హంగులతో కొవ్వూరు రైల్వేస్టేషన్ నిర్మాణం

కొవ్వూరు రైల్వే స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించవలసిన ఆవశ్యకత ఉన్నదన్నారు. భవన నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం స్టేషన్ ఉన్న ప్రాంతంలో రైల్వేభూమి లేకపోవడంతో భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. స్థానిక పురపాలక సంఘం సహకరించినట్లయితే కొవ్వూరు పట్టణంలో ఆధునిక హంగులతో కొత్త స్టేషన్‌ను నిర్మాణం చేపడతామన్నారు.

సిబ్బంది కొరత నివారిస్తాం

రైల్వేస్టేషన్‌లో ఎంక్వైరీ, రిజర్వేషన్ కౌంటర్‌లో ఒకే వ్యక్తి విధులు నిర్వహించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని దీనిపై డీఆర్ఎం స్పందిస్తూ రైల్వే స్టేషన్‌లో గత ఏడాది కంటే ఆదాయం తగ్గిందని రిజర్వేషన్ కౌంటర్‌లో రోజుకు 180 టిక్కెట్‌లు బుక్కింగ్ కావాల్సి ఉండగా 50 మాత్రమే అవుతున్నాయని దీంతో సిబ్బందికొరత వల్ల తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. రెండవ ఆర్చ్‌బ్రిడ్జిపై రెండవ లైన్‌కు ప్రతిపాదనలు పంపించామని విజయవాడ, విశాఖపట్నం మధ్య మూడవ లైన్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు లభించిన వెంటనే ఆర్చ్‌బ్రిడ్జితో రెండవ లైన్‌కు సంబంధించి అంచనాలు తయారు చేయడం జరుగుతుందన్నారు.

2021కి డబ్లింగ్ పనులు పూర్తి

నిడదవోలు రైల్వే డబ్లింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. 2019 నుంచి అందుబాటులోకి వస్తుందని 2020-21 నాటికి పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేసి ప్రయాణికులకు సౌకర్యాలు అందిస్తామన్నారు.

హేవలాక్ బ్రిడ్జి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగింత...

కొవ్వూరు - రాజమండ్రి మధ్య వంద సంవత్సరాలకు పైగా సేవలందించిన హేవలాక్ బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామన్నారు. ప్రభుత్వం ఆదీనంలో వంతెనను పర్యాటకంగా అభివృద్ధి చేస్తారన్నారు.

ఆహారంలో నాణ్యత లేకుంటే చర్యలు

రైల్వేస్టేషన్‌లో దొరికే ఆహార పదార్థాల నాణ్యతపై వారం రోజులుగా ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రైల్వేస్టేషన్‌లలో ఎటువంటి లైసెన్సులు లేకుండా నాణ్యతలేని పదార్థాలు విక్రయించే వారిపై కేసు నమోదు చేసి ప్రాసిక్యూషన్‌కు పంపిస్తామన్నారు. లైసెన్సు తీసుకున్న కాంట్రాక్టర్‌లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. భద్రాచలం రైల్వేలైన్‌కు సంబంధించి ఇప్పటికే భద్రాచలం నుంచి రైల్వే లైన్ పనులు ప్రారంభం అయ్యాయన్నారు. డీఆర్ఎం వెంట సీనియర్ డివిజనల్ ఇంజనీర్ రామారావు, సత్యనారాయణరెడ్డి, చైతన్య, కమర్షియల్ మేనేజర్ షిపాలి, ఎలక్ట్రికల్ ఇంజనీర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి గాయానికి ఆపరేషన్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

బుట్టాయగూడెం: గురుకుల పాఠశాలలో విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డ ఇంటర్ విద్యార్థి తామా వీర్రాజు కాలుకు ఆపరేషన్ చేసేందుకు జంగారెడ్డిగూడెంలోని పివిఆర్ ఆసుపత్రిలో డాక్టర్లు సిద్ధం చేశారు. శనివారం ఆపరేషన్ పూర్తిచేస్తామని వైద్యులు తెలియజేసినట్లు ఇన్‌చార్జి డీఎంవో డాక్టరు వంశీలాల్‌రాథోడ్ తెలిపారు. మంత్రిగారికి ఖాళీ లేదంటా...! అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించడం తెలిసిందే. దీంతో స్పందిన ఐటీడీఏ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వీర్రాజుకు ఆపరేషన్ చేయించేందుకు జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. మూడు నెలలుగా గాయాలకు వైద్యం చేస్తున్నా నరం వద్ద గాయం తగ్గలేదు. దీంతో వీర్రాజు శరీరంలోని ఏదో ఒక భాగం నుంచి చర్మాన్ని తీసి నరం గాయంపై కప్పితే తప్ప గాయం తగ్గే అవకాశాలు లేవని రాజమండ్రిలో వైద్యసేవలందిన వైద్యులు స్పష్టం చేశారు. దీనితో ఐటీడీఏ అధికారులు వీర్రాజును జంగారెడ్డిగూడెంలోని పివిఆర్ ఆసుపత్రికి తరలించారు. వీర్రాజుకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని వైద్య, ఆరోగ్యశాఖ నుంచి కాదని, గిరిజన సంక్షేమశాఖ నుంచి డబ్బులు మంజూరు చేసిందని అధికారులు తెలిపారు.

నేడు ఫొటోగ్రఫీ డే వేడుకలు

ఏలూరు రూరల్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు అమీర్‌బాషా తెలిపారు. మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, ఎంపీ మాగంటి బాబు, ఎమ్మెల్యే బడేటి బుజ్జి, మేయర్ నూర్జహాన్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి పరిసర ప్రాంతాల్లోని ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ మిత్రులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

రేపు హ్యాండ్‌బాల్ సంఘ కార్యవర్గ సమావేశం

ఏలూరు రూరల్: హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగనుంది. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ఎం.లెనిన్, టి.కొండలరావు కోరారు.

ప్రకృతి వైద్యంతో దీర్ఘకాలిక రోగాలు నివారణ

కేంద్ర ప్రభుత్వ అధికారులకు గోపాల్‌రాజు ప్రకృతి వైద్య సేవలు


గోపాల్‌రాజు

భీమవరం : దేశంలోని తొలి ప్రకృతి ఆశ్రమంగా గుర్తింపు తెచ్చుకున్న భీమవరం వేగిరాజు కృష్ణంరాజు ప్రకృతి ఆశ్రమం వైద్యులు వేగిరాజు గోపాల్‌రాజు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ అధికారులకు ప్రకృతి వైద్య విధానంలో చికిత్స చేయించే అపూర్వ అవకాశం వచ్చింది. మూడు రోజుల పాటు ఢిల్లీలో కేంద్ర ఐఏఎస్ అధికారులకు మానసిక ఒత్తిడి, నడుం, మెడ, మోకాలి నొప్పులకు సంబంధించి చికిత్స చేసి మంచి ఫలితాలు సాధించామని డాక్టర్ గోపాల్‌రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కేంద్ర సెక్రటేరియట్ విభాగానికి చెందిన వారు తనను ఢిల్లీ ఆహ్వానించారని చెప్పారు. కొద్ది క్షణాల వ్యవధిలోనే కొందరు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక రోగాలకు సైతం చక్కని పరిష్కారం చూపించడంతో అధికారులకు ఎంతో ఉపశమనం లభించిందని చెప్పారు. దీంతో వారు వచ్చే నెల 15వ తేదీన ఢిల్లీలో ఆఫీసర్స్‌క్లబ్‌లో ప్రత్యేక ప్రకృతి వైద్యశిబిరం ఏర్పాటు చేశారని, వారందరికీ తాను చికిత్స అందించాల్సిందిగా తనను ఆహ్వానించడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన చెప్పారు. తన బృందంతో వెళ్ళి వైద్యసేవలు అందిస్తామని గోపాల్‌రాజు చెప్పారు. ప్రకృతి వైద్య విధానంలో దీర్ఘకాలిక రోగాలను నయం చేయవచ్చని గోపాల్‌రాజు వివరించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 8


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. ప్రియతముల వైఖరిలో మార్పు ఆవేదన కలిగిస్తుంది. ఇంట్లో వేడుకలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): సోదరీ, సోదరుల వైఖరిలో మార్పు ఆవేదన కలిగిస్తుంది. విద్యా సంస్థల్లో ప్రవేశానికి అనుకూలం. రవాణా, ఏజెన్సీలు, స్టేషనరీ, బోధన రంగాల వారు చేపట్టిన పనులు పూర్తిచేస్తారు. ఒక వార్త కలవరపెడుతుంది.


మిథునరాశి: (మే21-జూన్21): ఆర్థిక విషయాలకు సంబంధించి ఒక సమాచారం కలవరపెడుతుంది. సన్నిహితులకు డబ్బు సర్దుబాటు చేయాల్సి వస్తుంది. రుణాలు, పెట్టుబడుల కోసం చేసే ప్రయాణాలు, చర్చలు ఫలిస్తాయి.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. ఆర్థిక వ్యవహారాల్లో సంకల్పం నెరవేరుతుంది. అనుకున్న నిధులు సకాలంలో చేతికి అందుతాయి. లక్ష్యాలు సాధిస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. గ్రానైట్, ఫొటోగ్రఫీ, టెక్స్‌టైల్స్, బోధన రంగాల వారికి సంకల్పం నెరవేరుతుంది. ఏదో తెలియని వెలితి మనసును బాధిస్తుంది.


కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఆర్థిక వ్యవహారాలు అశాంతికి కారణం అవుతాయి. సన్నిహితులకు సంబంధించి రహస్య సమాచారం తెలుసుకుంటారు. ప్రదర్శనలు, ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. ఉద్యోగ, వ్యాపారాల్లో సన్నిహితుల సహకారం లోపిస్తుంది. బంధుమిత్రుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. భవిష్యత్ గురించి వ్యూహరచన చేస్తారు. వృత్తికి సంబంధించిన సమావేశాల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): రుణ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఆర్థిక విషయాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. పన్నుల వ్యవహారాలు ఇబ్బంది పెడతాయి. పాత వస్తువుల రవాణాకు అనుకూలం. గత అనుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): పెట్టుబడులు, పందాలు, పోటీల్లో నష్టం సంభవం. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): శ్రీవారు, శ్రీమతి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. సన్నిహితుల సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో అనుకున్న పనులు పూర్తి చేస్తారు. విందు, వినోదాల్లో పరిమితి పాటించాలి.


మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. వృత్తిపరమైన శిక్షణలో పాల్గొనేందుకు అనుకూలం. కృషి రంగంలో కొత్త అనుబంధాలు ఏర్పడతాయి. విద్య, సృజనాత్మకరంగాల వారికి అనుకూలం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

42 రోజులైనా ఆచూకీ లేదు...!

● ఆచంటలో మైనర్ బాలిక అదృశ్యం
● తల్లిదండ్రులు ఆందోళన
● ముమ్మరంగా దర్యాప్తు : ఎస్ఐ


అదృశ్యమైన విజయభవాని

ఆచంట : ఆచంట శివారు ప్రాంతానికి చెందిన వేండ్ర విజయభవాని (17) అనే మైనర్ బాలిక అదృశ్యం అయి 42 రోజులు గడుస్తున్నా నేటికీ సమాచారం లేకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంటర్ చదువుతూ మధ్యలో ఆపేసిన విజయభవాని గత నెల 6వ తేదీన ఇంటి దగ్గర నుంచి సైకిల్ వేసుకుని వచ్చి ఆచంట శివాలయం దగ్గర్లోని కుమ్మరి వీధిలో ఒక టైలరింగ్ షాపు వద్ద సైకిల్ పెట్టి వెళ్ళిపోయింది. సాయంత్రం వరకు కూడా తిరిగి రాలేకపోవడంతో తండ్రి శ్రీనివాస్ జూలై 7వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు. విజయభవాని తండ్రి శ్రీనివాస్ గుంటూరులో టైలరింగ్ చేస్తుంటాడు. తల్లి శ్రీదేవి రెండు సంవత్సరాల క్రితం జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళింది. దీంతో విజయభవానితో పాటు 10వ తరగతి చదువుతున్న తమ్ముడు మనోహర్ ఇద్దరూ తాతయ్య, నాన్నమ్మల దగ్గరే ఉంటున్నారు. శ్రీనివాస్ గుంటూరు నుంచి అప్పుడప్పుడూ ఆచంట వస్తుంటాడు. ఈ క్రమంలోనే విజయభవాని అదృశ్యం అయింది. కుమార్తె కన్పించడం లేదని తెలిసిన శ్రీదేవి గల్ఫ్ నుంచి ఇటీవల ఆచంట తిరిగి వచ్చింది. తమ కుమార్తె అదృశ్యం అయ్యి 42 రోజులు గడస్తున్నా నేటికీ ఎటువంటి సమాచారం లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎస్ఐ ఏజీఎస్ మూర్తి మాట్లాడుతూ విజయభవాని అదృశ్యంపై తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అప్పటి నుంచి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అనుమానితులను కూడా స్టేషన్‌కు రప్పించి విచారిస్తున్నామని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో సిబ్బందితో దర్యాప్తు చేశామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని వారి ఆదేశాల మేరకు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నామన్నారు.


విజయభవాని తల్లిండ్రులు శ్రీనివాస్, శ్రీదేవి

మూత్రవిసర్జన వంకతో ఖైదీ పరారీ

వెంటాడి పట్టుకున్న కానిస్టేబుళ్లు

చింతలపూడి కోర్టు వద్ద ఘటన

చింతలపూడి : చింతలపూడి కోర్టు వాయిదాకు తీసుకువచ్చిన ఒక ఖైదీ సంకెళ్ళు ఉన్నప్పటికీ కానిస్టేబుళ్ళను పడదోసి పరారీ గాక ఎట్టకేలకు అరగంట తర్వాత ఖైదీని పట్టుకుని కోర్టులో హాజరు పరిచారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం ఊటగట్లగూడెంకు చెందిన సున్నం నాగేంద్రబాబు రాజమండ్రి జైలులో ఖైదీగా ఉన్నాడు. అతను పశ్చిమగోదావరి జిల్లా తడికలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటార్ సైకిళ్ళ దొంగతనం కేసులో నిందితుడు కావడంతో వాయిదా కోసం జైలు నుంచి ఇద్దరు కానిస్టేబుళ్ళు బేడీలతో అతనిని చింతలపూడి కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టు బయట మూత్రవిసర్జనకు వెళ్ళాలంటూ చెప్పగా సంకెళ్ళతో పక్కకు తీసుకువచ్చారు. అయితే ఆకస్మాత్తుగా కానిస్టేబుళ్ళు పడవేసి సమీపంలోని పొలాల్లోకి పరారయ్యాడు. దీంతో ఖంగుతిన్న కానిస్టేబుళ్ళు అతన్ని పట్టుకునేందుకు వెంటపడ్డారు. అతను ఊర్లగూడెం సమీపంలోని ఒక తాటి చెట్టు ఎక్కి కూర్చున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. ఎట్టకేలకు వాయిదా సమయానికి కోర్టుకు తరలించారు. అక్కడి నుండి రాజమండ్రి జైలుకు తీసుకువెళ్ళారు.

కట్నం కోసం భర్త వేధింపులు

పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

భీమవరంక్రైం : తన భర్త, భర్త తరుపు బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన చెల్లంగి బాల టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బాలకు వేల్పూరుకు చెందిన ఏసుబాబుతో 1999లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహ సమయంలో బాల తల్లిదండ్రులు రూ.4లక్షలు కట్నం, 10 కాసుల బంగారం ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్ళుగా భర్త, అతని బంధువులు చెల్లంగి సత్యనారాయణ, గోడి సత్యనారాయణ, గోడి కృష్ణవేణి, గుడాల గజలక్ష్మి అదనపు కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తుండటంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ పీటీవీ రమణ తెలిపారు.

బ్యాగ్ దొంగిలించారంటూ ఫిర్యాదు

భీమవరంక్రైం : మద్యం దుకాణంలో తన బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారంటూ పెనుగొండ బాలసత్యశ్రీనివాస్ టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పాలకొల్లుకు చెందిన బాలసత్య శ్రీనివాస్ రాయలంలో ఉంటూ ఒక డెంటల్ కళాశాలలో ఎంబీబిఏ చదువుతున్నాడు. అయితే ఈనెల 10వ తేదీన రాత్రి 7గంటల సమయంలో జేపీ రోడ్డులోని కనకదుర్గ వైన్స్ షాపునకు వెళ్ళి పైఅంతస్తులో బ్యాగ్ పెట్టి మద్యం కోసం కిందకు వచ్చారు. తిరిగి పైకి వెళ్ళే సరికి బ్యాగు కనిపించలేదు. ఆ బ్యాగ్‌లో శ్యామ్‌సంగ్ ట్యాబ్, కొన్ని విలువైన వస్తువులు ఉన్నాయి. వాటి విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని శుక్రవారం బాలసత్యశ్రీనివాస్ టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రమణ తెలిపారు.

మద్యం మత్తులో డ్రెయిన్‌లో పడి యువకుడి మృతి

పాలకోడేరు : మద్యం మత్తులో డ్రెయిన్‌లో పడి పెన్నాడకు చెందిన అల్లు సూరిబాబు(25) మృతి చెందినట్టు పాలకోడేరు పోలీసులు తెలిపారు. సూరిబాబు గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి తిరిగి వస్తున్నాడు. మద్యం మత్తులో ఉండటంతో పెన్నాడ సెంటర్‌లోని రోడ్డు పక్కన ఉన్న డ్రెయిన్‌లో పడిపోయాడు. అయితే ఎవరూ గమనించకపోవడంతో తెల్లవారేసరికి డ్రెయిన్‌లో విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గ్రామ వీఆర్వో మధు శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకోడేరు పోలీసులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యార్థినులను వేధిస్తున్న ముగ్గురు యువకులపై కేసు

తణుకు: విద్యార్థినులను వేధిస్తూ వారి తల్లిపై దాడి చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. పైడిపర్రు గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు తణుకులోని ఒక ప్రైవేటు పాఠశాలలో 8,10 తరగతులు చదువుతున్నారు. ప్రతీ రోజూ ఇంటి వద్ద నుంచి సైకిల్‌పై స్కూలుకు వెళ్లి తిరిగి వస్తుంటారు. ఈ క్రమంలో పైడిపర్రుకు చెందిన చీర్ల అంజి, కొప్పిశెట్టి సాయి కిషోర్, ఆనంద సతీష్ వేధింపులకు పాల్పడుతున్నారు. దీనిపై విద్యార్థినుల తల్లి ఆ యువకుల తల్లిదండ్రులకు సమాచారం అందించి మందలించింది. దీనిని మనసులో ఉంచుకున్న యువకులు ఈనెల 14వ తేదీన పైడిపర్రు సెంటర్‌లో ఆమెపై దాడి చేశారు. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు : 19 లీటర్ల మద్యం స్వాధీనం

ఏలూరుక్రైం :
జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, శుక్రవారం నిర్వహించిన దాడుల్లో మూడు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ వై.వి.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎటువంటి సారా ఆనవాళ్ళు కనిపించకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న వారిపై నిఘా ఉంచడంతో పాటు జిల్లాల్లోని 48 మండలాల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులను మండల ఇన్‌చార్జ్‌లుగా నియమించి ఆ మండలంలోని గ్రామాల్లో గ్రామ కమిటీలు కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, వారి సమాచారాన్ని వెంటనే సేకరించి అరెస్టు చేస్తామన్నారు. 48 మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి వ్యూహాత్మకంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ప్రత్యేక బృందాలు అందించిన సమాచారంతో దాడులు నిర్వహించి వెంకట్రామపురానికి చెందిన కడలి నాగేశ్వరరావు, కామవరపుకోటకు చెందిన చిగడపు రాములు, కాకర్లమూడి గ్రామానికి చెందిన కొల్లి అడవి ధనుంజయరావులను అరెస్టు చేసి వారి నుంచి 19 లీటర్ల మద్యం, ఎనిమిది లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నట్టుగా భాస్కరరావు తెలిపారు.

దోపిడీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఏలూరుక్రైం : ఆటో ఎక్కిన ప్రయాణికుడిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్ళి అతని వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించినట్టు ఇద్దరు యువకులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ ఏలూరులోని స్పెషల్ మొబైల్ కోర్టు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.వెంకటేశ్వర శర్మ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం లింగపాలెం మండలం యడవల్లి గ్రామానికి చెందిన కాకాని భాస్కర్ 2016 జనవరి 19వ తేదీ రాత్రి ఏలూరు పాతబస్టాండ్ వద్ద తన గ్రామం వెళ్ళే ఆటోల కోసం ఎదురుచూస్తుండగా ఆటోతో ఇద్దరు యువకులు వచ్చి తాము కూడా లింగపాలెం వైపే వెళ్తున్నామని నమ్మబలికి భాస్కర్‌ను ఎక్కించుకున్నారు. చింతలపూడి రోడ్డు ఎఫ్‌సీఐ గొడౌన్స్ ప్రాంతంలోని తమ్మిలేరు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్ళి అతనిని బెదిరించి రూ.230 నగదు, సెల్‌ఫోన్ అపహరించుకుని ఆటోతో వెళ్ళిపోయారు. బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి టూటౌన్ సీఐ యు.బంగార్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరానికి పాల్పడ్డ ఏలూరు టైటస్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బోడిపోగు రాజు (22), ఏలూరు ఇజ్రాయిల్ పేటకు చెందిన కొండమూది నాని(27)లను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఏలూరు మొబైల్ కోర్టులో విచారణ సాగింది. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి మూడు నెలల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి.మాధవి వాదించగా ప్రాసిక్యూషన్‌కు అప్పటి సీఐ యు.బంగార్రాజు, ప్రస్తుత టూటౌన్ సీఐ జి.మధుబాబు, కోర్టు కానిస్టేబుళ్ళు సహకరించారు.

మృతదేహం ఖననానికి అభ్యంతరం

క్రైస్తవ శ్మశానవాటికకు తరలింపు

వేడంగిపాలెంలో ఘటన


గ్రామపెద్దలతో చర్చిస్తున్న ఎస్ఐ కె.రామకృష్ణ, (ఇన్‌సెట్‌లో) వెంకాయమ్మ మృతదేహం

పోడూరు : వేడంగిపాలెంలోని హిందూ శ్మశానంలో అదే గ్రామానికి చెందిన గంధం వెంకాయమ్మ (90) మృతదేహాన్ని ఆమె బంధువులు శుక్రవారం ఖననం చేసేందుకు సిద్ధపడగా గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో వారిమధ్య వాగ్వివాదం జరిగింది. వెంకాయమ్మ హిందూ మతస్తురాలైనప్పటికి తర్వాత క్రిస్టియన్ మతం తీసుకుంది. వయోభారంతో ఆమె శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని దహనం చేయకుండా ఖననం చేయాలని ఆమె బంధువులు నిర్ణయించుకుని గ్రామంలోని హిందూ శ్మశానంలో ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే వెంకాయమ్మ క్రైస్తవ మతం తీసుకుందని ఆమె మృతదేహాన్ని హిందూ శ్మశానంలో ఖననం చేసేందుకు కుదరదని దహనం చేయాల్సిందేనని ఆమె సామాజిక వర్గీయులు తెగేసి చెప్పారు. దీంతో మృతురాలి బంధువులు, ఆ సామాజిక సంఘం పెద్దల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వివాదం తారాస్థాయికి చేరకుండా గ్రామపెద్దలు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. పోడూరు ఎస్ఐ రామకృష్ణ, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి మృతురాలి బంధువులతో, గ్రామ పెద్దలతోనూ చర్చలు జరిపారు. సర్పంచ్ మేకా నాగబాబు, మాజీ ఉపసర్పంచ్ జక్కంపూడి జయరామ్ గ్రామపెద్దలు మృతురాలి బంధువులకు నచ్చజెప్పడంతో మృతదేహాన్ని పాలకొల్లు క్రిస్టియన్ శ్మశానవాటికకు తీసుకెళ్లి ఖననం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

టాటా ఏస్ వ్యాను ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఏలూరుక్రైం : మోటారు సైకిల్‌పై వెనుక కూర్చున్న ఒక వ్యక్తిని టాటా ఏస్ వ్యాను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పెదవేగి మండలం మొండూరుకు చెందిన మోర్ల కొండలరావు (55) ఆయన స్నేహితుడైన నాగరాజు మోటారు సైకిల్‌పై శుక్రవారం ఏలూరు వెళ్తున్నారు. మార్గం మధ్యలో ఏలూరు సమీపంలో సోమవరప్పాడు వద్ద వెనుక నుంచి టాటా ఏస్ వ్యాను మోటార్ సైకిల్‌ను ఢీ కొనడంతో కొండలరావు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ప్రమాద సమాచారం తెలిసి దెందులూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్ ఆసుపత్రికి వచ్చి క్షతగాత్రుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వి.ఆర్.మోహన్‌ను ఆదేశించారు. వైద్యులు ఎంఎల్‌సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

ఏలూరుక్రైం : ఒక యువతిని ఆమె ఇంటి వద్ద దించుతానని మాయమాటలు చెప్పి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని కిడ్నాప్ చేసిన యువకుడిని ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ ఎ.పైడిబాబు శుక్రవారం అరెస్టు చేశారు. ఏలూరులోని యాదవనగర్‌కు చెందిన ఒక యువతి వన్‌టౌన్‌లోని స్నేహితుల ఇంటి వద్ద జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి తన ఇంటికి వెళ్ళే నిమిత్తం ఏలూరు జూట్‌మిల్లు వద్ద నిలబడి ఉండగా ఆమెకు పరిచయం ఉన్న వట్లూరునకు చెందిన కోరం ప్రతాప్‌కుమార్ అలియాస్ పండు(24) ఇంటి వద్ద దించుతానని మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని దెందులూరు మండలం వేగవరంలోని అతని సోదరి ఇంటి వద్దకు తీసుకువెళ్ళి ఆమెను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేశాడు. బాధితురాలు ఈ విషయం తనకు కుటుంబ సభ్యులకు చెప్పి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. త్రీటౌన్ ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేసి ప్రతాప్‌కుమార్‌ను శుక్రవారం అరెస్టు చేశారు.




నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

ప్రకృతి షాట్..!

అందాలను బంధించేది, అనుభూతులను పంచేది , తీపిగుర్తులను మిగిల్చేది ఫొటో. ఫొటో తీస్తే అది వందేళ్ళ జ్ఞాపకం. గతంలో కెమెరాలకు పరిమితమైన ఫొటో నేడు సెల్‌ఫోన్‌ల్లోకి వచ్చి చేరింది. ఫొటో అంటే కాంతి. 1550 కాలంలో కుంభాకర కటకం సహాయంతో కెమెరాలతో ఫొటోలు తీసేవారు. ఆ తరువాత బ్రిటిష్ శాస్త్రవేత్తలు లూయిస్ జిక్స్‌వాండ్ డాగ్గిర్, ఫెన్రీ ఫ్యాక్స్ టాల్ బాట్‌లు సంయుక్తం చేసిన పరిశోధనల ఫలితంగా ఆధునిక ఫొటో ఆవిర్భవించింది. 1850 నాటి నుంచి ఫొటోగ్రఫీ మరింత అభివృద్ధి చెందుతూ బ్లాక్‌అండ్‌వైట్ నుంచి రంగుల ఫొటోల వరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. కెమెరా సృష్టికర్త లూయిస్‌జిక్స్‌వాండే డాగ్గిర్ చేసిన కృషికి గుర్తుగా కెమెరా ఆవిష్కరణ అయిన ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కెమెరాలో బంధించిన ప్రకృతిలో కొన్ని అందాలివి..

- ఫొటోలు : నాని, తాడేపల్లిగూడెం



ప్రకృతి పెంచిన అందం .. తాటిచెట్లకు అల్లుకున్న పాదులు



కురుల.. షోయగం...



వలస వచ్చిన కొంగలు



ఇలా వేస్తే.. అలా పులస పడాల్సిందే...

రోగాల ఫాస్ట్ ఫుడ్

వేడివేడిగా ఉంటుందని మక్కువ చూపుతున్న ప్రజలు

జనాల ఆరోగ్యంతో ఆడుకుంటున్న నిర్వాహకులు

అనారోగ్యాలతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న జనం



సాయంత్రం అయితే చాలు.. వేడివేడి పదార్థాలతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పిలుస్తుంటాయి.. బజ్జీల దుకాణాలు, పానీ పూరీ, బిర్యానీ పాయింట్ల వద్ద జనాలు వాలిపోతుంటారు.. వేడివేడిగా కడుపులోకి ఏదో ఒకటి పోనిచ్చేస్తుంటారు.. నాలుకకు రుచిమాత్రమే తెలుసు.. తినేపదార్థం చెడ్డ చేస్తుందా.. మంచి చేస్తుందా అనేది దానికేం తెలుసు.. చాలా మంది కడుపు నింపుకోవడం కోసమే చూస్తారు కానీ.. తరువాత వాటివల్ల తలెత్తే అనారోగ్య సమస్యలు గురించి పట్టించుకోరు.. ఆనక ఆసుపత్రుల పాలైనపుడు నాలుక్కరుచుకుంటారు..ఇదివరకు పట్టణాల్లో మాత్రమే కనిపించే పాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఇప్పుడు ఎక్కడ చూసినా కనపడుతున్నాయి...అయితే పాస్ట్‌ఫుడ్ సెంటర్లల్లో జరిగే కల్తీ గురించి తెలిసిన వారు ఎవరూ వాటి జోలికి వెళ్ళరు. ఒక్కసారి వాటి పరిస్థితి ఏంటో చూద్దాం..

- భీమవరంక్రైం, తాడేపల్లిగూడెం అర్బన్



పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తయారుచేసే పదార్థాలు గాని, వాటికి వాడే నూనె గాని, చికెన్ తదితర పదార్థాలు నిల్వ అయినవే ఎక్కువుగా ఉంటాయి. ఫ్రైడ్‌రైస్, న్యూడుల్స్ వంటివి వేడివేడిగా చేయించుకుని అక్కడే తినేసి వందల్లో సొమ్ము చెల్లిస్తున్నారు. అయినకాడికి సొమ్ము చేసుకోవడమే తప్ప ప్రజల ఆరోగ్యాలతో వారికేం పని.. నాణ్యమైన పదార్థాలతో తయారు చేసే ఆలోచన వారికి ఉండదు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో ఈ పాస్ట్‌ఫుడ్ బళ్ళు ఎక్కువగా దర్శనమిస్తుంటాయి. జనం కూడా వాటివైపే మక్కువ చూపుతున్నారు. ప్రయాణాలు చేసేవారు ఈ పాస్ట్‌పుడ్‌ను ప్యాక్ చేయించుకుని మరీ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు.

కొన్ని ఫాస్ట్‌ఫుడ్ దుకాణాల్లో ఇదీ పరిస్థితి..



ఫ్రైడ్‌రైస్ చేసేటప్పుడు వాడే నూనె బాగా కాగి కాగి ఉంటుంది. దానిలో నిల్వ ఉన్న కోడిగుడ్లు వేస్తారు. తరువాత ఉల్లిపాయలు, క్యాబేజీ, క్యారెట్ వంటివి తురిమి వేస్తారు. వెనిగర్, సోయాసాస్, టేస్టింగ్ సాల్ట్, షోడా తదితర పదార్థాలను వేస్తారు. వెనిగర్, సోయాసాస్ వంటివి ధర అధికంగా ఉండటం వల్ల కల్తీ చేసి తీసుకువస్తారు. కలర్‌తో నింపిన చికెన్ ముక్కలను వేస్తారు. అయితే చికెన్ ఏ రోజుకారోజు అయిపోతే ఫర్వాలేదు. వ్యాపారం సరిగా లేక చికెన్ మిగిలిపోతే మాత్రం ఒకటెండు రోజులు ఫ్రిజ్‌లో ఉన్న చికెన్‌ను వాడుటుంటారు. తక్కువ రకం క్వాలిటీతో ఉన్న రంగులను వాడతారు. దానివల్ల కడుపులో కలిగే అనర్థాలు చాలా ఉంటాయి. రైస్ కూడా మార్కెట్లో కల్తీ జరిగిన రైస్‌నే వాడుతారు. న్యాడిల్స్‌లో కూడా అంతే.. మైదాతో అతి తక్కువ క్వాలిటీ ఉపయోగించి ఇంటి వద్దే తయారు చేసి తీసుకువచ్చి చేస్తుంటారు. ఇలా నాసిరకం పాస్ట్‌ఫుడ్‌ను ప్రజలు తింటూ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు. పాస్ట్‌ఫుడ్‌లు తినడం వల్ల చిన్నారుల్లో అనేక రకాల జీర్ణకోశ వ్యాధులు, తదితర వ్యాధులు వ్యాపిస్తాయని వైద్యులే చెబుతున్నారు.



వైన్‌షాప్‌లే వీటికి కేరాఫ్ అడ్రస్


పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఒక్క తాడేపల్లిగూడెం పట్టణంలోనే సుమారు 20 వరకు ఫాస్ట్‌పుడ్ సెంటర్లు ఉన్నాయి. ఇవి అన్నీ ఎక్కువగా వైన్‌షాప్‌లు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్స్‌లో అయితే మద్యంతో పాటు, ఆహారం కూడా దొరుకుతుంది. వైన్‌షాప్‌ల వద్ద ఆపరిస్థితి ఉండదు. ఈ కారణంగా వైన్‌షాపులు పరిసర ప్రాంతాల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్లలో వినియోగించే నూనె కూడా తక్కువ రకానికి చెందినది కావడంతో తక్కువ ధరకు లభిస్తున్నాయి. ప్లేట్ ఫ్రైడ్‌రైస్ (వెజ్) రూ.50, చికెన్ ఫ్రైడ్‌రైస్ రూ.60, వెజ్ నూడిల్స్ రూ.40, చికెన్ నూడిల్స్ రూ.60, కబాబ్ రూ.40, లాలిపాప్స్ (చికెన్) రూ.10, జాయింట్స్ ఒక్కొక్కటి రూ.50, సింగిల్ ఎగ్ రూ.20, డబుల్ ఎగ్ రూ.30కు విక్రయాలు సాగుతున్నారు. వీరి వద్దనే వెజ్ మంచూరియా, చికెన్ మంచూరియాలు అమ్ముతున్నారు. సాయంత్రమైతే చాలు ప్రధానంగా మందుబాబులు, యువత ఇక్కడే ఎక్కువగా కన్పిస్తారు. శుచి-శుభ్రతకు అంత ప్రాధాన్యం ఇవ్వకపోయిన పెద్ద హోటళ్లతో పోల్చుకుంటే ధరలో చాలా వ్యత్యాసం ఉండటంతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల వద్ద వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. వీటిలో వినియోగించే మషాలా, సుగంధ ద్రవ్యాలు నాసిరకంగా ఉంటున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన ఫుడ్ క్వాలిటీ కంట్రోలు అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.



కల్తీ నూనెతో తయారు చేస్తున్న నూడుల్స్



కల్తీ కాలమ్



ఫాస్ట్‌ఫుడ్ వల్ల లివర్, జీర్ణకోశ వ్యాధులు



రోడ్డు పక్కన బళ్ళల్లో వేడివేడిగా చేస్తున్నారన్న ఆలోచనతో ప్రజలు పాస్ట్‌ఫుడ్‌లను ఎక్కువగా తింటుంటారు. వాటికి ఈ మధ్యకాలంలో బాగా ఆదరణ పెరిగింది. ఇవి తినడం వల్ల అనేక రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఎక్కువ శాతం ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల్లో యువత కనపడుతున్నారు. వారిని ప్రశ్నిస్తే రాత్రి పూట పాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తింటామని చెబుతున్నారు. పాస్ట్‌ఫుడ్‌ల్లో వాడే కల్తీ పదార్థాల వల్ల కడుపులో ఉన్న పేగుల్లో పుండ్లు వ్యాపించి అల్సర్, గ్యాస్ట్రబుల్ తదితర అనారోగ్య పరిస్థితులు వస్తాయి. అరుగుదల సరిగా లేకపోవడం వల్ల లివర్ దెబ్బతిని పచ్చకామెర్లు తదితర వ్యాధులు కూడా వస్తాయి. అలాగే చిన్నారుల్లో పాస్ట్‌ఫుడ్‌లు ఎక్కువ తినడం వల్ల అరుగుదల తగ్గి అనేక వ్యాధుల బారిన పడుతున్నారు.చక్కగా ఇంటి వద్దనే పదార్థాలను తయారు చేసుకుని తింటే ఆరోగ్యంతో పాటు డబ్బు ఆదా అవుతుంది..

- డాక్టర్ ఎం.వీరాస్వామి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

ఆ...ర్టీసీ!

● **పదవీ విరమణ వయసు పెంపుపై మిశ్రమ స్పందన**

● **రెండేళ్ల పెంపునకు ససేమిరా**

● **కింది స్థాయి సిబ్బంది నిరాసక్తత**

ఏ నిర్ణయమైనా భిన్నాభిప్రాయాలుంటాయి.. ఒకరు అవునంటే.. మరొకరు కాదంటారు.. ఇది కామన్.. ఏ విషయమైనా ఇంతే.. మరి ఆర్‌టీసీలో పదవీ విరమణ వయసు రెండేళ్లు పెంపు సంగతేంటి.. అందులోనూ అంతే.. ఒకరు కాదంటే మరొకరు అవునంటున్నారు.. పదవీ విరమణ తరువాత పనిచేయలేమని కింది స్థాయి సిబ్బంది అంటే.. ఏం పరవాలేదని ఉన్నతస్థాయి సిబ్బంది అంటున్నారు. ఇది విన్నవారు..ఆ...పెంచుతామంటే కాదంటున్నారా.. అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఈ నేపథ్యంలో "ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

తణుకు: ఆర్‌టీసీలో ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై మిశ్రమ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 58 ఏళ్లకే ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారు. ఎన్ఎంయూ (నేషనల్ మజ్దూర్ యూనియన్) గత ఎన్నికల్లో 60 ఏళ్లకు పెంచాలనే డిమాండ్ చేసింది. ప్రభుత్వం కూడా హామీ ఇచ్చింది. అమలుకు ఈనెల 25వ తేదీన విజయవాడలో ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించనున్నారు. అయితే దీనిపై కింది స్థాయి సిబ్బంది ఏమను కుంటున్నారు.. 60 ఓకేనా..కాదా.. అనే దానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఒత్తిడిని జయించలేక వద్దంటున్నారు..

ఆర్‌టీసీలో రెండు విభాగాలుంటాయి. ఒక విభాగంగా అడ్మినిస్ట్రేటివ్, మరొక విభాగం రవాణా లో ఉంటుంది.అయితే ఈ రెండు విభాగాలు సక్రమంగా పనిచేస్తేనే ఆర్‌టీసీ పరుగులు పెడు తోంది. ఏ విభాగం నీరసించినా ప్రమాదకరమే. మరొక పక్క ఆర్‌టీసీ బస్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి కత్తి మీద సాములా ఉంటుంది. ఎందుకంటే నిరంతరం టెన్షన్..ఈ నేపథ్యంలో 58 ఏళ్ళు నిండకుండానే చాలా మంది డ్రైవర్లు మృత్యువాత పడిన సంఘటనలు చూస్తుంటాం. అంతే కాకుండా ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఎక్కువ కాలం జీవించిన ఆర్‌టీసీ కార్మికులు కూడా తక్కువే. ఎందుకంటే నిరంతర ఒత్తిడి కారణంగా జీవితకాలం తగ్గిపోతోంది. అంతే కాకుండా పైస్థాయి ఉద్యోగులు కింది స్థాయి ఉద్యోగులను అనునిత్యం వేధింపులకు గురి చేస్తుంటారు. ఇంక్రిమెంట్లలో కోత విధిస్తుంటారు. దీంతో మరో రెండేళ్ల పెంపు ప్రతిపాదనలపై రెండో విభాగం అసహనం వ్యక్తం చేస్తున్నారు.అయితే మొదటి విభాగం సిబ్బంది మాత్రం రెండేళ్ల పెంపు ప్రతిపాదనకు ఓకే అంటున్నారు. ఇలా భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

8 డిపోలు.. 4 వేల ఉద్యోగులు...

జిల్లాలో ఏలూరు, భీమవ రం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, జంగారెడ్డిగూడెం 8 డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 4 వేల ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రభుత్వం పదవీ విరమణ వయస్సు పెంచుతామని హామీ ఇచ్చిన 2014 నుంచి జిల్లాలో 300 మంది పదవీ విరమణ చేశారు. వచ్చే డిసెంబర్ నాటికి జిల్లాలో 147 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయను న్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం పదవీ విరమణ వయసు పెంచితే వీరికి ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తరువాత ఉద్యోగం చేయడానికి ఇష్టపడడం లేదు.






పెంపు మాకొద్దు

పదవీ విరమణ వయసు పెంపునకు క్రింది స్థాయి ఉద్యోగులు సుముఖంగా లేరు. పదవీ విర మణ తరువాత మళ్లీ ఉద్యోగం చేయాలని కోరుకోవడం లేదు. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా షటిల్ అయిపోవాలనే భావన ప్రతీ ఒక్కరిలోనూ ఉంది.

- ములగాల వెంకటరత్నం, ఎంప్లాయీస్ యూనియన్, డిపో కార్యదర్శి



మెజార్టీ అనుకూలమే

మెజార్టీ కార్మికులు పదవీ విరమణ వయసు పెంపునకు అనుకూలంగా ఉన్నారు. రోజూవారీ పనులు చేసేవారు పనిచేయడం కష్టంగా ఉంటుంది. దీంతో కింది స్థాయి ఉద్యోగుల్లో కాస్త వ్యతిరేక భావం ఉంది.

- భగవాన్, ఎన్ఎంయూ డిపో కార్యదర్శి

మధురం మకరందం

నేడు ప్రపంచ తేనెటీగల దినోత్సవం

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి)

తేనె అత్యంత మధురమైనది. ఔషధ గుణం కలిగి ఉంటుంది. అమూల్యమైన పోషక విలువలు ఉంటాయి. ప్రతీ ఇంట్లో తేనె ఉంటే శుభసూచికమన్న విశ్వాసం జనంలో ఉంది. ప్రపంచంలో పోషక విలువలు ఉండే పంట ఉత్పత్తుల్లో 90 శాతం తేనెటీగల కృషి వల్లే అంటూ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉద్యాన పంటల్లో అత్యధిక దిగుబడులు సాధించడంలో తేనెటీగల ప్రాధాన్యం ఎంతగానో ఉంది. ప్రపంచంలో తేనెటీగల ప్రాముఖ్యతను గుర్తిస్తూ ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని ఆగస్టు 19న నిర్వహిస్తున్నారు. రైతుల్లో తేనెటీగల పరిరక్షణ, సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల దేశంలోను తేనె ఉత్పత్తిపై ఆదరణ పెరిగింది. దీనిపై ప్రభుత్వం సైతం ప్రోత్సాహం కల్పిస్తోంది.

తేనెటీగల్లో ఐదు రకాలు..

తేనెటీగల్లో ప్రధానంగా ఐదు రకాలు ఉన్నాయి. కొండ తేనెటీగలు, చిన్న/విన కర్ర పట్టు తేనెటీగలు, పుట్ట తేనెటీగలు, ఐరోపా తేనెటీగలు, కొండిలేని తేనెటీగలు ప్రసిద్ధి చెందాయి. అందులో కొండ తేనెటీగలు, చిన్న తేనెటీగలు రైతుల పెంపకానికి అనువైనవి కాదు. వీటికి కుట్టే స్వభావం ఎక్కువ. రైతులు తేనె పట్టు సాగు చేసుకోవడానికి పుట్ట, ఐరోపా, కొండిలేని తేనెటీగలు అనువైనవి.



తేనెటీగల కాలనీలు పరిశీలిస్తున్న అధికారులు

రైతు సాగుకు ఉపయోగపడే ఈగలు

ఐరోపా తేనెటీగలు...ఇవి కాలనీల నుంచి ఎక్కువ దూరం వెళ్తాయి. సంవత్సరానికి ఒక పట్టు నుంచి 15 నుంచి 20 కిలోల తేనె సమకూరుతుంది. స్థాన మార్పిడి చేస్తే 25-30 కిలోల తేనె లభిస్తోంది.

పుట్ట తేనెటీగలు..

ఇవి చీకటి ప్రదేశంలో ఎక్కువగా ఉండేందుకు ఆసక్తి చూపుతాయి. ఒకదానివెనుక ఒకటి పట్టును నిర్మించుకుంటాయి. ఒకపట్టులో 5 నుంచి 7 కిలోల తేనె వస్తుంది. రైతులు పెంచేందుకు ఇది అనువైన రకం.

కొండిలేని తేనెటీగలు..

ఇవి పెంపకానికి అనువైనవి. మట్టికుండల్లో పెంచుకునేందుకు అవకాశం ఉంటుంది. తేనెను స్వల్పమోతాదులో మాత్రమే ఉత్పత్తి చేస్తాయి. ఇవి చెట్ల లోను, గోతుల్లోను, చీకటి ప్రాంతాల్లో పట్టు ఏర్పరుచుకుని తేనెను ఉతత్పత్తిచేసాయి. ఈ తేనెలో ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి.

ఆదాయం ఘనం ..

తేనెటీగల సాగు ఇటీవల అధికమైంది. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో తేనె పట్టు సాగుపై శిక్షణ ఇస్తున్నారు. రైతులు కూడా ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు. వాస్తవానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఏటా 11.2లక్షల టన్నుల తేనె ఉత్పత్తి అవుతుంది. మన దేశంలో మాత్రం 12 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. దాంతో తేనె ఉత్పత్తి కోసం ప్రభుత్వం అనేక ప్రోత్సహకాలు కల్పిస్తోంది. రైతుల్లో, గిరిజన యువతకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుంది.

ప్రతీ ఏటా ఆరు బ్యాచ్‌లకు శిక్షణ

ఉద్యానవిశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రతీ ఏటా ఆరుబ్యాచ్‌లకు ఆరురోజుల పాటు శిక్షణ ఉంటుంది. ముఖ్యంగా గిరిజనులకు శిక్షణ ఇచ్చి సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా ఉత్పత్తి అయ్యే తేనెను మార్కెట్‌లో విక్రయించుకోవడానికి కృషి చేస్తున్నాం. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ప్రత్యేకంగా గిరిజనుల కోసం నిధులు సమకూరుస్తోంది.

- శాస్త్రవేత్త డాక్టర్ శాలి రాజు



అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?


మెంటల్ ఎబిలిటి


Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

(1 - 5): ఒక కోడ్ భాషలో NATIONALను 86523867 గాను, VOLUME ను 937401 గాను రాశారు. ఈ కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

1. **'LIMIT' కు సరైన కోడ్?**
ఎ) 27052 బి) 72025 సి) 52702 డి) ఏదీకాదు
2. **'ATTENTION' కు సరైన కోడ్?**
ఎ) 655185238 బి) 618555832
సి) 688532551 డి) ఏదీకాదు
3. **'LOVE' కు సరైన కోడ్?**
ఎ) 1379 బి) 3179 సి) 7391 డి) ఏదీకాదు
4. **'UNIT' కు సరైన కోడ్?**
ఎ) 4825 బి) 2458 సి) 8542 డి) ఏదీకాదు
5. **MOVE కు సరైన కోడ్?**
ఎ) 0391 బి) 3190 సి) 1903 డి) ఏదీకాదు
6. **4, 22, 108, 430, 1288, -----------**
ఎ) 2579 బి) 2574 సి) 2457 డి) 2547
7. **8, 3, 2, 3, 10, -------**
ఎ) 56 బి) 64 సి) 49 డి) 96
8. **10, 9, 20, 57, 232, ---------**
ఎ) 1155 బి) 1165 సి) 1175 డి) 1150
9. **85, 40, 69, 54, 72, 14, 56, ---------**
ఎ) 40 బి) 48 సి) 86 డి) 30
10. **13, 18, 31, 49, 80, -------**
ఎ) 192 బి) 129 సి) 921 డి) 219
11. **కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?**



ఎ) 12 బి) 13 సి) 15 డి) 10
12. **a - c - cb - ab - cab - ba - ca -**
ఎ) bacacbc బి) aabbccc
సి) caabbcc డి) ఏదీకాదు
13. **a - c - bc - acda - da - ca - cd**
ఎ) dbbdbb బి) bddbbb
సి) bbdbbd డి) ఏదీకాదు
14. **UZ, OR, IL, EH, -------**
ఎ) AF బి) FA సి) EB డి) BE
15. **AAZ, BDX, DIT, HPN, -----------**
ఎ) PFY బి) YPF సి) PYF డి) FYP
16. **క్యాలెండర్: తేదీలు :: నిఘంటువు: -------**
ఎ) అర్థాలు బి) పదాలు సి) వాక్యాలు డి) ఏదీకాదు
17. **రెస్టారెంట్ : మెను :: లైబ్రరి : --------**
ఎ) పుస్తకాలు బి) చదువు సి) కేటలాగ్ డి) ఏదీకాదు

(18 - 20) - భిన్నమైనదాన్ని తెలపండి


18. ఎ) తేయాకు బి) పొగాకు సి) చెరకు డి) జొన్న
19. ఎ) 196 బి) 144 సి) 64 డి) 36
20. ఎ) KBPY బి) NRMJ సి) JDQW డి) HTSG
21. **ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అరవింద్ ఇలా అంటున్నాడు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కూతురి భర్త భార్యకు ఏకైక సోదరుడి భార్య భర్త' అయితే అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?**
ఎ) సోదరుడు బి) మేనమామ
సి) తండ్రి డి) కుమారుడు
22. **పార్కుకి వెళుతున్న వ్యక్తిని చూపిస్తూ అమృత్ ఇలా అంటున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక అల్లుడి భార్య సోదరుని తల్లికి భర్త' అయితే పార్కుకి వెళుతున్న వ్యక్తికి అమృత్ ఏమవుతాడు?**
ఎ) మనవడు బి) మేనల్లుడు
సి) కుమారుడు డి) అల్లుడు

(23 - 25): A, B లు సోదరులు. A, C లు వివాహిత జంట. B తల్లి M. C కుమారుడు K. A, B ల సోదరి Q. Z భార్య Q. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

23. **A కి Z ఏమవుతారు?**
ఎ) సోదరుడు బి) కుమారుడు
సి) బావ డి) మేనమామ
24. **Q కి K ఏమవుతారు?**
ఎ) కుమారుడు బి) అల్లుడు
సి) సోదరుడు డి) మేనల్లుడు
25. **M కి C ఏమవుతారు?**
ఎ) కుమార్తె బి) కోడలు సి) మేనకోడలు డి) వదిన
26. **సూర్యోదయం తరవాత వివేక్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలబడ్డాడు. స్తంభం నీడ వివేక్‌కు ఎడమవైపున ఉంది. అయితే వివేక్ ఏ దిశను చూస్తూ నిలబడ్డాడు?**
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) ఏదీకాదు
27. **ఉదయం సూర్యునివైపుగా అచ్యుత్ నడకకు బయలుదేరాడు. కొంత దూరం తరవాత ఎడమవైపునకు తిరిగి నడిచాడు. మరల ఎడమవైపునకు తిరిగి నడుస్తున్నాడు. అయితే అచ్యుత్ చివరగా ఏ దిశలో నడుస్తున్నాడు?**
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) తూర్పు
28. **వినోద్, వివేక్, విక్రమ్, విశాల్ క్యారమ్స్ ఆడుతున్నారు. వినోద్, విక్రమ్‌లు భాగస్వాములు. విక్రమ్ తూర్పునకు ముఖంతో ఉన్నాడు. విశాల్ దక్షిణానికి ముఖంతో ఉన్నాడనుకొంటే పడమరకు ముఖంతో ఉన్న వ్యక్తి?**
ఎ) వినోద్ బి) వివేక్ సి) విశాల్ డి) ఎవరూకాదు
29. **ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?**


5	9	17
32	63	125
86	171	?

ఎ) 346 బి) 348 సి) 341 డి) 382
30. **ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి**




ఎ) 61 బి) 84 సి) 38 డి) 64

(31-35)



పై రేఖాచిత్రాన్ని ఆధారంగా చేసుకొని కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. **గాయకులు, క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) K బి) I సి) E డి) B
32. **గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) G బి) D సి) F డి) E
33. **క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) L బి) H సి) D డి) K
34. **గాయకులైన విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) C బి) A సి) K డి) J
35. **కేవలం గాయకులను సూచించే అక్షరం?**
ఎ) B బి) D సి) I డి) A
36. **P అంటే x. Q అంటే ÷. R అంటే - . S అంటే +. అయితే 4P36Q3R752 విలువను తెలపండి?**
ఎ) 48 బి) 43 సి) 52 డి) 54
37. **A అంటే +. B అంటే x. C అంటే -. D అంటే ÷ అయితే 40D8A3B7C5 విలువను తెలపండి**
ఎ) 21 బి) 26 సి) 24 డి) 23
38.



పై డయాగ్రం ఆధారంగా ఎడమవైపున ఉన్న పాచికకు అడుగు ముఖభాగంలో ఉండే అక్షరం?
ఎ) C బి) A సి) E డి) F
39. **FRIENDSHIP పదంలో మొదటి అక్షరం ఆరో స్థానంలోకి, ఆరో అక్షరం మొదటి స్థానంలోకి, రెండో అక్షరం ఏడో స్థానంలోకి, ఏడో అక్షరం రెండో స్థానంలోకి, ఇలా పదంలోని అక్షరాలన్నీ మారాయి. మారిన తరవాత ఏర్పడిన నూతన పదంలో కుడి నుంచి అయిదో అక్షరానికి గల మూడో ఎడమ అక్షరం?**
ఎ) H బి) N సి) R డి) F
40. **ప్రస్తుతం అనుపమ్ వయసు కంటే అతని తండ్రి వయసు నాలుగు రెట్లు. అయిదేళ్ల తరవాత అతని తండ్రి వయసు అనుపమ్ వయసు కంటే మూడు రెట్లు అయితే ప్రస్తుతం అనుపమ్ తండ్రి వయసు?**
ఎ) 40 బి) 30 సి) 35 డి) 45
41. **లీపు సంవత్సరంలో జనవరి నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల?**
ఎ) మార్చి బి) జూన్ సి) ఏప్రిల్ డి) జూలై
42. **పాట్నాకు ప్రతి 80 నిలకు ఒక రైలు ఉంది. విచారణాధికారి తనను కలసిన ప్రయాణికుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాత రైలు గం.10.15లకు అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?**
ఎ) గం.9.10ని బి) గం.10.20ని
సి) గం.9.30ని డి) ఏదీకాదు
43. **కింది సిరీస్‌లో ముందు సరి సంఖ్య ఉండి తరవాత బేసి సంఖ్య గల సరిసంఖ్యలు ఎన్ని ఉన్నాయి?**
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏదీకాదు
44. **ఈ రోజు ఆగస్టు 15 గురువారం. కిందటి ఏడాది లీపు సంవత్సరం అయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?**
ఎ) సోమవారం బి) ఆదివారం
సి) శనివారం డి) ఏదీకాదు

సమాధానాలు

1) బి 2) ఎ 3) సి 4) ఎ 5) ఎ 6) బి 7) సి 8) ఎ 9) డి 10) బి 11) బి 12) ఎ 13) బి 14) ఎ 15) సి 16) బి 17) సి 18) డి 19) సి 20) బి 21) సి 22) ఎ 23) సి 24) డి 25) బి 26) ఎ 27) సి 28) ఎ 29) సి 30) ఎ 31) బి 32) డి 33) ఎ 34) సి 35) డి 36) బి 37) ఎ 38) డి 39) ఎ 40) ఎ 41) సి 42) ఎ 43) సి 44) బి

ఉద్యోగాలు

ఐఆర్‌డిఏఐ

హైదరాబాద్‌లోని ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డిఏఐ)- **అసిస్టెంట్ మేనేజర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 30
విభాగాలవారీ ఖాళీలు: ఆక్చ్యూరియల్ 4, అకౌంట్స్ 4, లీగల్ 2, జనరల్ 20
అర్హత: 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు విభాగాన్ని అనుసరించి ఐఎఐ/ ఎసిఏ/ ఐసిడబ్ల్యుఏఐ/ ఎసిఎంఏ/ ఎసిఎస్/ సిఎఫ్ఏ/ ఎల్ఎల్‌బి పూర్తిచేసి ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు మించకూడదు
ఎంపిక: ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, ఫేజ్ 2 - డిస్క్రిప్టివ్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా
ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్: అక్టోబరు 4న
ఫేజ్ 1 ఎగ్జామ్ సెంటర్లు: విజయవాడ, హైదరాబాద్
ఫేజ్ 2 ఎగ్జామ్ సెంటర్లు: హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, న్యూఢిల్లీ
దరఖాస్తు ఫీజు: రూ.650(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
వెబ్‌సైట్: www.irdai.gov.in

ఎన్‌పిసిఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్)- **ట్రేడ్ అప్రెంటిస్**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 80
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, టర్నర్ 5, మెషినిస్ట్ 5, ఎలక్ట్రీషియన్ 20, వెల్డర్ 10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 10
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
వయసు: జూలై 31 నాటికి 16 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: అభ్యర్థులు పదోతరగతితో పాటు సంబంధిత విభాగంలో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
ఆసక్తిగలవారు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 24
చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited, Kaiga site, Via Karwar, PO Kaiga ,Dt. Uttara Khand - 581400, Karnataka
వెబ్‌సైట్: www.npcil.nic.in

అడ్మిషన్స్

యుసిఇఒయు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యుసిఇఒయు)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద **ఎంఇ/ ఎంటెక్** ప్రోగ్రామ్స్‌లో ప్రవేశ ప్రక్రియను నిర్వహిస్తోంది.
ప్రవేశ ప్రక్రియ జరిగే తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: www.uceou.edu

ఇఫ్లూ

హైదరాబాద్‌లోని ద ఇంగ్లీష్ & ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ వారి స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ - **ఎమ్మే (ఇంగ్లీష్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు వ్యవధి: రెండేళ్లు
అర్హత: డిగ్రీ(ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా) పూర్తిచేసి ఉండాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: అక్టోబరు 31
వెబ్‌సైట్: www.efluniversity.ac.in

చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - బయాలజీ

1. తేలు జంతు రాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) కార్డేట బి) అనెలిడా
సి) ఆర్థ్రోపొడా డి) మొలస్కా

2. ఈల్ అనేది ఒక ....
ఎ) చేప బి) క్షీరదం సి) పక్షి డి) అకశేరుకం

3. కర్పరాన్ని కలిగి ఉన్న ప్రోటోజోవన్ ఏది?
ఎ) ఎల్ఫీడియం బి) యూగ్లీనా సి) వర్టిసెల్లా డి) నత్త

4. కింది వాటిలో నిజమైన సర్పం కానిది ఏది?
ఎ) గాజు పాము బి) బ్లైండ్ స్నేక్
సి) సముద్ర సర్పం డి) ట్రీ స్నేక్

5. వ్యాపనం ద్వారా శ్వాసక్రియను జరుపుకొనే జంతువు?
ఎ) తేలు బి) అమీబా సి) వానపాము డి) బి, సి

6. కింది వాటిలో కర్పరం లేని మొలస్కా వర్గపు జీవి ఏది?
ఎ) నత్త బి) డేవిల్ ఫిష్ సి) జలగ డి) ఏదీకాదు

7. కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
1. హైడ్రా నిడేరియా వర్గానికి చెందుతుంది
2. హైడ్రాలో నోరు పాయువుగా కూడా పనిచేస్తుంది.
ఎ) 1 బి) 2 సి) 1 & 2 డి) ఏదీకాదు

8. పురుషుల్లో ఉండే ప్రొస్టేట్ గ్రంథి బరువు సుమారుగా?
ఎ) 20 గ్రాములు బి) 100 గ్రాములు
సి) 85 గ్రాములు డి) 0.5 గ్రాములు

9. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పుట్టిన శిశువు కనీసం ఎన్ని కిలో గ్రాముల బరువు ఉండాలి?
ఎ) 2 బి) 4.6 సి) 5.2 డి) 3.3

10. 'బ్లూ బేబీ సింండ్రోమ్' ఉన్న శిశువులో ఏ అవయవంలో లోపాలుంటాయి?
ఎ) మెదడు బి) గుండె సి) కన్ను డి) ఊపిరితిత్తులు

11. 'డౌన్స్ సింండ్రోమ్' ఉన్న మానవునిలో ఎన్ని క్రోమోజోములు ఉంటాయి?
ఎ) 46 బి) 45 సి) 23 డి) 47

12. కింది కొన్ని ఎముకలు, అవి ఉండే భాగాల పేర్లు ఉన్నాయి. వాటిలో సరైన జత కానిది?
1. టిబియా - కాలు 2. అట్లాస్ - వెన్నెముక
3. కార్పెల్ - చేయి 4. స్టెపిస్ - ముక్కు
ఎ) 1, 4 బి) 3, 4 సి) 2, 3, 4 డి) కేవలం 4

13. 'కానిబాల్స్' అంటే?
ఎ) రక్తాన్ని పీల్చే జంతువులు
బి) ఫలాలు తినే జంతువులు
సి) మలాన్ని తినే జంతువులు
డి) తమ వంటి జీవులను తినే జంతువులు

14. కింది వాటిలో జలచర క్షీరదం?
ఎ) డుడాంగ్ బి) డాల్ఫిన్
సి) తిమింగలం డి) పైవన్నీ

15. వెంట్రుకల్లో ఉండే ప్రోటీన్?
ఎ) ఎవిడిన్ బి) కెసిన్
సి) కెరాటిన్ డి) కెరోటిన్

16. కింది వాటిలో అవశేష అవయవం?
ఎ) జ్ఞానదంతం బి) రెటీనా
సి) ప్లీహం డి) క్లోమం

17. 'ముస్కులర్ డిస్ట్రోఫి' దేనికి సంబంధించిన వ్యాధి?
ఎ) మెదడు బి) గుండె
సి) ఎముకలు డి) కండరాలు

18. చేప ప్రధాన విసర్జక పదార్థం?
ఎ) అమ్మోనియ బి) యూరియ
సి) యూరికామ్లం డి) క్రియాటిన్

19. కుల్యా వ్యవస్థను కలిగి ఉండటం ఏ జంతువు లక్షణం?
ఎ) వానపాము బి) స్పంజిక
సి) బద్దెపురుగు డి) అమీబా

20. కింది ఏ జీవిలో ఏక రక్త ప్రసరణ కలదు?
ఎ) కప్ప
బి) పాము
సి) ఏనుగు డి) చేప



21. చేప గుండెలో ఉండే కర్ణికల సంఖ్య?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

22. ఏ జంతువు గుండెలో మిశ్రమ రక్తం ఉంటుంది?
ఎ) చేప బి) కప్ప సి) మొసలి డి) పైవన్నీ

23. కింది వాటిలో చేపల లక్షణం కానిది?
ఎ) ఉష్ణరక్త జీవులు బి) బంధిత రక్త ప్రసరణ
సి) బ్రాంఖియల్ హృదయం డి) బాహ్య ఫలదీకరణ

24. మలంతో పాటు చీము, రక్తం రావడం ఏ వ్యాధి లక్షణం?
ఎ) ఫైలేరియ బి) మలేరియ
సి) అమీబిక్ డీసెంట్రీ డి) టైఫాయిడ్

25. 'ఎంటరిక్ ఫీవర్' అని ఏ వ్యాధిని పిలుస్తారు?
ఎ) టైఫాయిడ్ బి) మలేరియ
సి) ఫైలేరియ డి) క్షయ

26. ఏ రకానికి చెందిన ట్యూమర్‌ను శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చు?
ఎ) బినైన్ బి) మాలిగ్నెంట్
సి) బినైన్, మాలిగ్నెంట్ డి) ఏదీకాదు

27. అధిక బరువును కలిగి ఉన్న మానవుని బాడీమాస్ ఇండెక్స్ ఎంత?
ఎ) 18.5 కంటే తక్కు బి) 18.5 నుంచి 24.9
సి) 25 నుంచి 29.9 డి) 15.5 కంటే తక్కువ

28. కీలు చుట్టూ ఉండే ద్రవాన్ని ఏమంటారు?
ఎ) పెరిఫ్లూరల్ బి) పెరికార్డియల్
సి) సైనోవియల్
డి) మస్తిష్క మేరు ద్రవం

29. చేతి వేలితో ఒక వ్యక్తి కాలుపై నొక్కినప్పుడు గుంతలు ఏర్పడితే అతడు ఏ వ్యాధితో బాధపడుతున్నట్లు?
ఎ) స్కర్వీ బి) గౌట్ సి) ఫ్లోరోసిస్ డి) ఎడిమా

30. కింది వాటిలో ఎగిరే చేప ఏది?
ఎ) టార్పెడో బి) ఎక్సోసీటస్
సి) డాల్ఫిన్ డి) డెవిల్ ఫిష్

31. పుట్టిన పిల్లల్లో శ్వాసక్రియ రేటు?
ఎ) 32 బి) 16 సి) 25 డి) 70

32. మానవుని శరీరంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) మూత్రపిండం డి) ప్లీహం

33. సీతాకోకచిలుక ఆకారంలో ఉండే వినాళ గ్రంథి?
ఎ) పీయూష బి) అధివృక్క
సి) అవటు డి) పార్శ్వ అవటు(పారా థైరాయిడ్)

34. టిబియా అనే ఎముక ఏ భాగంలో ఉంటుంది?
ఎ) చేయి బి) కాలు సి) చెవి డి) ముక్కు

35. 'వెరికోస్' అనేది దేనికి సంబంధించిన వ్యాధి?
ఎ) ధమనులు బి) ఎర్రరక్త కణాలు
సి) కాలేయం డి) సిరలు

36. చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?
ఎ) బ్రౌన్ ఫ్యాట్ బి) పసుపు ఫ్యాట్
సి) ఎరుపు ఫ్యాట్ డి) బ్లూ ఫ్యాట్

37. పాలలో ఉండే ప్రోటీన్ ఏది?
ఎ) లాక్టోజ్ బి) ఎవిడిన్ సి) కెరాటిన్ డి) కెసిన్

38. కింది వాటిని జతపరచండి.
1. కణ మేధస్సు ఎ. మైటోకాండ్రియ
2. కణ కొలిమి బి. కేంద్రకం
3. కణ భాండాగారం సి. రిక్తిక
4. కణ వంటశాల డి. హరితరేణువు
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి బి) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి డి) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ

39. మానవుని రక్త వర్గాలకు సంబంధించి ఎన్ని జన్యు రూపాలు ఉంటాయి?
ఎ) 4 బి) 2 సి) 8 డి) 6

40. 'పెప్సిన్' అనేది ఒక ......
ఎ) హార్మోన్ బి) ఎంజైమ్ సి) విటమిన్ డి) స్టిరాయిడ్

41. కణం ప్రోటీన్ల కర్మాగారం అని దేన్ని పిలుస్తారు?
ఎ) లైసోజోమ్ బి) పెరాక్సిజోమ్
సి) రైబోజోమ్ డి) మైటోకాండ్రియ

42. ఎగిరే క్షీరదం అని దేన్ని పిలుస్తారు?
ఎ) డాల్ఫిన్ బి) తిమింగలం
సి) గబ్బిలం డి) డుడాంగ్

43. పాలలో లభించని పోషక పదార్థం?
ఎ) కాల్షియం బి) ప్రోటీన్లు సి) ఇనుము డి) పైవన్నీ

44. హెర్పిస్ అనే వ్యాధిని కలుగజేసింది?
ఎ) బ్యాక్టీరియా బి) శిలీంధ్రం
సి) ప్రోటోజోవన్ డి) వైరస్

45. వైడాల్ : టైఫాయిడ్ :: బయాప్సి : ....
ఎ) రేబీస్ బి) క్యాన్సర్ సి) ఎయిడ్స్ డి) సిఫిలిస్

46. ఉసిరిలో పుష్కలంగా లభించే విటమిన్?
ఎ) విటమిన్-సి
బి) విటమిన్-ఇ
సి) విటమిన్-డి
డి) విటమిన్-ఎ



47. మూత్రంలో విసర్జితమయ్యే విటమిన్?
ఎ) విటమిన్-డి బి) విటమిన్-సి
సి) విటమిన్-కె డి) విటమిన్-ఎ

48. బటన్, మిల్కి, పాడిస్ట్రా అనేవి?
ఎ) పుట్టగొడుగు రకాలు బి) వరి రకాలు
సి) మామిడి రకాలు డి) అరటి రకాలు

49. కింది వాటిలో రక్తనాళాలు లేని జంతువు ఏది?
ఎ) వానపాము బి) బొద్దింక సి) కప్ప డి) పైవన్నీ

50. పట్టుపురుగుల పెంపకాన్ని ఏమంటారు?
ఎ) ఎపికల్చర్ బి) మోరికల్చర్
సి) ఒలేరికల్చర్ డి) సెరికల్చర్

సమాధానాలు

1) సి	9) డి	17) డి	25) ఎ	34) బి	43) సి
2) ఎ	10) బి	18) ఎ	26) ఎ	35) డి	44) డి
3) ఎ	11) డి	19) బి	27) సి	36) ఎ	45) బి
4) ఎ	12) డి	20) డి	28) సి	37) డి	46) ఎ
5) డి	13) డి	21) ఎ	29) డి	38) బి	47) బి
6) బి	14) డి	22) బి	30) బి	39) డి	48) ఎ
7) సి	15) సి	23) ఎ	31) ఎ	40) బి	49) బి
8) ఎ	16) ఎ	24) సి	32) ఎ	41) సి	50) డి
			33) సి	42) సి	

ఉద్యోగాలు

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - **మెరైన్ ఇంజనీర్స్** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన **'జిఎంఇ'(గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్) కోర్స్‌**కు దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులో 8 నెలల ప్రీ సీ ట్రైనింగ్, 10 నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది.
మొత్తం ఖాళీలు: 40
కోర్సు ఫీజు: రూ.4,50,000
క్యాంపస్: ఎస్‌సిఐ మారిటైం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, పొవై, ముంబై
కోర్స్ ప్రారంభం: అక్టోబరు 1 నుంచి
అర్హత: ఆగస్టు 31 నాటికి బిఇ/ బిటెక్(మెకానికల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. మహిళలకు రెండేళ్ల సడలింపు వర్తిస్తుంది
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000(ఎస్సీ/ ఎస్టీలకు రూ.500)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: www.shipindia.com

ఇఎస్ఐసి

కోల్‌కతాలోని ఇఎస్ఐసి పీజీఐఎంఎస్ఆర్ & ఎంసి - కాంట్రాక్ట్ ప్రాతిపదికన **ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 23
పోస్టుల వారీ ఖాళీలు: ప్రొఫెసర్ 7, అసోసియేట్ ప్రొఫెసర్ 11, అసిస్టెంట్ ప్రొఫెసర్ 5
విభాగాలు: అనెస్థీషియా, బ్లడ్ బ్యాంక్/హెమటాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఇఎన్‌టి, జనరల్ మెడిసిన్, మైక్రో బయాలజీ, ఆప్తల్మాలజీ, పీడియాట్రిక్స్, పాథాలజీ, సైకియాట్రి, రేడియాలజీ, టిబి/ చెస్ట్ మెడిసిన్.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 69 ఏళ్లు మించరాదు
ఇంటర్వ్యూలు: సెప్టెంబరు 4 నుంచి 7 వరకు
వేదిక: ESIC - PGIMSR & MC, Joka, Kolkata
వెబ్‌సైట్: www.esic.nic.in

జిటిఆర్ఇ

డిఆర్‌డిఒ ఆధ్వర్యంలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ - **గ్రాడ్యుయేట్/ డిప్లొమా/ ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీస్‌**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 152
- **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీస్**
ఖాళీలు: 90
అర్హత: బిఇ/ బిటెక్ / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: నెలకు రూ.4,984
- **డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీస్**
ఖాళీలు: 30
అర్హత: డిప్లొమా / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: నెలకు రూ.3542
- **ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీస్** **ఖాళీలు:** 32
అర్హత: రెండేళ్ల ఒకేషనల్ కోర్స్ / తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: ప్రభుత్వ నిబంధనల మేరకు
ఎంపిక: అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును పోస్టు ద్వారా పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
చిరునామా: The Director Gas Turbine Research Establishment, CV Raman Nagar, Bangalore - 560093

ఎంఒఐఎల్

నాగపూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఒఐఎల్)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు: 13**
పోస్టులు: మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) 8, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ) 3, సీనియర్ మేనేజర్(జియాలజీ) 1, మేనేజర్(సెక్యూరిటీ) 1
అర్హత: పోస్టును అనుసరించి ఎంబిబిఎస్/ పీజీ (జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ)/ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.100
ఇంటర్వ్యూలు: మేనేజర్ పోస్టులకు ఆగస్టు 20న, ఇతర పోస్టులకు సెప్టెంబరు 4న
వేదిక: Moil Bhawan, 1 - A KATOL Road, Nagpur - 440013
వెబ్‌సైట్: www.moil.nic.in



స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందిస్తాం : డీసీసీబీ చైర్మన్ రత్నం

చింతలపూడి : జిల్లాలో సొసైటీ ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు విరివిగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) అన్నారు. శుక్రవారం చింతలపూడి సొసైటీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా పాలకవర్గం ఆయనను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సహకార రుణాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలు ఇవ్వడానికి సహకరిస్తామన్నారు. నలమాటి రామకృష్ణ, మక్కినవారిగూడెం సొసైటీ అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ, ఫణికుమార్, బోడా నాగభూషణం, శేషగిరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసేవ



రూ. 48 లక్షలతో

సీసీ రోడ్ల నిర్మాణం

వేంపాటి సత్యబాబు
ఎంపీటీసీ, లింగపాలెం మండలం

‘ మండలంలోని భోగోలు గ్రామాన్ని సుందర గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గ్రామంలో అంతర్గత రహదార్లను సీసీ రోడ్లుగా మార్పు చేశాం. సుమారు రూ. 48 లక్షలతో ఆరు రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశాం. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షలతో రెండు సీసీ రోడ్లు, బీసీ కాలనీలో రూ.3.85 లక్షలతో ఒక రోడ్డు, తూర్పు రామాలయం రోడ్డు రూ. 5.36 లక్షలతో సీసీ రోడ్డు, రాయన్నపాలెం ఎస్సీ ఏరియాలో రూ.4.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించాం. నాబార్డు నిధులు, ఉపాధి హామీ నిధులు రూ. 25 లక్షలతో రెండు రోడ్లను నిర్మిస్తాం. ’

● లింగపాలెం



● గ్యాస్ సమాచారం

చింతలపూడి గాయత్రి (భారత్) గ్యాస్ ఏజెన్సీ శనివారం గ్యాస్ సరఫరా చేసే ప్రాంతాలు..

మల్లాయిగూడెం, పోతునూరు, శివపురం, దిద్దుపూడి, చిన్నంపేట, కందుకూరు, మల్లేశ్వరం, యండపల్లి, రాఘవాపురం, లింగగూడెం, గణిజర్ల, కాంతంపాలెం, వెంకటాపురం, వెంకటాద్రిగూడెం, పట్టాయిగూడెం, ఎల్ఎన్ పురం, కామవరపుకోట, కొత్తూరు

● గ్యాస్ బుకింగ్ కోసం ఫోన్ నెంబర్లు
08823 - 222340,223655,223440
ఆన్‌లైన్ బుకింగ్ కోసం : 9440156789

● చింతలపూడి

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

చింతలపూడి	: 98856 65001
కామవరపుకోట	: 98662 37516
లింగపాలెం	: 94413 89314

● సినిమాలు

చింతలపూడి :

శ్రీరత్నమినీ	నేనే రాజు నేనే మంత్రి
శ్రీరత్న	లై
గౌరి	స్పైడర్‌మాన్
శారదామినీ	జయ జానకి నాయక

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే పీతల సుజాత

చింతలపూడి : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే సుజాత అన్నారు. శుక్రవారం ప్రగడవరం గ్రామంలో యర్రంపల్లి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన బ్రాంచి ఆఫీసును ఆమె ప్రారంభించారు. రూ. 17.50 లక్షల వ్యయంతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గొడౌన్‌ను డీసీసీబీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు జె.చెన్నకేశవరెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు, రైతుల కుటుంబాలు బాగుండాలని సీఎం చంద్రబాబు రాష్ట్రంలో సాగునీటిపై దృష్టి పెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, అధికారులు వెంటపడి పనులు వేగవంతం చేస్తున్నారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కూడా సకాలంలో పూర్తి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, మెట్టప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటినప్పుడల్లా సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ ఎత్తిపోతల పథకాన్ని కూడా సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

25 వేల మంది రైతులకు రుణమాఫీ...

నియోజకవర్గంలో 25 వేల 550 మంది రైతులు రుణమాఫీ లబ్ధి పొందారని, ఇందుకోసం రూ. 181 కోట్లు ఖర్చు చేశారన్నారు. మండలంలో 7 వేల 907 మందికి రుణమాఫీ కాగా 56 కోట్ల 57 లక్షల రూపాయలు మాఫీ జరిగిందన్నారు. ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా మరిన్ని రుణాలు ఇస్తామని, అయితే లబ్ధిదారులు యూనిట్ పెట్టుకుంటేనే ఇస్తామని, దానివల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. డీసీసీబీ చైర్మన్ రత్నం మాట్లాడుతూ సింగిల్ విండో విధానం ఎన్టీఆర్ హయాంలో ప్రవేశపెట్టగా, చంద్రబాబు హయాంలో ‘పొలంబాట’ కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. దీనివల్ల పెట్టుబడి తగ్గి ఎక్కువ రాబడి వచ్చేవిధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. యూనిట్‌లు పెట్టుకున్న వారికే తమ సొసైటీ నుంచి సబ్సిడీ రుణాలు అందించగలమని చెప్పారు. ప్రగడవరంలో నెలకొల్పిన యర్రంపల్లి సొసైటీ గోడౌన్ అభివృద్ధికి రెండు లక్షల రూపాయల నిధులు ఉచితంగా అందజేస్తున్నామని, దీంతో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. టి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 1925లో యర్రంపల్లి సొసైటీ ఆవిర్భవించిందని, 11 గ్రామాల రైతులకు సేవలు అందిస్తుందని, గ్రామ సమస్యలను వివరించారు. తహసీల్దార్ మైఖేల్‌రాజు, ఎంపీపీ రామక్క, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, సొసైటీ ఉపాధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.



గొడౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుజాత, డీసీసీబీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు

వృత్తిదారులకు చేయూత

ఎమ్మెల్యే సుజాత

చింతలపూడి : వృత్తిదారులకు ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి చేయూతను అందిస్తుందని ఎమ్మెల్యే సుజాత అన్నారు. శక్రవవారం ప్రగడవరంలో మత్స్యసహకార సంఘ సభ్యులకు రూ. 4 లక్షల విలువైన వలలను 50 శాతం సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ సహాయ అధికారి పి.వి.సుబ్బారావు, ఎంపీటీసీ వీర్రాజు, ఎంపీఈఓ బి.మహేష్, పీసీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఇంటర్వ్యూలకు ఎక్కువ కౌంటర్లు తెరవాలి

లింగపాలెం : ఉపాధి సోపానం ఇంటర్వ్యూలకు ఎక్కువ కౌంటర్లు తెరచి ప్రశాంతంగా నిర్వహించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో రంగాపురం ఆంధ్రాబ్యాంక్ పరిధిలో జరిగిన ఇంటర్వ్యూల్లో గందరగోళం చోటు చేసుకుంది. రంగాపురం, కె. గోకవరం, పుప్పాలవారిగూడెం, ముడిచర్ల, వేములపల్లి, ఆశన్నగూడెం, బాదరాల గ్రామాలకు చెందిన సుమారు 350 పైబడి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఒక కౌంటర్ ఏర్పాటు చేయడంతో ఒక్కసారిగా అభ్యర్థులు లోనికి చొచ్చుకురావడంతో రసాభాసగా మారింది. దీనిపై ఎంపీడీవో కృష్ణకుమారిని వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, గరిమళ్ళ చలపతి, ఎంపీటీసీ వై. వెంకటేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



లింగపాలెంలో సోపానం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో

అభివృద్ధి చేస్తున్నాం

ఏలూరు రూరల్ : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే పీతల సుజాత అన్నారు. శుక్రవారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యమైన రహదారులను అభివృద్ధి చేయడంతోపాటు ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా మంజూరై నిర్మాణంలో ఉన్న వాటికి వెంటనే బిల్లులు చెల్లిస్తాం. చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు నీరు అందించే విధంగా పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎంపీపీ దాసరి రామక్క, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, లింగపాలెం ఎంపీపీ మల్లికార్జునరావు, పార్టీ మండల అధ్యక్షుడు రాము, కామవరపుకోట ఎంపీపీ కె.సుబ్బలక్ష్మి, పలువురు పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ యాగానికి భూమిపూజ

58 మంది దంపతుల పూజలు

చింతలపూడి : అనకాపల్లి అష్టలక్ష్మీపీఠం ఆధ్వర్యంలో 15వ అష్టలక్ష్మీ యాగానికి శుక్రవారం పీఠాధిపతి రఘునాథాచార్యస్వామి భూమిపూజ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు నిర్వహించిన భూమి పూజలో 58 మంది దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ లోక కల్యాణార్థం కోసం ఈనెల 30 నుంచి సెప్టెంబరు 9వ తేదీ వరకు పలు కార్యక్రమాలు, అర్చనలు, హోమాలు, జరుగుతాయన్నారు. అందుకోసం ఈరోజు భూమిపూజా కార్యక్రమం చేశామని, అమ్మవారి ఆశీస్సుల కోసం పూజా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. 30న అమ్మవారి శోభాయాత్ర, సెప్టెంబరు 1న అగ్ని ప్రతిష్ఠ, 2న హయగ్రీవ మంత్రోపదేశం, 3న లక్ష తమలపాకుల పూజ, 4, 5, 6 తేదీల్లో ఉభయ వేదాంత పండిత సభలు, 7న అమ్మవారి దీపోత్సవం, 8న సామూహిక లక్ష్మీనారాయణ పూజ, 9న కల్యాణం, మహాపూర్ణాహుతి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జల్లిపల్లి శివాజీ, మాడా శ్రీనివాసరావు, మాడా సత్యనారాయణ, ఎస్ఎస్ఎన్ గాంధీ, ఆదిమోహనరావు, తోట నారాయణ దంపతులు, పలువురు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీయాగంలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్త సమాచారం..

నేడు ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

కామవరపుకోట : స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు కార్యాలయ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు తెలిపారు. కామవరపుకోట ఇండియన్ బ్యాంకు పరిధిలో ఉన్న అంకాలంపాడు, గుంటుపల్లి, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, ఉప్పలపాడు గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ హాజరు తీసుకుంటామన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు, బ్యాంకు అధికారులు, మండల పరిషత్ కార్యాలయ అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

‘ఎత్తిపోతల’ను త్వరగా పూర్తిచేయాలి

చింతలపూడి : ప్రగడవరం విచ్చేసిన ఎమ్మెల్యే సుజాతకు రైతు నాయకుడు కె.చంద్రశేఖర్‌రెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేయాలంటూ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం భూసేకరణలో కొందరు రైతులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారని, వారి సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కామవరపుకోట : నులకానివారిగూడెం పాఠశాల విద్యార్థులకు శుక్రవారం దాతలు పుస్తకాలు పంపిణీ చేశారు. కుచ్చులపాటి సిద్ధయ్య, నక్షత్రం దంపతుల ఆర్థిక సాయంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకానికి కావలసిన ప్లేట్లు గ్లాసులు అందజేశారు. అనంతరం సిద్ధయ్య దంపతులను స్థానికులు, ఉపాధ్యాయులు అభినందించారు. పి.సువిశేషరావు, కె.దుర్గారావు, ప్రధానోపాధ్యాయుడు టోకూరి బలరామ్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

పెదవేగి : శ్రావణమాసం ఆఖరి శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వెళ్ళి పూజలు జరిపారు. మండల కేంద్రం పెదవేగిలోని శ్రీపార్వతీ పరమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.



పెదవేగి ఆలయంలో సామూహిక వ్రతాల్లో మహిళలు

ప్రజా సేవ



గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

దండమూడి సీతారాంప్రసాద్, సర్పంచ్, పునుకొల్లు

'గ్రామాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యే నిధులు రూ. 75 లక్షలు, 14వ ఆర్థిక సంఘం, ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ. 10 లక్షలు కలిపి మొత్తం రూ. 85 లక్షలతో గ్రామంలో సుమారు 2 కిలోమీటర్ల మేర సీసీ రహదారుల నిర్మాణం చేపట్టాం. రూ. 20 లక్షలతో 1.5 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి పనులు ప్రారంభించాం. గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 100 ఎల్.ఈ.డి. బల్బుల ఏర్పాటు కోసం పంచాయతీలో తీర్మానం చేసి పంపడం జరిగింది. వీటిలో త్వరలో ఏర్పాటు చేస్తాం. చిన్నారుల కోసం నూతనంగా రూ. 16 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం 60 శాతం పూర్తయింది.'

● పెదపాడు

భారీ వర్షం.. రైతుల హర్షం..

● పెదపాడు మండలంలో నూరు శాతం పూర్తయ్యే దశలో వరి నాట్లు

పెదపాడు : కొన్ని రోజులుగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతన్నల్లో ఆనందం కన్పిస్తోంది. గడచిన రెండేళ్ల కాలంలో పూర్తిస్థాయిలో వర్షాలు లేక సాగునీరు అందక మెట్ట ప్రాంతంలోచాలామంది రైతులు పంట భూములను అలానే వదిలేశారు. ఈ ఏడాది నూరు శాతం నాట్లు వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని పట్టిసీమ ఎత్తిపోతల నుంచి గోదావరి జలాలను కృష్ణా కాల్వలోకి విడుదల చేయడం, మరింత సాగునీరు అవసరమైన రైతాంగానికి పైపుల ద్వారా నీటిని మళ్లించడం వంటి చర్యలతో మండలంలో పలుచోట్ల గతంలో లేనంత విస్తృతంగా వరి నాట్లు పూర్తయ్యాయి. కాలువల ద్వారా నీటి విడుదలతో పాటుగా ప్రకృతి కూడా సహకరించి వర్షాలు కూడా పడుతుండటంతో రైతులకు సరిపడా సాగునీరు అందుబాటులో ఉంటోంది. పెదపాడు, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం కురిసిన వర్షంతో పలు ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. నాట్లు వేసుకున్న పంటపొలాలు వర్షాలతో ఎటు చూసినా పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి.



పెదపాడు పరిసరాల్లో కనువిందు చేస్తున్న పచ్చటి వరి చేలు

అభివృద్ధి పనుల్లో అందరూ భాగస్వాములు కావాలి

● ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పిలుపు

దెందులూరు : ప్రభుత్వపథకాలు, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పూర్తిస్థాయిలో భాగస్వాములై ప్రజల మనసులో స్థానం సంపాదించుకునేలా పని చేయాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కొవ్వలి గ్రామంలో 15 కిలోమీటర్ల మేర 12 కోట్ల రూపాయల సెంట్రల్ రోడ్డు నిధులతో నిర్మించనున్న ఆర్ అండ్ బీ రోడ్డు, సీసీ రోడ్లకు ఎంపీపీ పప్పుల సుశీల, జడ్పీటీసీ ముమ్మడి సక్కుకుమారి, ఏఎంసీ ఛైర్మన్ సురేంద్రనాథ్‌చౌదరిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతమనేని శంకుస్థాపన చేశారు. అనంతరం నీటిసంఘం అధ్యక్షుడు వడ్లపట్ల పండు, వెలమాటి అశోక చక్రధరరావు, గుత్తా రాజా, సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చింతమనేని మాట్లాడుతూ స్థానిక నేతలు అందరినీ కలుపుకుని వెళ్లాలని, ఎవరైనా సరే పార్టీ అభివృద్ధికి, సంక్షేమానికి, ప్రభుత్వ పథకాల అమలుకు పనిచేయాల్సిందేనని అన్నారు. పార్టీలో విభేదాలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, ఉపాధ్యక్షుడు అనిల్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్ రత్నాంజలి, ప్రజాప్రతినిధులు ఉన్నారు. అనంతరం పోతునూరు గ్రామంలో రెండు కోట్లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు సహకార సంఘం బ్యాంకు అధ్యక్షుడు ధూళిపాల నాగేంద్రవరప్రసాద్, సర్పంచ్ దాసు, ఎంపీటీసీ ధనికుమార్‌ల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ పోతునూరు గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నామని, జిల్లాలోనే ఏ గ్రామంలో లేని విధంగా సహకార సంఘం అధ్యక్షుడు వరప్రసాద్ సహకారంతో ఎక్కువ ఇళ్ళు నిర్మించామని పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని అన్నారు. పనిచేయని, స్పందించని నాయకులను పక్కనపెట్టి వేగవంతంగా పనిచేసి యువతరానికి అవకాశం ఇచ్చేలా కృషి చేయాలని చింతమనేని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండలాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, డొక్కు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో వేణుగోపాల్, తహసీల్దార్ సత్యనారాయణ, ఉపాధి ఏపీవో కిషోర్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ శేషగిరిరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.



కొవ్వలిలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



ప్రజాసాధికారత సర్వేపై సానిగూడెంలో నిర్వహిస్తున్న గ్రామసభ

అర్హులను తేల్చేందుకే గ్రామ సభలు

దెందులూరు : మండలంలో 2016వ సంవత్సరంలో ఇంటింటికీ తిరిగి నిర్వహించిన ప్రజాసాధికారత సర్వేలో ఇళ్లస్థలాలు, ఇళ్ళకోసం వచ్చిన దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అర్హులా కాదా అనేదానిపై క్షేత్రస్థాయిలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం సానిగూడెం, పలు గ్రామాల్లో ఇళ్ళు, ఇళ్ళస్థలాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నిజంగా ఇళ్ళు, ఇళ్ళస్థలాలు అవసరమా లేదా అనేది పరిశీలించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజారత్నం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రూబెల్లా వ్యాక్సిన్‌ను వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చిన్నారులకు వ్యాక్సిన్ ఇప్పించడం తప్పనిసరి

దెందులూరు : తట్టు, పొంగు బారిన చిన్నారులు పడకుండా ఎంతో ఖరీదైన రుబెల్లా వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని దెందులూరు ఎంపీపీ పప్పుల సుశీల, జడ్పీటీసీ ముమ్మడి సక్కుకుమారి అన్నారు. శుక్రవారం దోసపాడు, తదితర గ్రామాల్లో ప్రభుత్వపాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు చిన్నారులకు తట్టు, పొంగు వ్యాధిబారిన పడకుండా రుబెల్లా వ్యాక్సిన్‌ను అందజేశారు. పోతునూరులో సహకార బ్యాంకు అధ్యక్షుడు నాగేంద్రవరప్రసాద్, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోనేరు సురేష్ బాబు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంల్లో వ్యాక్సిన్‌ను అందజేశారు.



విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో సత్యనారాయణ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి

దెందులూరు : ప్రభుత్వపాఠశాలల్లో ఉత్తీర్ణతాశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్ళాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారి సింహాద్రి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం దెందులూరు, కొవ్వలి తదితర పాఠశాలల్లో విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారి విద్యాప్రమాణాలు మెరుగుపడేలా చూడాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు.



లబ్ధిదారులకు గేదెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పెదవేగి : ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఎస్సీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎస్సీ లబ్ధిదారులకు చూడి గేదెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా పెదవేగి మండలం విజయరాయిలో 9మంది ఎస్సీ లబ్ధిదారులకు చూడిగేదెలను ఎమ్మెల్యే ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ ఎస్సీలను అన్ని విధాలుగా ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందించడంతోపాటు ఎస్సీ రైతుల సంక్షేమానికి అనువుగా చూడిగేదెలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. పెదవేగి మండలంలో ఇప్పటివరకు 163మంది లబ్ధిదారులకు చూడిగేదెలను అందించామని ఆయన వివరించారు.

సిల్ట్ తొలగించాలని వినతి

వసంతవాడ (పెదపాడు) : గ్రామంలో పలు అంతర్గత రహదారుల వెంబడి ఉన్న కచ్చా డ్రెయిన్లలో పెద్దఎత్తున సిల్టు పేరుకుపోవడంతో మురుగునీటి పారుదల లేక ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోందని సిల్టు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. డ్రెయిన్లలో సిల్టు, మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దోమల ఉధృతి పెరిగిపోయి దోమకాటుకు గురవుతున్నామని వాపోతున్నారు. మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవడంతో పాటుగా దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, ఇబ్బందులు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పెదవేగిలో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతున్న చిత్రం

పెదవేగిలో ఉపాధి ఇంటర్వ్యూలు

పెదవేగి : నిరుద్యోగ యువత ఉపాధికి చేపట్టిన స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు శుక్రవారం కొనసాగాయి. పెదవేగి ఎంపీపీ దేవరపల్లి బక్కయ్య సమక్షంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలలో రామశింగవరం, కూచింపూడి, న్యాయంపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు. తొలి రోజు బయోమెట్రిక్ సక్రమంగా పనిచేయక దరఖాస్తుదారులు ఇబ్బందులు పడ్డారు. కాగా శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూలలో అభ్యర్థులకు వర్షం అడ్డంకిగా మారింది. అయితే బయోమెట్రిక్ కూడా సక్రమంగానే పనిచేసింది. లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన అనంతరం యూనిట్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ పేర్కొన్నారు.

వ్యాక్సిన్‌తో పిల్లలకు ఆరోగ్య రక్షణ

పెదవేగి : 9 నెలలనుంచి 15ఏళ్ళలోపు చిన్నారులకు మీజిల్స్(తట్టు), రుబెల్లా టీకాను వేయించడం ద్వారా వారికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.మనోజ్‌కుమార్ తెలిపారు. పెదవేగి మండలం కవ్వగుంటలో చిన్నారులకు ఎంఆర్ టీకాను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఎంఆర్ టీకాలు చిన్నారులను ప్రాణాంతకమైన తట్టు, పొంగు వ్యాధులనుంచి రక్షిస్తాయన్నారు.

హలో ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

దెందులూరు :	9912392539
పెదపాడు :	9491555163
పెదవేగి :	9440614633

జంబ్లింగ్ వర్డ్స్

1. LBOD ▶..........................
2. SGNI ▶..........................
3. FTLI ▶..........................
4. CPYO ▶..........................

జంతర్‌మంతర్

1. విలయంద్యా ▶..........................
2. వేశంమాస ▶..........................
3. కాగారారం ▶..........................
4. వాదేయంల ▶..........................

చెప్పగలరా?

ఆదిలో ఉన్నా
కానీ మదిలో లేను
యుగంలో ఉన్నా
కానీ సగంలో లేను
నీవులో ఉన్నా కానీ నీరులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో
చెప్పగలరా?

సూక్తి


తెలియని
విషయం గురించి
మాట్లాడటం అంటే -
నీ అవివేకాన్ని
బయటపెట్టుకోవడమే!

చుక్కలు కలపండి





World Photography Day



స్మైల్ ప్లీజ్



ఇంటి పండుగైనా.. బంధువుల ఇంట వేడుకైనా.. నలుగురు కలిసిన ఏ వేళైనా.. ఫొటో క్లిక్‌మంటుంది. అందమైన జ్ఞాపకం కెమెరా కన్నుల్లో మరింత అందంగా ముస్తాబవుతుంది. ఎన్నో భావాలకు, మరెన్నో మధురానుభూతులకు సాక్ష్యంగా నిలిచేది ఫొటో. ప్రకృతి అందాలు, పక్షుల సోయగాలు, సెలయేళ్ల హొయలు, నదీనదాల పరవళ్లు, ఆకాశ అద్భుతాలు, నేలమ్మ ఆనందాలు.. అన్నింటినీ ఇట్టే బంధించేస్తుంది కెమెరా. ఇప్పుడెందుకు ఫొటో ముచ్చట్లు అంటే.. ఈ రోజు 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'!

సెల్ఫీ.. సెన్సేషన్ సృష్టించినా.. సెగ్రూపీ.. గ్రూపులు కట్టినా.. ఫొటోకు సాటి రావు. మానవ జీవితంలో ఫొటోగ్రఫీకి విడదీయలేని అనుబంధం ఉంది. దానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుపు, తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలక్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్తపుంతలు తొక్కుతోంది.

రెండు గ్రీకు పదాల కలయికే 'ఫొటోగ్రఫీ'. ఫొటో అంటే కాంతి, గ్రఫీ అంటే గీయడం అని అర్థాలు. 'ఫొటోగ్రఫీ' అంటే.. కాంతితో చిత్రాన్ని గీయడం.

ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జె.ఎమ్. డాగ్యూరే, జోసెఫ్ నైస్‌ఫోరెలు 1837లో 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను ప్రపంచానికి పరిచయం చేశారు. 'ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' డాగ్యూరే రూపొందించిన 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను అధికారికంగా గుర్తించింది. ఆ తర్వాత 1839, ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం 'ఫొటోగ్రఫీ ప్రాసెస్' పేటెంట్ హక్కులను సొంతం చేసుకుని, ప్రపంచానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ప్రతి ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుతున్నారు.

మనదేశంలో 1857 వరకు ఫొటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. 1977 ముందు వరకు బ్రిటీష్ వాళ్లు, జమీందారులు, సిపాయిలు మాత్రమే ఫొటోలు తీసుకునేవారు. ఆ తర్వాత ఇది సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. లాలా దీనదయాళ్ భారత్‌లో తొలిసారిగా 'ఫొటోగ్రఫీ'కి శ్రీకారం చుట్టారు.

1860లో నలుపు, తెలుపు రంగుల ఫొటోలు కాస్త రంగుల్లోకి మారిపోయాయి. జేమ్స్ క్లార్క్ మ్యాక్స్‌వెల్ 'కలర్ ఫొటో'లకు ప్రాచుర్యం తెచ్చాడు.

- ❖ 1988లో మొదటి డిజిటల్ కెమెరా (ఫ్యూజీ డీఎస్-1పీ) అందుబాటులోకి వచ్చింది. ఫొటోను కంప్యూటరైజ్డ్ ఫైల్‌లో నిక్షిప్తం చేసుకునే సౌకర్యం వచ్చింది.
- ❖ మొదటి డిజిటల్ కెమెరాలో 1.4 మెగా పిక్సల్స్ మాత్రమే ఉండేది. ఆ కెమెరా ధర 10 వేల డాలర్లు.

స్మార్ట్ ఫోన్ రాక ముందు... ఎంతోమంది మెడలో కెమెరా వేసుకుని, లెన్స్ జూమ్ చేస్తూ.. తమకు ఇష్టమైన వాటిని ఫొటోలు తీస్తుండేవారు. అదో గొప్ప కళగా భావించేవారు. రాను రాను జనాలు కెమెరాలు కొనడం మానేశారు. కానీ ఆనాటి తరం కెమెరాల నుంచి ఈ నాటి అత్యాధునిక కెమెరాల వరకు అన్నింటికి చోటు కల్పిస్తూ హర్యానాలోని చక్కర్‌పూర్‌లో 'వింటేజ్ కెమెరా మ్యూజియం' ఇటీవలే ప్రారంభమంది. మనదేశంలోనే ఇది అతి పెద్దది కావడం విశేషం. దాదాపు ఇందులో 700 కెమెరాలు ప్రదర్శనకు ఉంచారు. 100 ఏళ్ల నాటి కెమెరాలను కూడా ఇక్కడ చూడొచ్చు. ఆదిత్యా ఆర్య అనే ఫొటోగ్రాఫర్ వీటిని సేకరించారు.




ప్రపంచంలోనే అతి ఎక్కువ ధర పలికిన కెమెరా 'డాగ్యురే టైప్'. ఇది 168 సంవత్సరాల క్రితం నాటిది. దీని ధర దాదాపు లక్షా ముప్పై రెండు వేల డాలర్లు కావడం విశేషం.

ఔనా!



కాకుల గుంపును **'మర్డర్'** అంటారు.

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



ఉరుములకు ఆడవారి కన్నా మగవారే 5 రెట్లు ఎక్కువ ఉలిక్కిపడతారు.

టంగ్ ట్విస్టర్స్

1. How many yaks could a yak pack pack if a yak pack could pack yaks?
2. There's a sandwich on the sand which was sent by a sane witch.
3. There was a little witch which switched from Chichester to Ipswich.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏమ్మా! రాణీ! స్కూలుకు ఇంత ఆలస్యంగా వచ్చావేమిటి?


రాణి : మా నాన్నగారు రోడ్డు చూసుకుంటూ వెళ్లమన్నారు టీచర్! రోడ్డంతా చూస్తూ వచ్చేసరికి ఈ సమయమైంది.

టీచర్ : !!!!!!!!!!



క్రాస్ వర్డ్

music editing   sound reports   voice weather   sports announce



జవాబులు

చెప్పగలరా? : ఆయువు
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BOLD 2. SIGN 3. LIFT 4. COPY
జంతర్‌మంతర్ : 1.విద్యాలయం 2. సమావేశం 3. కారాగారం 4. దేవాలయం



స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్-స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే అధికారులు, తదితరులు

రైళ్లలో శుభ్రత పాటిద్దాం

భీమవరం క్రైం : స్వేచ్ఛాయుత భారతదేశంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని, అలాగే ప్రభుత్వానికి సంబంధించిన వాటిల్లో స్వచ్ఛంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్-స్వచ్ఛత పక్వాడా అనే కార్యక్రమం ఎంతో విజయవంతమైందని భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎన్ దేవకుమార్ అన్నారు. ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్-స్వచ్ఛత పక్వాడా అనే కార్యక్రమాన్ని దేశమంతటా నిర్వహిస్తూ వస్తున్నారని, ఈ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులుగా భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రైల్వే ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశం కోసం మహాత్మాగాంధీ ఎంతో కలలు కన్నారని, ఇప్పుడు భారతదేశాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పరిశుభ్రత కోసం నిబద్ధతతో పని చేస్తున్న వారందరికీ కృతజ్ఞతలు అన్నారు. రోడ్ల పై చెత్త వేయను, రైళ్ళల్లో శుభ్రత విషయంలో చురుగ్గా పాలు పంచుకొంటానంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్ సీఐ ప్రసాదరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, టి శ్రీనివాసరావు, డి రవికిషోర్, ఎన్.కోటేశ్వరరావు, రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, వెంకట్రాజు, మాల్యాద్రి, శ్యామ్‌సుందర్, రంగ తదితరులు పాల్గొన్నారు.

10 ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి

పోలవరం : జిల్లాలో 10ర్యాంపుల్లో ఇసుక తవ్వకానికి అనుమతులు ఇచ్చామని జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ సి.మోహనరావు అన్నారు. పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం, గూటాల, తాడిపూడి, ప్రక్కిలంక, ఔరంగబాద్, కొవ్వూరు, ర్యాంపుల్లో పూడిక తీయడానికి అనుమతి ఇచ్చామని, అలాగే బల్లిపాడు, కోడేరు, ఖండవల్లి, ముత్యాలవారిపాలెం గ్రామాల్లో ఓపెన్ రీచ్‌లకు అనుమతులు ఇచ్చామన్నారు. ఓపెన్ రీచ్‌లో రోడ్లు వేయడానికి ఉపాధి హామీ పథకం ద్వారా పీఆర్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఓపెన్ రెంచ్‌లో ఇసుక యూనిట్ ధర రూ.500, పూడిక తీత ర్యాంపుల్లో యూనిట్ ధర రూ.800 నిర్ణయించామన్నారు. ఆయన వెంట ఏజీ జి.కృష్ణమూర్తి ఉన్నారు.

మళ్లీ వచ్చాయ్

- తీర గ్రామాల్లో విజృంభిస్తున్న దక్షిణాఫ్రికా విషపు ఈగలు
- ఇవి కుడితే ఇక అంతే సంగతులు
- వీటి బారినపడి ఇద్దరు మృతి
- నాలుగేళ్ల క్రితం ఈగలను చంపేందుకు పలు శాఖలు సంయుక్త ఆపరేషన్
- తాజాగా తాటాకిళ్లపై పుట్టలు

నరసాపురం :

ఈ ఈగ మామూలుది కాదు. నల్ల తాచు పాముకన్నా ప్రమాదకరం. ఇది కుడితే చాలు.. క్షణాల్లో శరీరం రంగు మారిపోతుంది. ఒళ్లంతా దద్దుర్లు, మైకం కమ్మడం, ప్రాణాలు పోవడం అంతా నిమిషాల్లో జరిగిపోతుంది. దక్షిణ ఆఫ్రికా అడవుల్లో సంచరించే ఇంటువంటి విషపూరితమైన ఈ ఈగలు తీర ప్రాంతానికి నాలుగేళ్ల తర్వాత మళ్లీ ప్రత్యక్షమయ్యాయి. వీటిని చూసి జనం హడలిపోతున్నారు. గతంలో వీటి బారిన పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మరికొందరికి సకాలంలో వైద్యం అందడంతో అప్పట్లో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గతంలో చెట్లకే పరిమితమైన ఈ ఈగలు నేడు తాటాకిళ్లపై గూడులు కట్టి తీర ప్రాంత ప్రజలకు కంటి మీద నిద్ర లేకుండా చేస్తున్నాయి. 2004 సునామికి ముందు తీర ప్రాంత ప్రజలు ఎటువంటి జంకు లేకుండా తోటల్లోకి వెళ్లేవారు. ఇటు కొబ్బరి దింపు, తాటాకులు, సరుకుడు తోటలు నరికేవారు కూడా పనులకు భయపడేవారు కాదు. 2004 సునామి తరువాత నరసాపురం, మొగల్తూరు మండలంలోని సముద్రతీరం ప్రాంతాల్లో పరిస్థితులు భయకంపితంగా మారాయి. ఓ పక్క సముద్ర అలలు, మరో వైపు విషపుటీగలు. సునామి తరువాత వెలుగు చూసినా ఈగలు ప్రజల్ని కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మొదటల్లో వీటి గురించి పెద్దగా తెలియని రైతులు, కూలీలు యాదావిదిగా తోటల్లోకి వెళ్లేవారు. 2005లో పీఎం లంకకు చెందిన ఓ రైతు, ఆయన కుమారుడు ఈ విషపుటీగల బారినపడ్డారు. తండ్రి మరణించగా కుమారుడు ప్రాణాల నుంచి బయటపడ్డారు. గత ఏడాది మొగల్తూరు మండలం కేపీపాలెంలో మరో వ్యక్తి ఈ ఈగ కారణంగా మరో వ్యక్తి చనిపోయాడు. అప్పుడు చెట్లపై పెట్టిన పుట్టలు విషపుటీగలని ప్రజలు గుర్తించారు. పీఎం లంకతో పాటు తూర్పుతాళ్ళు, సర్దుగొడప, చినలంక, కేపీపాలెం, పేరుపాలెం తదితర ప్రాంతాల్లో ఈ పుట్టలు ఉండటాన్ని గుర్తించారు. తాటి, కొబ్బరి చెట్లుపై పెట్టిన పుట్టలను గుర్తించక దింపు, కల్లుగీతకు ఎక్కిన కార్మికులు ఈ విషపుటీగల కాటుకు గురయ్యారు. వీరికి సకాలంలో వీరుగుడు వైద్యం అందించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. దీంతో ప్రజలు చాలాకాలం చీకటి పడితే తోటల్లోకి వెళ్లేందుకు బయపడేవారు. అంతేకాదు మంటలు కూడా తోటల్లో పెట్టేవారు కాదు.

నాలుగేళ్ల క్రితం పుట్టలు దహనం..

వీటిపై ప్రజలు అనేకమార్లు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో నాలుగేళ్ళ క్రితం రెవెన్యూ, ఓఎన్‌జీసీ ఫైర్, వైద్య శాఖ సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. ఎంతవేడినైనా తట్టుకునే దుస్తులు ధరించి ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. ముందుగా పుట్టలను గుర్తించి వాటి మీదకు మత్తు మందు స్ప్రే చేశారు. అ తరువాత మంటలను పెట్టి పుట్టలను దహనం చేశారు. ఈ ఆపరేషన్‌లోను కొందరు సిబ్బంది గాయపడ్డారు. వైద్యులు అందుబాటులో ఉండడంతో వీరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఆపరేషన్ తరువాత మళ్లీ చాలా కాలం ఈ టీగలు కనిపించలేదు

తాటాకిళ్లపై గూడులు..

అయితే ఈసారి ఈ టీగలు చెట్లపై కాకుండా తాటాకిళ్లపై కూడా గూడులు పెడుతున్నాయి. మండలంలోని పీఎంలంక గ్రామంలో ఒడుగు వెంకటరత్నం ఇంటిపై ఇప్పటికే కొన్ని ఈగలు గూడు కట్టాయి. వీటిని గుర్తించి వెంకటరత్నం ఇల్లును ఖాళీ చేసి మరో చోట నివాసం ఉంటున్నాడు. గతంలో మాదిరి గానే పీఎంలంక, తూర్పుతాళ్ళు, కేపీపాలెం, చినలంక గ్రామాల్లోని తోటల్లోను మళ్లీ టీగలు పుట్టలు కట్టాయి. దీంతో రైతులు ఒంటరిగా తోటల్లోకి వెళ్ళడం లేదు. ఇక పూరిళ్లల్లో ఉంటున్న వారు రెండు రోజులకు ఒక్కసారి కర్రతో ఇంటి పైకప్పును కొడుతున్నారు. ఇలా గూడులు పెట్టకుండా ముందుగానే అప్రమత్త మవుతున్నారు. ఏది ఏమైన తాచుపాముల కంటే విషపూరితమైన ఈ టీగలు తీరంలోకి మళ్లీ వసల రావడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఎటువైపు నుంచి వచ్చి కుడతాయోనన్న భయంతో బిక్కుబిక్కు మంటు గడుపుతున్నారు. ఇటు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

ఇంటిపై మట్టి గూడు

- ఒడుగు వెంకటరత్నం, పీఎంలంక



తాటాకిల్లుపై ఏదో మట్టి గూడు ఉంటే చీమల పుట్ట అనుకున్నా. అందులోంచి ఈగలు బయటకు రావడాన్ని చూసి విషపుటీగలుగా గుర్తించాను. ఇప్పటికే మా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ఈగలు కుట్టి ప్రాణాలు కోల్పోయాడు. ఇంటిపై గూడు కట్టడంతో ఏం చేయలో తెలియరాలేదు. మంట పెడితే ఎక్కడ కుడతాయన్న భయంతో ఆ సాహసం చేయలేదు. ఇళ్లను ఖాళీ చేసి వేరేచోట ఉంటున్నాం. పుట్టను తొలగించాలని ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

సకాలంలో వైద్యం అందించాలి



గతంలో ఈ టీగలు కుట్టిన బాధితులకు వళ్లంతా దద్దుర్లు రావడంతోపాటు బీపీ తగ్గి, నాలిక మొద్దు బారడం, కోమాలోకి వెళ్లిన లక్షణాలు కనిపించాయి. అయితే వారందరికీ సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పింది. కుట్టగానే కంగారు పడకూడదు. పాము కాటుకు గురైతే ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో అదే పద్ధతి అనుసరించాలి. అందుబాటులో ప్రాథమిక వైద్యులుంటే యాంటీవైరల్ ఇంజక్షన్ చేయించాలి. బాధితుని పరిస్థితిని బట్టి ఐసీయూలో ఉంచి ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది.

- డాక్టర్ అప్పాజీ, ఎండీ, నరసాపురం

సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

విషపుటీగల సంహారణపై వ్యవసాయ శాఖ, అగ్నిమాపక ఓఎన్‌జీసీ అధికారులతో ఇప్పటికే చర్చించాం. అయితే ఈ ఈగలు ప్రమాదకరం కావడంతో అనుభవజ్ఞులైన అగ్నిమాపక సిబ్బంది ఆవశ్యకత ఉంది. ఓఎన్‌జీసీ దీనికి అవసరమైన పనిముట్లను అందించేందుకు ముందుకు వచ్చింది. అయితే ఫైర్ సిబ్బంది కావలసి ఉంది. ఈ విషయాన్ని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో అన్నిశాఖల అధికారులతో సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించి గతంలో మాదిరిగానే పుట్టల నివారణకు చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్, సూర్యనారాయణరెడ్డి

పోలవరం నిర్మాణంలో ఏపీ కృషి భేష్

- వాటర్ రిసోర్సెస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుం సింగ్
- పోలవరం ప్రాజెక్టు పనులపై సంతృప్తి

(ఏలూరు సిటీ)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని ఈ పనుల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని, ఈ ప్రాజెక్టు పనుల పట్ల వాటర్ రిసోర్సెస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుం సింగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించిన వాటర్ రిసోర్సెస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఏలూరులో ఎంపీ మాగంటి బాబు ఇంటి వద్ద పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ కమిటీ చైర్మన్ హుకుం సింగ్ మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనబడిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంచి దృక్పథంతో ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే తలంపుతో ఉన్నారన్నారు. నీటి భద్రతను కాపాడడానికి ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ చర్యలు చేపట్టారన్నారు. నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని గోదావరిపై ఇంత భారీ ప్రాజెక్టును నిర్మించాలని నిర్ణయించారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ 2019 నాటికి మిగులు జలాలు సాధించే ఘనత దక్కించుకోనున్నదని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జలవనరుల ప్రాజెక్టులను సందర్శిస్తున్నామని, ఇందులో భాగంగానే పోలవరం ప్రాజెక్టును సందర్శించామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల తీరుపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని సింగ్ తెలిపారు. కమిటీ సభ్యుడు, రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ పట్టిసీమ ప్రాజెక్టుతోపాటు పోలవరం ప్రాజెక్టును సందర్శించి కమిటీ పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. ఏలూరు ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో 9 మంది పార్లమెంట్ సభ్యులు శుక్రవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారని, ఇప్పటికే పట్టిసీమ ద్వారా నీరు సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, 2019 కల్లా పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తవుతుందన్నారు. వాటర్ రిసోర్సెస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుం సింగ్‌తోపాటు తమిళనాడు అన్నాడీఎంకె ఎంపీ వి.సత్యభామ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అపరూప పొర్ధార్, పంజాబ్ శిరోమణి అకాళీదళ్ ఎంపీ సర్దార్ బల్విందర్ ఎస్.బుహుందర్, రాజస్థాన్ బీజేపీ ఎంపీ హర్షవర్ధన్‌సింగ్, దుంగర్‌పూర్, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, ఉత్తరాఖండ్ కాంగ్రెస్ ఎంపీ ప్రదీప్‌టంటా, ఒడిస్సా బీజేడీ ఎంపీ సిద్ధార్థ్ మహోపాత్రాలతోపాటు లోక్‌సభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ శివకుమార్, అడిషనల్ డైరెక్టర్ కుషాల్‌సర్కార్, సీనియర్ ప్రైవేటు సెక్రటరీ యోగేష్‌కుమార్, రిపోర్టింగ్ అధికారి సంజయ్‌కుమార్‌లతోపాటు జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఇంజనీరింగ్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ హుకుం సింగ్‌తోపాటు సభ్యులను, అధికారులను మాగంటి బాబు ఘనంగా సత్కరించారు.



హుకుం సింగ్, సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

జాతీయ ప్రాజెక్టులో పని చేయడం అదృష్టం

గేట్ల తయారీ కార్మికులతో హుక్కుం సింగ్

పోలవరం : జాతీయస్థాయి ప్రయోజనాలను కాపాడే ప్రాజెక్టులో పని చేసే అవకాశం రావడం అదృష్టమని గేట్ల తయారీ పనులు చేస్తున్న కార్మికులను ఉద్దేశించి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ హుక్కుం సింగ్ అన్నారు. పోలవరం ప్రాజెక్టును శుక్రవారం పరిశీలించిన ఆయన గేట్లు తయారు చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎంతో కష్టపడి పని చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఉమా మహేశ్వరరావు ఆయనకు తెలిపారు. బెక్కం కంపెనీ కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధి, పనులను పరిశీలిస్తున్న ఈఈ ఎం.బుల్లియ్యను హుక్కుం సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టు పోలవరం

రాజమహేంద్రవరం ఎంపీ మురళీమోహన్

దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టు పోలవరమని ఎంపీ మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ప్రాజెక్టు పనులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై పార్లమెంటరీ కమిటీ చాలా సంతోషం వ్యక్తం చేసిందని, శుక్రవారం ఉదయాన్నే ముఖ్యమంత్రి విజయవాడలో కమిటీ సభ్యులకు పూర్తి వివరాలు తెలియజేశారని, అక్కడే సంతృప్తి వ్యక్తం చేసిన సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మరింత సంతోషం వ్యక్తం చేశారన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2018నాటికి పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తి చేసి గ్రావెటీ ద్వారా నీరు అందిస్తామని, 2019కి పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తవుతుందన్నారు.

పోలవరంలో కేంద్ర బృందం



హిల్‌వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు గురించి వివరిస్తున్న ఇంజనీరింగ్ చీఫ్


పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో శుక్రవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుం సింగ్ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు.. ప్రాజెక్టు పనుల వివరాలను ఇంజనీరింగ్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు వారికి వివరించారు. అనంతరం వారు పట్టిసీమ ఎత్తిపోతల పథకం పరిశీలించారు..



ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు నమూనా ద్వారా గోదావరి ప్రవాహ తీరు పరిశీలిస్తున్న బృందం



పట్టిసీమ ఎత్తిపోతల గురించి వివరిస్తున్న ఎంపీ మాగంటి బాబు



పట్టిసీమ పంపుల వద్ద నీటి ప్రవాహాన్ని తిలకిస్తున్న కమిటీ చైర్మన్



పోలవరం ప్రాజెక్టు వద్ద గేట్ల తయారీ పరిశీలిస్తున్న సభ్యులు



మంత్రి దేవినేనితో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ హుకుంసింగ్

ముంచెత్తిన వాన

● జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలు

ఏలూరుసిటీ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల భారీగా, కొన్నిచోట్ల నానుడి వర్షాలు కురుస్తున్నాయి.గురువారం రాత్రి నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఈదురుగాలుల ప్రభావం ఎక్కువుగా కనిపించింది. ఎడతెరిపి లేని వర్షాలు జనజీవనాన్ని స్తంభింప చేశాయి. ఈ వర్షాలు పంటలకు అనుకూలిస్తాయని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు ఉపశమనం పొందారు. శుక్రవారం జిల్లాలోని ఏలూరుతో పాటు తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, నిడదవోలు, గణపవరం, నల్లజర్ల, అనంతపల్లి, నిడమర్రు, భీమడోలు, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, తదితర ప్రాంతాల్లో వర్షపాతం భారీగానే నమోదైంది. గత రాత్రి భారీగా ఈదురుగాలులు వీయడం వల్ల పలుచోట్ల చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కూడా ఏర్పడింది. అపరాలు, కూరగాయల పంటలకు ఈ వర్షాలు ఉపకరిస్తాయని చెబుతున్నారు.



ఏలూరులో..



తాడేపల్లిగూడెంలో జోరువాన



నిడదవోలు పట్టణంలో..



← తణుకులో..

• ముగ్గురు మొనగాళ్ళు



ఒకే కాన్పులో ముగ్గురు మగపిల్లలు

ఆకివీడు: పిల్లలు లేక కొంతమంది బాధపడుతుంటే.. మరి కొంతమంది ఆడపిల్లలు పుట్టారని బాధపడుతుంటారు. కానీ వీరవేణి ఏకంగా ఒకేసారి ముగ్గురు మగ పిల్లలకు జన్మనిచ్చింది. యండగండి మండలం మైఫా గ్రామానికి చెందిన వీరవేణికి రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన దామోదరం కృష్ణతో వివాహం జరిగింది. మొదట కాన్పు పోయింది. ఆకివీడు లక్ష్మీ హాస్పటల్ వైద్యురాలు కవిత దగ్గర ఆమె వైద్యం పొందుతోంది. శుక్రవారం ఆసుపత్రిలో ముగ్గురు మగ పిల్లలకు జన్మనిచ్చింది. తల్లీ-బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. ముగ్గురు మగపిల్లలు పుట్టడంతో కుటుంబ సభ్యులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





ద్వారకాతిరుమలలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహిస్తున్న వేదపండితులు... వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

వైభవంగా సామూహిక వరలక్ష్మీవ్రతాలు

ద్వారకాతిరుమల : శ్రావణ శుక్రవారం పురస్కరించి పలుదేవాలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు.ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో తూర్పురాజుగోపురం ముందుభాగాన ఉన్న అరివిటి మండపంలో సామూహిక వరలక్ష్మీవ్రతం (శ్రావణలక్ష్మి)అత్యంత వైభవంగా శుక్రవారం నిర్వహించారు. అవసరమైన పూజాసామాగ్రి ఉచితంగా అందజేశారు. 1,450 మంది ముత్తైదువులు పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ ఎస్‌వీ సుధాకర్‌రావు దంపతులు, కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు దంపతులు, ముత్తైదువులు పాల్గొన్నారు. నిడదవోలు కోటసత్తెమ్మ, కొల్లేరు పెద్దింట్లమ్మ, జంగారెడ్డిగూడెం గోకుల పారిజాతగిరి, తదితర ఆలయాల్లో సామూహిక వ్రతాలు చేపట్టారు.



నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయంలో..



కొల్లేరు పెద్దింట్లమ్మ ఆలయంలో..



జంగారెడ్డిగూడెం గోకులపారిజాతగిరిపై..

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

పెనుమంత్ర: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ సంఘం పిలుపు మేరకు మండలంలోని బ్రాంచి పోస్టుమాస్టర్లు చేస్తున్న సమ్మె మూడు రోజుకు చేరుకుంది. బ్రాంచి పోస్టు మాస్టర్ల సమ్మెతో పోస్టాఫీసులు మూత పడి గ్రామాలలో తపాలా సేవలు నిలిచిపోయాయి. పదోన్నతులు కల్పించాలని కమలేష్ చంద్ర కమిటీ నివేదికను తక్షణం అమలు చేయాలని డాక్ సేవక్‌లు డిమాండ్ చేశారు.

రోడ్డు బాధలింతింతకాదయా..

● అధ్వానంగా పెనుగొండ - మునపర్రు రోడ్డు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెనుగొండ : ఈ రోడ్డు బాధలింతింతకాదయా.. ఈ వేదన తప్పించేదెవరయా అని మునమర్రు, తామరాడ, సోమరాజు చెరువు వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పెనుగొండ నుంచి మునమర్రు వెళ్లేందుకు తారు రోడ్డు నిర్మించారు. నాణ్యత లోపం వలన తారు రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. వేసిన తారు మచ్చుకు అక్కడక్కడా కనిపిస్తోంది. మండలంలోని గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, వ్యాపార అవసరాలకు నిత్యం పెనుగొండ రావాల్సిందే. దీంతో గోతులమయంగా మారిన దారిలో ప్రయాణించాలంటే ప్రజలకు నరకం కనిపిస్తోంది. అధికారుల, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గోతులతో అధ్వానంగా ఉన్న మునమర్రు రోడ్డు

'పంట దిగుబడులు పెంచడానికే ఎలుకల నిర్మూలన'

పోడూరు : పంట దిగుబడుల సాధనలో భాగంగా ప్రభుత్వం ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరులో శుక్రవారం ఎలుకల నిర్మూలన కార్యక్రమం అమలుపై అధికారులుతో చర్చించారు. ఎలుకల నిర్మూలనపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుందని మంత్రి పితాని అన్నారు. ప్రజాప్రతినిధులు రెవిన్యూ శాఖాధికారులు, రైతు సంఘాలను కలుపుకుని క్షేత్రస్థాయిలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని మంత్రి పితాని ఆదేశించారు. పాలకొల్లు సబ్ డివిజన్‌లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం వివరాలను, ప్రచారం నిమిత్తం వేసిన వాల్‌పోస్టర్లును మంత్రి పితానికి పాలకొల్లు ఏడీఏ సత్యనారాయణ అందచేశారు.



ఎలుకల నిర్మూలన వాల్‌పోస్టర్లును పరిశీలిస్తున్న మంత్రి పితాని సత్యనారాయణ

ప్రభుత్వ విద్య మిథ్యేనా

పెనుగొండ : ప్రభుత్వ విద్య ప్రచారంలో ఆర్భాటం, ఆచరణలో మిధ్యగానే మిగిలిందని పలువురు ఎంపీటీసీలు విరుచుకుపడ్డారు. శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో విద్యాశాఖపై అల్పపీడనం పడింది. ఎంపీపీ పల్లి జూలీసురేఖ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీటీసీలు విద్యాశాఖ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలు తెరచి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకూ పుస్తకాలు పూర్తి స్థాయిలో ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ఉచిత దుస్తులు అందలేదని, సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. చివరకూ విద్యాశాఖాధికారి తనకూ సమాచారం ఇవ్వలేదని ఎంపీడీవో పద్మిని సమాధానం ఇవ్వడంతో ఎంపీటీసీలే కంగుతిన్నారు.

సంతమార్కెట్‌పై దుమారం..

సంతమార్కెట్ అభివృద్ధి అంశంలో జడ్పీటీసీ రొంగల రవి కుమార్, సర్పంచ్ యాదాల ఆశాజ్యోతిల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. అభివృద్ధి పనులు జరగనివ్వకుండా జడ్పీటీసీ అడ్డుపడ్డారంటూ సర్పంచ్ ఆరోపించారు. తాను అలాంటి ఫిర్యాదులు చేయలేదని, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తీర్మానం లేకుండానే మార్కెట్ పనులు చేస్తున్నారని చెప్పడంతో తాను ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చానని జడ్పీటీసీ వివరించారు. మండల పరిషత్ సమావేశాలు మొక్కుబడిగానే మిగిలిపోతున్నాయని ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పెనుగొండలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, పంట కాలువల్లో మురుగునీరు కలువకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీలు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జూలీసురేఖ

ప్రశాంతంగా పంచాయతీ సమావేశం

పెనుగొండ : పెనుగొండ పంచాయతీ సమావేశం శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం సర్పంచ్ యాదాల ఆశాజ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు అత్యవసర సమావేశం కాస్తా మళ్లీ డీసెంటుతో వాయిదా పడుతుందని ప్రచారం జరిగింది. అల్పపీడనం ప్రభావమో, మరే కారణమో కాని సమావేశం అధ్యంతం చలోక్తులతో ఇరువర్గాలు స్నేహపూర్వకంగా వ్యవహరించడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పంచాయతీ పరిధిలోని చెత్త సేకరణకు కాంట్రాక్టును ప్రైవేటు కంపెనీ సంఘమిత్రకు అప్పగించి రోజువారి రుసుం వసూలు అంశాన్ని సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనివలన ప్రజలు ఇబ్బందులు పడతారని సభ్యులు అభ్యంతరం చెప్పడంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు. వివిధ ప్రాంతాల్లో తాగు నీటి సమస్య పరిష్కారానికి రూ. 14.52 లక్షలతో చేపట్టే పనులకు ఆమోదం తెలిపారు. వాటర్ ట్యాంకర్లతో నీటి సరఫరా బిల్లులను ఆమోదించారు. చింతగింజలవారి వీధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి, ఎల్ఈడీ బల్బులు వేయడానికి కొన్ని ప్రాంతాల్లో మూడో విద్యుత్ లైను ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో గ్రామకార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, పంచాయితీ సభ్యులు పాల్గొన్నారు.



పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆశాజ్యోతి



కుష్టు రోగులకు చెప్పులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అంబళ్ల అప్పాయమ్మ

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పోడూరు: వైద్య, ఆరోగ్య పరంగా కుష్టు రోగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కవిటం సర్పంచ్ అంబళ్ల అప్పాయమ్మ అన్నారు. ప్రభుత్వ కుష్టు రోగ నివారణ సంస్థ అందజేసిన లెప్రసీ చెప్పులను శుక్రవారం ఆమె రోగులకు అందజేశారు. ఈ సందర్భంగా కుష్టు రోగ నివారణ సంస్థ డీటీఎమ్‌వో కేవీవీ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో సర్పంచ్ మాట్లాడుతూ కుష్టు రోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పోడూరు పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎ.దేవదాసు, సూపర్ వైజర్ వై.బాలచంద్రుడు, ఏఎన్ఎంలు పి.శ్రీదేవి, కె.మంగళ, హెల్త్ అసిస్టెంట్ జి.అమ్మ రాజు, అంబళ్ల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



కాలువలో చెత్తను తొలగిస్తున్న ఇరిగేషన్‌శాఖ సిబ్బంది

కాలువలో చెత్త తొలగింపు

పోడూరు : పోడూరు గ్రామంలో అంబటివాని చెరువు, పెనుమదం ఏరియాలోని చించినాడ కాలువ గట్టు వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు నరికి వాటిని తొలగించడంలో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇరిగేషన్ శాఖ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వగట్టు వెంబడి భారీ వృక్షాలు పెరిగిపోయి వాటి కొమ్మలు విద్యుత్ వైర్ల మీద వాలిపోవడంతో కొన్ని రోజులు క్రితం విద్యుత్‌శాఖ సిబ్బంది వాటిని నరికివేసి పక్కనే ఉన్న కాల్వలో పడేశారు. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. రెండు నెలలు క్రితమే కాలువ వెంబడి ఉన్న చెత్త చెదారాన్ని తొలగించి కాల్వను శుభ్రం చేశామని, ఇంతలోనే కొమ్మలు నరికివేసి తిరిగి కాల్వలో పడేయడంతో నీటి సరఫరాకు అడ్డంకులు ఏర్పడ్డాయని ఇరిగేషన్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కాలువలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే చర్యలను ఇరిగేషన్ శాఖ సిబ్బంది చేపట్టారు. ఇరిగేషన్‌శాఖ గుమస్తా ఎస్.మనోహర్, డెల్టా లస్కర్లు వై.రామకృష్ణ, కె.నాగేశ్వరావు వై. బాలచంద్రరావు ఇరిగేషన్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మంత్రిని బర్తరఫ్ చేయాలి

శేషమ్మచెరువు(ఆచంట): స్వాతంత్ర్య వేడుకలు సందర్భంగా దళితులపై మంత్రి ఆది నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున పిలుపు మేరకు ఆచంట మండలం శేషమ్మ చెరువులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పాలాభిషేకం చేశారు. మంత్రిని తక్షణమే అరెస్ట్ చేసి, అతనిపై ఎస్సీ, ఎస్టీ ఆట్రాసిటీ కేసులు తక్షణమే నమోదు చేసి మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి సుంకర సీతారామ్, వైట్ల కిషోర్‌లు డిమాండ్ చేశారు.

ప్రజాసేవ



2 కోట్ల 50 లక్షలతో అభివృద్ధి పనులు చేశాం

బండి హైమావతి, సర్పంచ్ వల్లూరు

'గడచిన నాలుగు సంవత్సరాల్లో సుమారు రూ.2కోట్ల 50లక్షలతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేశాం. గ్రామంలో పలు చోట్ల సీసీ రోడ్లు నిర్మిచాం. ఇటీవల జడ్పీ, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షలతో కొత్త పంచాయతీ భవనాన్ని నిర్మించి ప్రారంభించాం. గ్రామంలో అర్హత కలిగిన వారికి పింఛన్లు, ఇళ్ళు మంజూరు చేస్తున్నాం. గ్రామంలో ఇప్పటికే 90 శాతం మంది వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడం జరిగింది. గ్రామంలో ఇంకా ఉత్తరపాలెం, ఈతకోట వారిపాలెం, మెయిన్ గ్రామంలో పలుచోట్ల సీసీ రోడ్లు వేయాల్సి ఉంది.'

● ఆచంట

పోడూరు మండల పంచాయతీల ఫోన్ నంబర్లు

పోడూరు	08814-257142
కవిటం	08814-257961
పి పోలవరం	08814-233063
కొమ్ముచిక్కాల	08814-233754
వేడంగి	08814-224638
జిన్నూరు	08814-242121
మట్టపర్రు	08814-221265
పెనుమదం	08814-259105
గుమ్మలూరు	08814-250324
రావిపాడు	08814-259124
వద్దిపర్రు	08814 252755
మినిమించిలిపాడు	08814-257176
పండితవిల్లూరు	08819-246268
తూర్పుపాలెం	08819-235705

సినిమా గైడ్

ఆచంట :

కళ్యాణ చక్రవర్తి	లై

వల్లూరు :

విజయకృష్ణ	జయ జానకి నాయక

పెనుగొండ :

వినర్వా	డీజే





ఆర్టీసీ సమాచారం..

హైదరాబాద్ వెళ్ళే సర్వీసులు :

రాత్రి 8గంటలకు బీహెచ్ఈఎల్ వయా కలిదిండి, రాత్రి గం.8.30ని.లకు బీహెచ్ఈఎల్ వయా కైకలూరు, 9గంటలకు బీహెచ్ఈఎల్ వయా కలిదిండి), గం.9.30ని.లకు బీహెచ్ఈఎల్ వయా కలిదిండి, రాత్రి గం.8.15ని.లకు బీహెచ్ఈఎల్ (గరుడ, ఏపీ), జీడిమెట్ల రాత్రి గం.8.15ని.లకు, ఈసీఐఎల్, రాత్రి 9గంటలకు..

విజయవాడ : ప్రతీ 20నిమిషాలకు బస్ సర్వీస్ కలదు.

విశాఖపట్టణం : ఉదయం గం.6.30ని.లకు, ఉదయం గం.7.30ని.లకు, రాత్రి గం.8.45ని.లకు, గం.9.10ని.లకు, గం.10.10ని.లకు, గం.10.40ని.లకు. సాయంత్రం గం.5.45ని.లకు బత్తిలి(వయా విశాఖపట్టణం).

తిరుపతి : ఇంద్ర ఏసీ సాయంత్రం 6గంటలకు. ఉదయం గం.10.30ని.లకు.

ప్రతీ ఆదివారం తెల్లవారుజామున 5గంటలకు తూర్పు గోదావరి జిల్లా **'వెల్ల'**కు బస్సు ఉంది. ప్రతీ శనివారం ఉదయం గం.4.30ని.లకు ద్వారకాతిరుమలకు బస్సు ఉంది. డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ సెల్ నెం : 9959225485, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎంక్వైరీ 08816239100, రిజర్వేషన్ కౌంటర్ నెంబరు 9666089036.



రాయలం వెళ్లే రోడ్డులో నీరు నిలిచిపోయిన దృశ్యం



శ్రీరాంపురంలోని అర్బన్ బ్యాంక్ రోడ్డులో వర్షం నీరు

పట్టణంలో భారీ వర్షం

భీమవరంటౌన్ : రుతుపవనాల ప్రభావం కారణంగా పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. గురువారం రాత్రి కూడా భారీ వర్షం కురిసింది. ఉదయానికి కొంత తెరుపు ఇచ్చినట్లుగా కనిపించినప్పటికీ 11 గంటల ప్రాంతం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురవటం ప్రారంభించింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం పాఠశాలలు, కాలేజీలు వదిలే సమయంలో కూడా వర్షం కురవడంతో విద్యార్థులు వర్షంలో తడుస్తూనే గమ్యస్థానాలకు చేరుకున్నారు. బస్ కాంప్లెక్స్‌లో వర్షంలో తడుస్తూనే బస్సుల కోసం ఎదురు చూశారు.



సుబ్బారాయుడి గుడి వెనుక కమిషనర్ క్వార్టర్ వద్ద వర్షపు నీరు నిలచిపోయిన దృశ్యం

మహిషాసురమర్ధనికి సారె అందజేత

భీమవంరంటౌన్ : భీమేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రావణ మాసం, ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అభివృద్ధి కమిటీ, ఉత్సవ కమిటీ, దేవస్థానం ధర్మకర్తల మండలి, భక్తుల సహకారంతో మహిషాసుర మర్ధని అమ్మవారికి శ్రావణ మాస సారెను అందజేశారు. మునిసిపల్ చైర్మన్ కొటికలపూడి గోవిందరావు(చినబాబు) నివాసం వద్ద నుంచి సారెతో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకునివచ్చారు. సింహాద్రి అప్పన్న గుడి దగ్గర నుంచి మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. అక్కడి నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం రోడ్డు మీదుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ అర్చకుడు కొత్తలంక రామశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించి సారెను సమర్పించారు. అనంతరం భక్తులకు సారెను ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొటికలపూడి గోవిందరావు (చినబాబు), ధర్మకర్తల మండలి ఛైర్మన్ యిర్రింకి వెంకటేశ్వరనాయుడు, మోటుపల్లి వెంకన్నబాబు, యండ్ర సత్యవతి, బత్తుల సుబ్రహ్మణ్యం, తోరం సూర్యనారాయణ, సుంకర రవి, ఆకుల తేజ, ఆకుల కృష్ణ, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారెను అందజేస్తున్న దృశ్యం



గో గ్రీన్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

భీమవరంఎడ్యుకేషన్ : నారాయణ స్కూల్‌లో విద్యార్థులు శుక్రవారం గో గ్రీన్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ రామ్మోహన్ మాట్లాడుతూ పచ్చదనంతోనే పర్యావరణాన్ని కాపాడుకోగలమని అన్నారు. చెట్లను ఎక్కువ నాటించడంలో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. పచ్చదనం ప్రాముఖ్యత గురించి విద్యార్థులు అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు ర్యాలీలో మొక్కల ప్రాధాన్యత, మొక్కలు నాటండి-పర్యావరణాన్ని కాపాడండి అంటూ ఫ్లెక్సీలతో నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జి శ్యామలాదేవి, ఏజీఎం కృష్ణకిషోర్, శ్రీనివాస్, ప్రకాష్, నీలిమ, విద్యార్థులు పాల్గొన్నారు.



మావుళ్ళమ్మ అమ్మవారికి విరాళం అందజేస్తున్న దాతలు

నిత్యాన్నదానానికి రూ.50 వేలు విరాళం

భీమవరంటౌన్ : మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బంటుమిల్లి గ్రామానికి చెందిన లింగం జయలక్ష్మి 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆలయానికి వచ్చిన దాత ముందుగా అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనలు అందజేశారు. దేవస్థానం తరుపున ప్రసాదాన్ని అందజేశారు.

సినిమా గైడ్

అన్నపూర్ణ	జయ జానకి నాయక
పద్మాలయ కాంప్లెక్స్ :	ఆనందో బ్రహ్మ, లై
నటరాజ్	నేనే రాజు నేనే మంత్రి
కిషోర్ హబ్	ఫిదా, నేనే రాజు నేనే మంత్రి
విజయలక్ష్మి కాంప్లెక్స్ :	జయ జానకి నాయక, లై
గీతా మల్టీప్లెక్స్ :	నేనే రాజు నేనే మంత్రి, లై, జయ జానకి నాయక, ఆనంతోబ్రహ్మ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న మునిసిపల్ కమిషనర్ నాగ నరసింహారావు, బ్యాంకు అధికారులు

లబ్ధిదారులు ఆర్థికంగా బలపడాలి

భీమవరంటౌన్ : లబ్ధిదారులు బ్యాంకుల నుంచి రుణం పొందటమే కాకుండా సంబంధిత వ్యాపారం నిర్వహించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మునిసిపల్ కమీషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులు రుణం తీసుకోవటమే కాకుండా సకాలంలో చెల్లించాలని సూచించారు. దీని వలన మరి కొంత మందికి రుణాలు ఇచ్చే అవకాశం ఉటుందని ఆయన అన్నారు. ఏఏ వ్యాపారులు నిమిత్తం దరఖాస్తులు చేశారు. ఎంత రుణం కావాలి. తదితర అంశాలపై ఆయన దరఖాస్తుదారులతో మాట్లాడారు. బ్యాంకు అధికారులు కూడా వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు.

స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

భీమవరం రూరల్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి సోపానం ద్వారా రుణాలు పొందేందుకు ఈసారి యువతీ,యువకులు ఎక్కువ సంఖ్యలోనే దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్‌లకు సంబంధించి సుమారు 300 మంది ఇంట ర్వ్యూలకు హాజరయ్యారు. వెలిముద్ర నమోదు ద్వారా హాజరైనట్లు ఆన్‌లైన్ నమోదు చేశారు. మండలం మొత్తం మీద స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలకు గాను 1920 మంది దరఖాస్తు చేసుకున్నారని, పది రోజుల పాటు నిర్వహించే ఇంటర్వ్యూల్లో వారు హాజరు కానున్నట్లు ఎంపీడీవో పరదేశీకుమార్ తెలిపారు. ఇంటర్వ్యూలకు బ్యాంకు మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ



పంచాయతీ భవనం లేక అద్దె భవనంలోనే పాలన

రాట్నాల వీరవెంకట సత్యనారాయణ, కొమరాడ గ్రామసర్పంచ్

గ్రామంలో పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో ఏడాదిన్నర నుంచి అద్దె భవనంలోనే పంచాయతీకి సంబంధించిన విధులు నిర్వహించాల్సి వస్తున్నది. పలుమార్లు పంచాయతీ భవనం కోసం ప్రతిపాదనలు చేసినా ఉపయోగం లేకుండాపోయింది. పంచాయతీ భవనం ఉంటేనే గ్రామ సమావేశాలకు, ఇతర వాటికి ఉపయోగపడుతుంది. దానితో పాటు మంచినీటి చెరువుల్లోకి వచ్చే నీరు కలుషితమైన నీరుగా రావడంతో అలాంటి నీటిని స్వచ్ఛత పరచాలన్నా ఇబ్బందిగా మారడంతో పాటు వాసన కలిగిన నీళ్ళు గ్రామస్థులకు అందించాల్సి వస్తుంది. పంటకాలువ ఎగువన చెత్తవేయడం, వ్యర్థపదార్థాలన్నీ దానిలోనే వేయడం వల్ల మంచినీరు కలుషితమవుతోంది. వేరే దారి లేక ఆ నీటితోనే మంచినీటి చెరువును నింపుకోవలసి వస్తుంది. పంటకాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూస్తే మంచినీరు చెరువుల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది.

● భీమవరం రూరల్

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

భీమవరం :	99854 11550
,, రూరల్ :	94414 48581
,, టౌన్ :	94406 25154
,, క్రైం :	98665 93356
,, అర్బన్ :	99481 40404
వీరవాసరం :	98667 41833

సినిమా గైడ్ :

వీరవాసరం :
వీరహనుమాన్ — లై
రామకృష్ణ (కొణితివాడ) — జయజానకీ నాయక

ఒడిదుడుకుల్లో రొయ్యల సాగు

వాతావరణ మార్పులతో రైతులకు ఎదురుదెబ్బ

భీమవరం రూరల్: వాతావరణంలో మార్పు.. ఎండ కాస్తే ఉక్కబోత.. వర్షాకాలంలోను వేసవి ఎండలా వేడి. ఈలోగానే వర్షం. ఇలాంటి వాతావరణంతో రొయ్యలసాగు రైతులకు ఆదిలోనే ఎదురుదెబ్బ ఏర్పడింది. దీంతో రొయ్యల సాగు చేయాలా, ఆగాలా అన్న ఒడిదుడుకుల్లో రైతన్నలు ఉన్నారు. గడిచిన జూన్ నెలలో రొయ్యలసాగు ప్రారంభించిన రైతుల్లో 80 శాతం మందికి పైగా రొయ్యపిల్ల వేసిన 20 రోజులు లోపులోనే దెబ్బ తినడంతో నష్టాలు చవి చూడాల్సి వచ్చింది. ఆపై కొంతమంది రైతుల రొయ్యసాగు మరో 40 రోజుల వరకు సాగినా వాతావరణం రీత్యా దెబ్బతినడం, పెట్టుబడి కూడా రాకపోవడం చోటు చేసుకుంది. మిగిలిన రైతులు సాగును బతికించేందుకు 24 గంటలు ఏరియేటర్స్‌ను ఉపయోగించక తప్పడం లేదు. ఉక్కబోత వాతావరణం రాత్రి సమయంలో కూడా ఉండటంతో ఏరియేటర్స్‌ను ఉపయోగించక తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో ఈసారి ఆది నుంచి ఒడిదుడుకులుగానే సాగడంతో పాటు ఎక్కువ సాగు తుడిచి పెట్టుకుపోవడంతో ప్రస్తుతం రైతులు మరలా సాగులో ముందుకు వెళ్ళాలా, వాతావరణం కుదుటపడే వరకు ఆలోచించాలా అన్న సందిగ్ధంలో పడ్డారు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పు రావడంతో ఇదో రకమైన వాతావరణంగా రైతులు భయపడుతున్నారు.



మిగిలిన 20శాతం సాగు రైతులు ఈ వాతావరణంతో దెబ్బ తింటుందని చెబుతున్నారు. ఏదేమైనా ప్రస్తుతం రొయ్యల సాగుకు వాతావరణం కలిసి రాలేదనే లెక్క వేయవచ్చు.



ఏరియేటర్స్ తిరగాల్సిందే..

వరి రైతుల్లో ముంపు భయం

వర్షాలకు సార్వాచేలు ముంపునకు గురవుతాయేమోనన్న ఆలోచనలో రైతులు పడ్డారు. మండలంలో ముందు..వెనుకగా సార్వానాట్లు సాగాయి. వారం రోజుల క్రితమే నాట్లు వేశారు. వర్షాలు భారీగా పడితే అవి ముంపు బారిన పడే అవకాశం ఉంటుందని రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. బేతపూడి, తాడేరు, తుందుర్రు, పెదగరువు, గొల్లవానితిప్ప గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షాలకే నాట్లు ముంపునకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ముందస్తుగా నాట్లు వేసిన గునుపూడి, కొవ్వాడ, యనమదుర్రు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే సార్వాచేలు ఏపుగా ఎదగడంతో ఇబ్బంది ఉండ దని రైతులు చెబుతున్నారు.



బొరియలను గుర్తిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

ఎలుకల బొరియలు పూడ్చివేత

భీమవరం రూరల్: సామూహిక ఎలుకల నిర్మూలనలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎలుకల బొరియలను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని బేతపూడి, తాడేరు, తుందుర్రు తదితర గ్రామాల్లో సార్వాచేల గట్లు, దిమ్మలలో ఉన్న ఎలుకల బొరియలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నారాయణరావు మాట్లాడుతూ ఎలుకల బొరియలను గుర్తించి మూసిన తరువాత శనివారం తెరుచుకున్న బొరియల్లో బ్రొమోడియోలోన్ మందును పొట్లాలతో పెట్టడం జరుగుతుందని అన్నారు.పంచాయతీ కార్యాలయాల్లో మందు రైతులకు అందించనున్నట్లు వివరించారు. ఈ మందును ఏ విధంగా ఉపయోగించాలన్న దానిపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారులు కవర్డీ, పెద్దిరాజు, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.



సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

వీరవాసరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

వీరవాసరం : శ్రావణమాసంలో మహిళలచే నిర్వహించే వ్రతం వరలక్ష్మీవ్రతం. లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకుని మహిళలు సౌభాగ్యాన్ని, అష్ట ఐశ్వర్యాలను పొందేందుకు దేవిని ప్రార్థిస్తూ చేసే వ్రతమని రుత్వికులు పేర్కొన్నారు. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం వీరవాసరం కనకదుర్గాంబ ఆలయంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారి సమక్షంలో వ్రతాన్ని ఆచరించేందుకు తరలివచ్చారు. వ్రత సామాగ్రిని దేవస్థానం ఉచితంగా అందజేసింది. వ్రతాలను ఆలయ అర్చకుడు కొడమంచిలి దుర్గాప్రసాద్, కొడమంచిలి వెంకట్రావు ఆధ్వర్యంలో చేయించారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ మద్దాల శ్రీరామకృష్ణ, ధర్మకర్తలు అడబాల రామకృష్ణ, మద్దాల నాగవెంకట సత్యనారాయణ, గొర్రె రాధాసులోచన, ఈవో నటరాజన్ షణ్ముగం, అర్చకులు కొడమంచిలి నాగేశ్వరరావు, చేబ్రోలు ఉమామహేశ్వరరావు, శ్రీనివాసుల రాంబాబు, గ్రామ కమిటీ సభ్యులు నూకల సత్యనారాయణ,గ్రంధి కాంతారావు, కోటేశ్వరరావు,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర భారతదేశం కోసం ప్రతిజ్ఞ

స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్-స్వచ్ఛత పక్వాడా

భీమవరంక్రైం: స్వేచ్ఛాయుత భారతదేశంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్-స్వచ్ఛత పక్వాడా అనే కార్యక్రమం ఎంతో విజయవంతమైందని భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ దేవకుమార్ అన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 31వరకు స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్-స్వచ్ఛత పక్వాడా అనే కార్యక్రమాన్ని దేశమంతటా నిర్వహిస్తూ వస్తున్నారని, ఇందులో భాగంగా మూడు రోజులుగా భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రైల్వే ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవకుమార్ మాట్లాడుతూ భారతదేశాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందన్నారు. పరిశుభ్రత కోసం నిబద్ధతతో పనిచేస్తున్న వారందరికీ కృతజ్ఞతలు అన్నారు. రోడ్లపై చెత్త వేయను, రైళ్ళల్లో శుభ్రత విషయంలో చురుగ్గా పాలుపంచుకొంటానంటూ ప్రతిజ్ఞ చేశారు. ఆర్‌పీఎఫ్ సీఐ ప్రసాదరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, శ్రీనివాసరావు, రవికిషోర్, కోటేశ్వరరావు, రంగసాయి తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్-స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే అధికారులు, తదితరులు



చదరంగం పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన రాధాకుమారి

చదరంగం పోటీల విజేత రాధాకుమారి

భీమవరం ఎడ్యుకేషన్ : ఈనెల 10,11 తేదీల్లో విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎల్ఐసీ డిపార్ట్‌మెంట్ సౌత్‌సెంట్రల్ జోనల్ చదరంగం పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి రాధాకుమారి ప్రథమస్థానంలో నిలిచారని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తోట భోగయ్య, మాదాసు కిషోర్‌లు తెలిపారు. శుక్రవారం రాధాకుమారిని అభినందించారు.నవంబర్‌లో జాతీయస్థాయిలో నిర్వహించే ఎల్ఐసీ జాతీయస్థాయి పోటీలకు ఆమె అర్హత సాధించారు.



ఎలుకల బొరియలను పూడుస్తున్న రైతులు

సామూహిక ఎలుకల నిర్మూలన ప్రారంభం

వీరవాసరం : సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ప్రారంభమైంది. రెండు రోజులు పాటు నిర్వహించే ఈ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఎలుక కన్నాలను గుర్తించి వాటిని మట్టితో మూసి వేయించారు. శనివారం ప్రారంభించే ఎలుకలకు ఎరను పెట్టే బ్రొమోడయోలిన్ ఎర తయారీకి సంబంధించి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. రైతులందరూ కలిసి విషపుఎరను సామూహికంగా తయారు చేసుకుని వారి పొలాలతో పాటు ఖాళీ భూములు, పోరంబోకు స్థలాల్లో ఉన్న బొరియలను గుర్తించి ఎరపొట్లాలను ఉంచాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వీరవాసరం మండలానికి 52 కేజీల మందు సరఫరా చేశారని వ్యవసాయ శాఖ అధికారి కె.రాజశేఖర్ తెలిపారు.

ఎలుకల నిర్మూలనకు వర్షం అడ్డంకి

సామూహిక ఎలుకల నివారణకు వర్షం అడ్డంకిగా మారింది. శుక్రవారం ఉదయం వాతావరణం అనుకూలించడంతో రైతులు ఎలుకల బొరియలను గుర్తించి కన్నాలు మూసివేశారు.సాయంకాలానికి వర్షం కురవడంతో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని వ్యవసాయ శాఖ, రైతులు ఆందోళన చెందారు. ఇదే పరిస్థితి శనివారం సైతం కొనసాగితే విషపు ఎర పెట్టే నివారణ కార్యక్రమాన్ని వాయిదా వేస్తామని ఏవో తెలిపారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డాక్టర్ మధు

విష్ణు ఫార్మశీ కళాశాలలో వర్క్‌షాపు

భీమవరం ఎడ్యుకేషన్ : విద్యార్థులు సబ్జెక్టుపై ఎక్కువ పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నప్పుడే దేనిలోనైనా ముందంజలో నిలవగలరని స్ట్రాటెక్ ల్యాబ్ శాస్త్రవేత్త డాక్టర్ మధు అన్నారు. విష్ణు కాలేజ్ ఆఫ్ ఫార్మశీ కళాశాలలో హ్యాండలింగ్ ఆఫ్ అనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ అండ్ గ్రీన్ కెమికల్ టెక్నిక్స్ అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు.డాక్టర్ మధు మాట్లాడుతూ లోహాలను ఎలా పరిశోధించవచ్చు అన్న దానిపై వివరించారు. పలు కళాశాలల నుంచి వచ్చిన 100 మంది విద్యార్థులచే ల్యాబ్‌లోని పరికరాలచే పలు ప్రయోగాలు ఎలా చేయాలన్న దానిపై సూచనలు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, డైరెక్టర్ బసవరాజు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు

ద్వారకాతిరుమల : వేంకటేశ్వరస్వామి ఉపాలయం క్షేత్రపాలకుడైన భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం లో ఆర్ద్రనక్షత్రంను పురస్కరించుకుని శుక్రవారం శివక ల్యాణం నిర్వహించారు. ముందుగా భ్రమరాంబ మల్లికా ర్జునస్వామి, అమ్మవార్లను ఆలయ సన్నిధిలో రజితసింహా సనంపై ఆశీనులుగావింపజేశారు. ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. ముందుగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవ చనం, రక్షాబంధనం, యజ్ఞోపవీతం, పట్టువస్త్రాల సమ ర్పణ, మాంగళ్యధారణ, తలంబ్రాలు, తదితర కార్యక్రమా లను ఆలయ అర్చకులు రాఘవయ్య, వేదపండితులు వేదమంత్రాలతో శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వై భవంగా నిర్వహించారు. శ్రీవారి కల్యాణంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాధరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండలంలో..

ఆస్పత్రి సమాచారం..

నల్లజర్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటలు వైద్య సేవలు అందిస్తారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు వైద్యుడు జి.సుధీర్‌కుమార్ అందుబాటులో ఉంటారు.

సంత మార్కెట్లు..

ఆదివారం, సోమవారం అనంతపల్లి, మంగళవారం దూబచర్ల, బుధవారం పోతవరం, గురువారం నల్లజర్ల, శుక్రవారం ప్రకాశరావుపాలెం గ్రామాల్లో సంత మార్కెట్లు నిర్వహిస్తారు.

యోగా సమాచారం

నల్లజర్ల మండలం దూబచర్ల దత్తసాయి మందిరంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు.ప్రతి రోజు ఉదయం 5.30గంటల నుంచి 6.30గంటలకు శిక్షణ ఉంటుంది. యోగా గురువు దూబకుంట్ల రాజారావు శిక్షణ ఇస్తున్నారు. ఫోన్ నెంబర్: 9866030669

అన్నదానం

ప్రతి గురువారం నల్లజర్ల సాయిబాబా ఆలయం వద్ద, అనంతపల్లి సాయిబాబా, ఘంటసాల ఆలయం, దూబచర్ల దత్తసాయి, శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. - నల్లజర్ల



నిమ్మకాయల ధరలు : ద్వారకాతిరుమల		
నిన్నటి ధర	కనిష్ఠం	గరిష్ఠం
ఒక కేజీ	11.00	16.00
50 కేజీల బస్తా..		
	550	800

సినిమా గైడ్

దేవరపల్లి :	
త్రినాథ్	నేనే రాజు నేనే మంత్రి
రామనాథ్	జయ జానకి నాయకా
యర్నగూడెం :	
నల్లజర్ల :	
శ్రీనివాస	లై
అనంతపల్లి :	
అన్నపూర్ణ	లై



బీడుగా మారిన పంట పొలాలు



చుక్క నీరు లేక వెలవెలబోతున్న చెరువు

చేలు.. బీళ్లు..

బీళ్లు అవుతున్న పొలాలు..
మెట్టలో కురవని వర్షాలు
చెరువులు నింపితేనే మేలు

గోపాలపురం : వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు దాటినా గోపాలపురం మండలంలో నాట్లు వేయడానికి సరిపడినంత నీరు లేక వందలాది ఎకరాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.. భీమోలు, గంగోలు, కొవ్వూరుపాడు, జగన్నాథపురం, చిట్యాల గ్రామాల పరిధిలో వేలాది ఎకరాల్లో రైతులు గతంలో వరి సాగు చేసేవారు. మూడేళ్లుగా మండలంలో సరైన వర్షాలు కురవక రైతులు వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాదైనా పూర్తిస్థాయిలో వర్షాలు కురుస్తాయని ఆశపట్ట రైతులకు నిరాశే మిగిలింది. అల్పపీడనం ఏర్పడినప్పుడల్లా కొద్దోగొప్పో చినుకులు పడుతున్నాయే తప్ప నాట్లకు సరిపడినంత వర్షాలు కురవడం లేదు..గోపవరం, గుడ్డిగూడెం, కరగపాడు గ్రామాల్లో వందలాది ఎకరాలు వరినాట్లు పడక బీడు భూములుగా మిగిలాయి. డెల్టా ప్రాంతంలో మరో 20 రోజుల్లో పంట కోతకు వస్తుంటే మెట్టలో మాత్రం కనీసం నాట్లు పడే పరిస్థితి లేకుండా పోయింది. బోర్ల కింద రైతులు గత 20 రోజుల నుంచి నాట్లు వేయడం ప్రారంభించారు. సరైన వర్షం కురిస్తే వరి పొలాలను దమ్ము చేసి నాట్లు వేయవచ్చని ఆశతో ఎదురుచూస్తున్నారు. భీమోలు వంటి గ్రామాల్లో తాడిపూడి కాల్వ పుణ్యమా అంటూ నాట్లు పడ్డాయి. మిగిలిన చోట్ల ఆ పరిస్థితి కనబడటం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు వరి రైతుల పరిస్థితిని గుర్తించి తాడిపూడి కాల్వ ద్వారా చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ చెరువులను పూర్తిస్థాయిలో నింపడం వల్ల పశువులతో పాటు కొన్ని గ్రామాలకు సాగు నీరు అందుతుందని పలువురు పేర్కొంటున్నారు.

దళితులకు ఆదినారాయణరెడ్డి క్షమాపణ చెప్పాలి

గోపాలపురం : అధికార ప్రభుత్వంలో ఉండి దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వీసీసీ కార్యదర్శి జ్యేష్ట సతీష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గౌరవప్రదమైన పదవిలో ఉండి దళితులపై ఇష్టారాజ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. మంత్రి వ్యాఖ్యలపై స్పందించిన దళితులు రానున్న ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని కోరారు. ఆయన వెంట ఆ పార్టీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

దేవరపల్లి : యువకులు స్వయం ఉపాధి పథకాలను ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ శ్రీకాకుళపు వెంకట నర్సింహరావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ హాల్లో ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీపీ, ఆంధ్రాబ్యాంక్ అధికారులు,ఎంపీడీవోలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సొంత వ్యాపారాలతో జీవితంలో స్థిరపడాలని కోరారు. ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ యు.రాజు మాట్లాడుతూ రుణం పొందిన వారు యూనిట్లు తప్పక నెలకొల్పాలని లేదంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎంపీడీవో కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో వివిధ కార్పొరేషన్లకు 260మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు

ద్వారకా తిరుమల :వేంకటేశ్వరస్వామి ఉపాలయమై లక్ష్మీపురంలో ఉన్న శ్రీజగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు శుక్రవారం యాగశాల వద్ద హోమం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్టాపన, హోమాది కార్యక్రమాలను నిర్వహించారు.

కుంకుళ్లమ్మ ఆలయంలో పూజలు

ద్వారకాతిరుమల : కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అమ్మవారిని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో వేండ్ర త్రినాధరావు పాల్గొన్నారు.



ఎంపీడీవో వాణిని అభినందిస్తున్న ఎంపీపీ ప్రసాద్

గొర్రెల కాపరుల సంక్షేమానికి కృషి చేయాలి

బీసీ చైతన్య సంక్షేమ సంఘం డిమాండ్



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

గోపాలపురం : సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న గొర్రెల కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు, అఖిల భారత యాదవ మహాసభ గొర్రెల కాపరుల జిల్లా ఉపాధ్యక్షుడు దూళిపాళ దుర్గారావు అన్నారు. శుక్రవారం ఆయన రాజంపాలెంలో గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు చింతపల్లి వెంకటేష్ నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. గొర్రెల కాపరుల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఎన్టీఆర్ హయాంలో గొర్రెల కాపరులకు 8 ఎకరాల భూమిని చూపిస్తానని, ఉచిత బీమా, పిల్లలకు విద్యను, ఉచిత విద్యుత్‌ను అందిస్తానని హామీలు ఇచ్చారని అన్నారు. ఈ హామీలను అమలు పర్చాలని డిమాండ్ చేశారు. పాము కాటుకు, పిడుగు పాటుకు, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల కారణంగా మృతి చెందినవారికి ఎటువంటి సాయం అందించడం లేదన్నారు. కార్యక్రమంలో తానింకి గంగరాజు, చింతపల్లి వెంకటేశ్వరరావు, పాముల మునీశ్వరరావు, గంగుల వెంకట్రావు, నలపాల సత్యనారాయణ, గోపనబోయిన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత

ద్వారకా తిరుమల : రామన్నగూడెం పంచాయతీ పరిధిలోని దేవినేనివారిగూడెం పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె సోదరుడు సరికొండ రాజు యూఎస్ఏలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు తన వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండలాధ్యక్షుడు సుంకవల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజానికి తమ వంతు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రామన్నగూడెం గ్రామాధ్యక్షుడు గుణ్ణం రవికుమార్, మాజీ ఎంపీపీ కేతా వుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న సుంకవల్లి

ఎంపీడీవోగా వాణి బాధ్యతల స్వీకరణ

ద్వారకా తిరుమల : ఎంపీడీవోగా కె.వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.అనంతరం మర్యాదపూర్వకంగా ఎంపీపీ వడ్లపూడి ప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వాణి మాట్లాడుతూ గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన అనుభవం ఉందని తెలిపారు. లింగపాలెంలో సూపరింటెండెంట్‌గా పనిచేసి పదోన్నతిపై ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. వాణిని అభినందించిన వారిలో మాజీ జడ్పీటీసీ డీవీఎస్ చౌదరి, ఎంపీటీసీ రాయపాటి సోమేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు పోలిన శ్రీను, టీడీపీ నాయకులు లంక సత్తిపండు, వైస్ ఎంపీపీ జంగా ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు పోతన దర్మరాజు, తూంపాటి సుధీర్ ఉన్నారు.

బోరుబావులు ప్రమాదకరంగా ఉంటే పూడ్చివేయాలి

ఎంపీపీ శ్రీకాకుళపు వెంకట నర్సింహరావు

దేవరపల్లి : బోరుబావుల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ శ్రీకాకుళపు వెంకట నర్సింహరావు కోరారు. శుక్రవారం సాయంత్రం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోరుబావులు చిన్నపిల్లల విషయంలో ప్రాణాంతకంగా తయారయ్యాయని, రైతులు సహకరించి బోరుబావులు ప్రమాదకరంగా ఉంటే మూసివేయాలన్నారు. యర్నగూడెం -త్యాజంపూడి రహదారిని బాగు చేయాలని కోరారు. హార్టికల్చర్ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలకు సబ్సిడీని రూ.36 వేల నుంచి రూ.52వేలకు పెంచినట్లు తెలిపారు. వెటర్నరీ వైద్యుడు సుగుణశ్రీ, ఎంపీడీవో కె.కోటేశ్వరరావు, జడ్పీటీసీ కె.సుధారాణి, ఎంపీటీసీలు వీర్రాజు, డి.యు. రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, జానీ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకాకుళపు వెంకట నర్సింహరావు

ఎక్సైజ్ నిందితులకు బైండోవర్

జంగారెడ్డిగూడెం టౌన్ : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని బెల్టు షాపు నిర్వాహక నిందితులు ఐదుగురిని కొయ్యలగూడెం తహసీల్దార్ కృష్ణజ్యోతి ముందు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ ఆర్. సత్యవతి తెలిపారు. కొయ్యలగూడెం మండలంలోని బయ్యన్నగూడెం, గవరవరం గ్రామాలకు చెందిన మల్లెపూడి పుల్లారావు, కంచర్ల సుబ్బారావు, జి. సాయిబాబు, కె. కొండయ్య, వంకా దుర్గారావులను శుక్రవారం తహసీల్దార్ కృష్ణజ్యోతి ముందు బైండోవర్ పరిచామన్నారు. ఈ ఐదుగురుకి ఆరు నెలల కాలపరిమితికి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పిల్లలకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ వేయించాలి



పేరంపేట ఎంపీపీ పాఠశాలలో రుబెలా వ్యాక్సిన్ వేయించుకున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం టౌన్ : ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను సంరక్షించే తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని పేరంపేట ఎంపీటీసీ కెఎల్ఎన్ ధనకుమార్ తెలిపారు. పేరంపేట అంగన్‌వాడీ కేంద్రలో తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ధనకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన అవయవాలు అయిన మెదడు, చెవి, గుండె ఈ వ్యాక్సిన్ ద్వారా సురక్షితంగా ఉంటాయన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఎం. రాణిరత్నకుమారి, పి.బేబి కుమారి, అంగన్‌వాడీ వర్కర్ జి.విజయకుమారి, టి.శ్రీలక్ష్మి, ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ స్పెషల్ పాఠశాల హెచ్‌ఎం. కె. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం. శ్రీదేవి, కె. ఝూన్సీరాణి, ఎన్ఎన్ఎల్ సుజాత పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కుంకుమార్చన

జంగారెడ్డిగూడెం టౌన్: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కుంకుమార్చనలో విశేష సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు నరసన్నపాలెంకు చెందిన జమ్మి సూర్యారావు కుటుంబసభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. పూజా ద్రవ్యాలను జంగారెడ్డిగూడెంకు చెందిన శ్రీనివాసరావు దంపతులు (మద్ది జ్యూయలర్స్) అందజేశారు. ఈవో ఎంఎస్ఎస్. సంగమేశ్వర శర్మ, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బిక్కిన సత్యనారాయణ, ధర్మకర్తలు తోట రామకృష్ణ, పొనాడ సత్యనారాయణ, మారిశెట్టి బాలకృష్ణ, రామ్మోహనరావు, బోడ వెంకటేశ్వరరావు, గుళ్ళపూడి శ్రీదేవి, అన్నాప్రగడ వీరరాఘవరావు, గొట్టు ముక్కల రాయపరాజు తదితరులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నంద్యాల ఉప ఎన్నికపై పందాలు

జంగారెడ్డిగూడెం: నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ రాయుళ్లు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఈ ఎన్నికల ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా పాకింది. అక్కడ ఎన్నికల ప్రచారాలు చూస్తుంటే రోజురోజుకు వాతావరణం వేడెక్కుతున్నది. వచ్చే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన పార్టీలు పడుతున్న తపనకు అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ క్రమంలో నంద్యాల ఉప ఎన్నికల్లో మాది గెలుపంటే...మాది గెలుపని టీడీపీ, వైసీపీ నాయకులు తొడగొట్టుకుంటున్న నేపథ్యంలో భారీగా బెట్టింగ్‌లు కూడా సాగుతున్నాయి. ప్రధానంగా ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలోని చాలా మంది ఇప్పటికే లక్షల్లో పందాలు కాసినట్టు చెప్పుకుంటున్నారు. ఇవి కాక తమ అభ్యర్థి ఎన్ని ఓట్లు సాధిస్తాడనే దానిపై కూడా పందాలు కాస్తున్నారు. ప్రతీ ఎన్నికల్లో కోట్లాది రూపాయల్లో బెట్టింగ్‌లు ఈ ప్రాంతం నుంచి కాస్తుంటారు. ఇరు రాజకీయ పార్టీలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికల ఫలితాలు బెట్టింగ్‌ల రూపంలో కొంత మందికి శాపంగా మారితే మరి కొంత మందికి వరంగా మారనున్నాయి.



అభ్యర్థుల వివరాలు పరిశీలిస్తున్న బ్యాంక్ అధికారులు

సోపానం లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

జంగారెడ్డిగూడెం టౌన్: సోపానం అభ్యర్థులకు ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి. శ్రీదేవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కాపు, మైనార్టీ కార్పొరేషన్‌లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను అధికారులు పరిశీలించారన్నారు. పూర్తి స్థాయిలో ఇంటర్వ్యూలు ముగిసిన అనంతరం ఎంపిక చేసి లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శీలం రామచంద్రరావు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

జంగారెడ్డిగూడెం టౌన్ : ఉత్తమ సేవారత్న అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్న కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావును బీసీ నాయకులు రాజాన పండు అభినందించారు. అనంతరం కమిషనర్‌ను దుశాలువాతో సత్కరించారు. అభినందనలు తెలియజేసిన వారిలో బీసీ సంఘ నాయకులు తూటికుంట దుర్గారావు, కొండపల్లి కేశుబాబు, చిట్రోజు తాతాజీ, మల్లవరపు సత్యనారాయణ, చిటికల రాంబాబు, రొంగల నాగేశ్వరరావు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ



గ్రామాభివృద్ధికి నిధులు పెంచాలి

జి.మహేశ్వరరావు , సర్పంచ్, తిర్లాపురం

"గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అందుకు తగ్గ నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులతో గ్రామాల్లో ఏమాత్రం అభివృద్ధి పనులు చేయడానికి సరిపోవడం లేదు. మంజూరైన అరకొర నిధులతో వీధి దీపాలు, తాగునీటి పథకాల నిర్వహణకు సరిపోవడం లేదు. దీని వల్ల అనేక గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులు చేయడానికి వీలు లేకుండా పోతున్నది."

● వేలేరుపాడు

సినిమా గైడ్

జంగారెడ్డిగూడెం :

లక్ష్మి	ఫిదా
సౌభాగ్య	జయ జానకి నాయక
,, స్క్రీన్-2	నక్షత్రం
శ్రీ పద్మ	నేనే రాజు నేనే మంత్రి
శ్రీ రాజరాజేశ్వరి	లై

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

జంగారెడ్డిగూడెం	: 9603519823
,, టౌన్	: 9866666757
కుక్కునూరు	: 9440255016
వేలేరుపాడు	: 9440242054

కుక్కునూరు ..

పేద ప్రజల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే మొడియం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు

కుక్కునూరు : పేద ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి సోపానం కింద లబ్ధిదారులకు మంజూరైన రుణాల చెక్కులను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కునూరు మండలంలో 2015-16 సంవత్సరానికి గాను 52 మంది లబ్ధిదారులు, 2016-17 సంవత్సరానికి గాను 77 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కులాలకు చెందిన లబ్ధిదారులను ఎంపిక చేశామని తెలిపారు లబ్ధిదారులంతా కిరాణా షాపులు, ఫ్యాన్సీ షాపులతో పాటు గేదెలు, ఆటోలు, తదితర యూనిట్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో దుర్గాప్రసాద్, తహసీల్దార్ నాగరాజు నాయక్, సీఐ చిరంజీవి, మండల టీడీపీ అధ్యక్షుడు గంగరాజు, నాయకులు నారాయణరాజు, సురేష్‌రాజు, గాడిద నాగేశ్వరరావు, గణపవరం సర్పంచ్ తుర్సం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పోలవరం సమస్యలపై వినతిపత్రం

కుక్కునూరు: పోలవరం సమస్యలపై సీపీఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రతీ కుటుంబానికి చెల్లించాలని, వెంటనే ఆర్‌ఆర్ జాబితాను విడుదల చేయాలని కోరారు. అలాగే భూమికి భూమి ఇచ్చిన చోటే రైతులకు పునరావాసం కల్పించాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ పునరావాస ప్యాకేజీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, వలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ ఫిర్యాదు

కుక్కునూరు : వింజరం రెవెన్యూలో ఖాళీగా ఉన్న భూముల్లో తాము గుడిసెలు వేసుకునేందుకు భూమిని చదును చేసుకుంటుంటే రెవెన్యూ సిబ్బంది అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ గుండంబోరు గ్రామస్థులు ఆరోపించారు. శుక్రవారం నాడు వీరంతా కుక్కునూరు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌ను కలిసి తమ గోడును వినిపించారు. డంపింగ్ యార్డు పేరుతో కొందరు నాయకులు ఎకరాల భూమిని ఆక్రమించినట్టు ఆరోపించారు. ఎకరాలు కాజేసిన బడా నాయకులను వదిలేసి తమపై కేసులు నమోదు చేస్తున్నారని రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేశారు.

అమ్మపాలెం గ్రామస్థులకు అభినందన

జంగారెడ్డిగూడెం టౌన్: మద్యనిషేధం అమలు చేస్తున్న అమ్మపాలెం గ్రామస్థులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బి. శ్రీనివాస్ అభినందించారు. శుక్రవారం అమ్మపాలెంలో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా మద్యనిషేధ గ్రామంగా గుర్తించబడిందన్నారు. ఇందుకు కారణమైన సూరవరపు పున్నయ్య, కుమారుడు సీతారామకృష్ణ, విజేత యువజన సంఘంలను అభినంధించారు. ఎవ్వరైనా బయట నుంచి మద్యాన్ని గ్రామంలోకి తీసుకువస్తే రూ.1000 జరిమానా విధిస్తున్నారన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పాటు పడుతున్న గ్రామసభ్యులను సీఐ బి.శ్రీనివాస్, ఎస్ఐ ఆర్. సత్యవతి ప్రత్యేకంగా అభినందించారు.



ప్రజా సేవ



నూరు శాతం సీసీ రోడ్లు నిర్మించాం

ఎంవీ సుబ్బారావు, సర్పంచ్, చంద్రవరం

గ్రామంలో నూరు శాతం సిమెంట్ రోడ్లు వేశాం. 13, 14 ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ పథకం నిధులు, మేచింగ్ గ్రాంట్ నిధులతో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు వేశాం. స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా అర్హులందరికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాం. ఎస్సీ ఏరియాలో రూ. 3.50 లక్షలతో బోరు ఏర్పాటు చేసి తాగు నీటి సమస్య లేకుండా చేశాం. ఎన్టీఆర్ సుజల పథకంలో శుద్ధిచేసిన తాగునీరు రూ.2కే 20 లీటర్లు సరఫరా చేస్తున్నాం. గ్రామంలో ఎల్ఈడీ వీధి లైట్లు ఏర్పాటు చేశాం. అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడం ద్వారా గ్రామంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నాము.

● చాగల్లు





రహ'దారి' వేయండి..!

ఔరంగబాద్-వేములూరు పంచాయతీ రోడ్డు నిర్మించాలని రైతులు, స్థానికుల వినతి

రహదారి నిర్మించండి మహాప్రభో.. అంటూ గ్రామస్థులు వేడుకుంటున్నా.. అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి కనీసం స్పందన రావడంలేదు. దీంతో ఆయా గ్రామాలకు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మరో పక్క విశాలంగా ఉండే ఆ రహదారి ఆక్రమణలతో కుచించుకుపోతోంది. అయినా అధికారులు కన్నెత్తిచూడడంలేదు.. కొవ్వూరు మండలం వేములూరు నుంచి ఔరంగబాద్ వెళ్లే రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రజలు చాలాకాలం నుంచి అధికారులను కోరుతున్నారు. వేములూరు నుంచి నిడదవోలు వెళ్లేందుకు ఈ రహదారి ఉపయోగపడుతుంది. రెండు కిలోమీటర్లు ఉన్న ఈ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో తోగుమ్మి, వాడపల్లి మీదుగా కొవ్వూరు నుంచి చుట్టు తిరిగి ప్రయాణించాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కొవ్వూరు టౌన్



ఔరంగబాద్-వేములూరు రోడ్డు

ఈ రహదారి నిర్మించాలని అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. రవాణాతోపాటు గ్రామంలో పండించిన పంట ఉత్పత్తులను బయటకు తరలించేందుకు ఈ రహదారి దోహదపడుతుందన్నారు. గతంలో చెరకు, అరటి పంటలను లారీలపై ఈ రహదారి మీదుగా తరలించేవారు. అటువంటివి నేడు ఆక్రమణకు గురైంది. ఇటీవల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఔరంగబాద్ నుంచి డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరై నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికి ఆక్రమణకు గురి కావడంతో సర్వే నిర్వహించి డ్రెయిన్ నిర్మాణానికి హద్దులు నిర్ణయించాలని కాంట్రాక్టర్ పనులు నిలిపేశారన్నారు. ఔరంగబాద్‌కు చెందిన విద్యార్థులు హైస్కూల్ విద్యకు ఏటిగట్టు రహదారిని వినియోగించడం వల్ల పలు ప్రమాదాలుజరిగి మృత్యువాత పడ్డ సంఘనటలు ఉన్నాయి. ఏటిగట్టు రోడ్డుకు ఈ రోడ్డు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుందని, ఇకనైనా ఉన్నతాధికారులు ఈ రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

ఇసుక ర్యాంపుల నిర్వాహకులకు ఆర్డీవో శ్రీనివాసరావు హెచ్చరిక

కొవ్వూరు : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు ఇసుక విక్రయించినట్టయితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని ఆర్డీవో బి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కొవ్వూరు, ఔరంగబాద్ ర్యాంపులకు సంబందించి ర్యాంపుల పడవ యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆర్డీవో, డీఎస్పీ స్థాయి అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినప్పటికి ర్యాంపు నిర్వాహకుల్లో మార్పు రావడం లేదన్నారు. అధిక ధరలు నియంత్రించలేని ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాంపు నిర్వాహకులు ఎవరికీ లంచం ఇవ్వనవసరం లేదని యూనిట్ ఇసుక రూ.800 చొప్పున ప్రజలకు అందజేయాలన్నారు.ప్రభుత్వ పనులకు, నియోజకవర్గ ప్రజలకు మొదటి ప్రాధాన్యం ప్రకారం ఇసుక అందజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఏజీఆర్‌బీ అధికారులు ఏటిగట్టు తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పక్క జిల్లాలో లేని సమస్య మన జిల్లాలో ఎందుకు ఉత్పన్నదో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం యూనిట్ రూ.800 కంటే అధికంగా విక్రయించినట్టయితే లారీలు సీజ్ చేస్తామన్నారు. ర్యాంప్ నిర్వాహకుడు బర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇసుక తవ్వకానికి సంబంధించి యూనిట్‌కు రూ.600 కార్మికులకు అందిస్తున్నామని బోటు యజమానికి ఒరిగేదేమి లేదన్నారు. మారిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాడపల్లి ర్యాంప్ మూసేయడంతో 1200మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారని త్వరితగతిన ర్యాంప్ తెరిపించాలని కోరారు. దీనికి ఆర్డీవో స్పందిస్తూ ర్యాంపును తెరిపించే అధికారం తనకు లేదని జిల్లా శాండ్ మైనింగ్ కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్‌దేనని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కె. విజయకుమార్, పి.శ్రీనివాసరావు, ఏజీఆర్‌బీ డీఈ డి.రత్నరాజు, ఏఈ జి.మణికంఠరాజు, ప్రసన్నకుమార్, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, బూరుగుపల్లి రాఘవులు, కంఠమణి కుమార్, మునిసిపల్ ఆర్ఐ ఎస్.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఇసుక ర్యాంపుల నిర్వాహకులు.. మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఎన్ఎంయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

కొవ్వూరు టౌన్ : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అలుపెరగని పోరాటం చేస్తుందని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకుడు బీవీ.రావు అన్నారు. కొవ్వూరు ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎన్ఎంయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించారు. డిపో కార్యదర్శి ఎం.శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కొవ్వూరు డిపో ఎన్ఎంయూ గౌరవాధ్యక్షుడు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ వై.రామకృష్ణ, రీజనల్ ఉపాధ్యక్షుడు పీవీ.రామారావు, రీజనల్ జాయింట్ సెక్రటరీ వీకె ఎన్.స్వామి, కె.సోమరాజు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

కొవ్వూరు : బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణ అధ్యక్షుడు బోడపాటి ముత్యాలరావు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ, కేంద్రాల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందనే అంశాలను పర్యవేక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పౌష్టికాహారం పంపిణీపై సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తాడిమళ్ల విజయవాణి, జెడ్‌ఏ బేగ్, బి.లక్ష్మి, కొండపల్లి రత్నసాయి, సాయిరాజ్ పాల్గొన్నారు.

నేడు ఉపాధి 'సోపానం' ఇంటర్వ్యూలు

కొవ్వూరు టౌన్ : ఉపాధి సోపానం పథకంలో శనివారం కొవ్వూరు ఆంధ్రాబ్యాంక్‌కు సంబంధించి తోగుమ్మి గ్రామానికి చెందిన 92 మంది లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో రాము తెలిపారు. పట్టణానికి సంబంధించి సిండికేట్ బ్యాంక్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని మునిసిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రాధారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ధర్మవరం ఆంధ్రాబ్యాంక్‌కు సంబంధించి ఎంపీడీవో ఎ.రాము ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

క్రీడాకారులకు యూనిఫాం పంపిణీ

తోగమ్మి(కొవ్వూరు) : తోగుమ్మి అంబేద్కర్ యూత్ సభ్యులకు టీడీపీ నాయకుడు బిక్కిన ఫణీంద్ర కబడ్డీ యూనిఫాం పంపిణీ చేశారు. శుక్రవారం తోగుమ్మి అంబేద్కర్ కాలనీలో 18 మంది క్రీడాకారులకు 7వేలు విలువైన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. యువతీ యువకులు చెడు వ్యాసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పసలపూడి సుభాష్ చంద్రబోస్, క్రీడాకారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం..

- ఉదయం 8గంటలకు కొవ్వూరు-ఇచ్ఛాపురం(డీలక్స్ సర్వీసు వయా విశాఖ, టెక్కలి)
- రాత్రి 7-15కు కొవ్వూరు-హైదరాబాద్,(బీహెచ్ఈఎల్) రిజర్వేషన్ సౌకర్యం కలదు.
- ఉదయం 5-15కు, మధ్యాహ్నం 2-15కు కొవ్వూరు నుంచి విజయవాడ
- ఉదయం 7-20కు, కొవ్వూరు-భద్రాచలం
- ఉదయం 9-15, రాత్రి 9-15కు కొవ్వూరు నుంచి రాజమండ్రి, గుంటూరు మీదుగా మాచర్ల
- ఆర్టీసీ ఎంక్వయిరీ.. 08813-231514

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

కొవ్వూరు	: 94900 86600
తాళ్లపూడి	: 94410 87274
చాగల్లు	: 94404 15499

సినిమా గైడ్

కొవ్వూరు :	
గాయత్రి	జయ జానకి నాయక
అనన్య	లై, నేనే రాజు.. నేనే మంత్రి
చాగల్లు :	
వెంకటకృష్ణ	నేనే రాజు నేనే మంత్రి
వెంకట్రామా	జయ జానకి నాయక

పల్లపు ప్రాంతాలు జలమయం

భారీ వర్షం..ప్రజల అవస్థలు

పెరవలి : రెండు రోజులుగా కురుస్తోన్న వర్షానికి పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పెరవలి మండలంలోని లంకమాలపల్లి, మల్లేశ్వరం, కానూరు, కాపవరం, పెరవలి గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు నిల్వ ఉండిపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. లంకమాలపల్లి, మల్లేశ్వరం ఎస్సీ ఏరియాల్లో కొద్దిపాటి వర్షం కురిసినా నీరు బయటకు వెళ్లే మార్గం లేక అక్కడే నిల్వ ఉంటుంది. ఏ క్షణంలో ఏ అనారోగ్యాలు ప్రబలతాయోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు విషయం గమనించి ఆయా ప్రాంతాల్లో నీటిని బయటకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


లంకమాలపల్లిలో సీసీ రోడ్డుపై నిల్వ ఉండిపోయిన నీరు

చాగల్లు మండలంలో.. శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. రోడ్లు, డ్రెయిన్లు వర్షం నీటితో పొంగి ప్రవహించాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. వరి, చెరుకు సహా ఉద్యాన పంటలకు వర్షం ఉపయోగకరమేనని రైతులు చెబుతున్నారు.

ఉండ్రాజవరం మండలంలో.. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు అవస్థలు పడ్డారు. వర్షాలు పడడం వల్ల మండలంలో జరుగుతున్న ఉపాధి పనులకు కొంత మేర ఆటంకం ఏర్పడింది. మండల పరిధిలోని మోర్త మురుగు డ్రెయిన్‌లో తూడు ఉండడం వల్ల మురుగు నీరు, వర్షపు నీరు వెళ్లకపోవడంతో నీరు అక్కడక్కడ గట్లను తాకింది. గుర్రపు డెక్కను గత వేసవిలో నిర్మూలించేందుకు క్రిమి సంహారకమందులు చల్లినా కొన్ని చోట్ల గుర్రపు డెక్క ఎండిపోకుండా ఉండడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. వర్షాలు ఎక్కువగా కురుస్తాయి గనుక అధికారులు గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.


చాగల్లులో రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ చినరాములు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గజ్జరం(తాళ్ళపూడి) : టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉన్నదని పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండల స్థాయి సమావేశాన్ని ఆయన ఆధ్వర్యంలో గజ్జరం సర్పంచ్ మల్లిపూడి చినరాములు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా గోపాలపురం ఏఎంసీ డైరెక్టర్ ఇల్లూరి బాబ్జి పాల్గొని మాట్లాడారు. ప్రతీ కార్యకర్త టీడీపీ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. మండలంలో ఇప్పటికే అభివృద్ధి పనులు చేశామని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన మంత్రి జవహర్ తనయుడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆశీష్ అమృతలాల్ పుట్టిన రోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఇల్లూరి బాబ్జి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొఠారు వెంకటరావు, సర్పంచ్ మల్లిపూడి చినరాములు,తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

పెరవలి : దొంగతనాలు, చీటింగ్, గల్ఫ్ మోసాల విషయంలో ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తణుకు సీఐ చింతా రాంబాబు సూచించారు. ముక్కామల పంచాయతీ కార్యాలయం నందు శుక్రవారం పోలీసులు స్థానికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ అనుమానంగా ఎవరైనా తారసపడినట్టయితే పోలీసులకు సమాచారం అందించాలని అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

చాగల్లు : జైపూర్ సుగర్ కంపెనీ కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కేఎస్.జవహర్ హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ కార్మికులు వేతనాలు చెల్లించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. దీక్ష శిబిరాన్ని మంత్రి సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ ఎండీతో ఫోన్‌లో మాట్లాడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు విలేకరులకు చెప్పారు. ప్రభుత్వం తరపున యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి సతీష్, తెలుగు యువత నాయకుడు నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయం చేయాలని కోరుతూ కార్మికులు నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు రామ్మోహనరావు, చింతకాయల బాబూరావు, తదితరులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.


కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి కేఎస్.జవహర్

ఏటిగట్టు పటిష్టత పనులు ప్రారంభం

తాళ్ళపూడి : మండలంలో ఏటిగట్టు పటిష్టతకు పనులు ప్రారంభించారు. ముళ్ల పొదల తొలగింపుతోపాటు గట్టు పటిష్టతకు ఎక్స్‌కవేటర్‌తో పనులు నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా తాళ్ళపూడి ఏటి గట్టుపై మొక్కలను ఎక్స్‌కవేటరుతో తొలగించి గట్టును పటిష్టపరుస్తున్నారు. మండల పరిధిలో చిడిపి నుంచి తాడిపూడి వరకు సుమారు 10 కిలోమీటర్ల నిడివిన గట్టు పటిష్టం చేయాల్సి ఉంది. అయితే ఎండాకాలం చేపట్టాల్సిన పనులు వర్షాకాలంలో ప్రారంభించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం వర్షంలో సైతం పనులు చేస్తున్నారు. విజ్జేశ్వరం నుంచి పోలవరం వరకు సుమారు 40 కిమీటర్ల మేర ఏటగట్టు పటిష్టతకు రూ.35 లక్షలు మంజూరయ్యాయని ఏజీఆర్‌బీ ఏఈ మణికంఠరాజు తెలిపారు. అందులో భాగంగా తాళ్ళపూడి మండలం చిడిపి నుంచి తాడిపూడి వరకు పది కిలోమీటర్ల మేర రూ.8 లక్షల నిధులతో పనులు చేపట్టామన్నారు. సుమారు రెండు నెలల వ్యవధిలో పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.


తాళ్ళపూడిలో ఏటిగట్టు పటిష్టత పనులు చేస్తున్న దృశ్యం

పీహెచ్‌సీల సందర్శన


ఉండ్రాజవరం ఆస్పత్రి వార్డులో రోగులతో మాట్లాడుతున్న కోటేశ్వరి

ఉండ్రాజవరం/చాగల్లు : పీహెచ్‌సీలలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో కె.కోటేశ్వరి తెలిపారు. శుక్రవారం ఉండ్రాజవరం, చాగల్లు పీహెచ్‌సీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వార్డుల్లో రోగులను పరిశీలించి మాట్లాడారు. పీహెచ్‌సీలకు వచ్చే రోగులు వివరాలు వారికి అందిస్తున్న సేవలు రికార్డు రూపంలో ఉండాలన్నారు. రూబెల్లా, మీజిల్స్ టీకా కార్యక్రమం వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న కాన్పుల వివరాలు, గర్భిణుల నమోదు, పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యాధికారి విజయకుమార్ మాట్లాడుతూ రూబెల్లా టీకాలు మండలంలో 70శాతం పూర్తయ్యాయని డీఎంహెచ్‌వోకు వివరించారు. అనంతరం సిబ్బందికి డీఎంహెచ్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో చాగల్లు మండల వైద్యాధికారి పీ.దేశాయ్‌నాథ్ వర్మ, వైద్యులు మైఖేల్, సాయి, హెల్త్ సూపర్‌వైజర్ టి.విల్సన్ బాబు, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

● నేడు 'సోపానం' ఇంటర్వ్యూలు

చాగల్లు : స్వయం ఉపాధి రుణాల మంజూరులో భాగంగా శనివారం చిక్కాల, గౌరిపల్లి, నందిగంపాడు గ్రామాలకు చెందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో పురుషోత్తమరావు తెలిపారు. శుక్రవారం బ్రాహ్మణగూడెం, కలవలపల్లి గ్రామాలకు ఇంటర్వ్యూలు జరిగాయి.

పెరవలి మండలంలో.. కాకరపర్రు ఆంధ్రాబ్యాంక్ పరిధిలోని అజ్జరం, వెంకట్రాయపురం, తీపర్రు, కాకరపర్రు గ్రామాలకు చెందిన అభ్యర్థులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎస్టీవీ రాజేశ్వరరావు తెలిపారు.

తాళ్ళపూడి మండలంలో.. అన్నదేవరపేట గ్రామానికి చెందిన అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ జీ.జ్యోతిర్మయి తెలిపారు. దరఖాస్తుదారులకు అదే గ్రామానికి చెందిన బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని అన్నారు. దరఖాస్తుదారులు ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మూడు జిరాక్స్ సెట్‌లతో పాటుగా ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూల్యకు హాజరుకావాలన్నారు.

● 30న సాంస్కృతిక పోటీలు

చాగల్లు : సెట్‌వెల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో తణుకు మహిళ జూనియర్ కళాశాలలో సాంస్కృతిక పోటీలు ఈనెల 30న జరుగుతాయని ఎంపీడీవో కే.పురుషోత్తమరావు తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. జానపదం, శాస్త్రీయ సంగీతం, ఏకాంకిక నాటిక, తదితర అంశాలపై జరిగే పోటీల్లో పాల్గొనదలచిన వారు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

● బ్రోమోడయోలిన్ పంపిణీ

పెరవలి : మండలంలో అన్ని గ్రామాల్లో రైతులకు శనివారం ఎలుకల నివారణకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మందును అందించనున్నామని ఆయన తెలిపారు.

● విద్యార్థులకు ఎంఆర్ టీకాలు

పెరవలి : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎంఆర్ టీకాలు వేశారు. కానూరు పీహెచ్‌సీ పరిధిలోని కానూరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పెరవలి పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపల్లి అగ్రహారం గ్రామంలో పాఠశాలల విద్యార్థులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్‌వో కోటేశ్వరి శుక్రవారం కానూరు పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న టీకాల కార్యక్రమంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కానూరు పీహెచ్‌సీ వైద్యులు లావణ్య, యశోద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఎలుకల మందు పంపిణీ వాయిదా

తాళ్ళపూడి : వాతావరణం అనుకూలించకపోవడంతో శుక్రవారం నిర్వహించాల్సిన ఎలుకల నివారణకు మందు పంపిణీ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేశామని వ్యవసాయశాఖ ఏఓ రత్నప్రభ అన్నారు. శుక్ర, శనివారాలలో జరగాల్సిన ఎలుకల నివారణకు చేపట్టిన కార్యక్రమం వర్షం కారణంగా వాయిదాపడిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి తేదీలు ప్రకటిస్తామన్నారు.



ఎడతెరపిలేని వాన

నిడదవోలు : నిడదవోలు పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి చిరు తుంపర్లతో పట్టణంలో చల్లని వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గణేష్‌చౌక్ సెంటర్‌లోని డ్రయిన్లు పొంగి పొర్లాయి. వర్షానికి పాఠశాల విద్యార్థులు, వాహనదార్లు, పలు ఇబ్బందులు పడ్డారు.

ప్రజా సేవ



రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు

అతికాల రమ్యశ్రీ, జడ్పీటీసీ, పెరవలి

రూ. 50 లక్షలతో ఖండల్లి రజకుల ఏరియాలో కానూరు హైస్కూలు సమీపంలో ముక్కామల, వెంకట్రాయపురం , ఖండవల్లి సంత మార్కెట్ పరిధిలో సీసీ రోడ్లు నిర్మించాం. మరో రూ. 25 లక్షలతో పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి తలపెట్టాం. ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు అధికారులు స్థానికులు సహకరిస్తున్నారు.

పెరవలి

విద్యాసామగ్రి పంపిణీ

కోరుమామిడి (నిడదవోలు రూరల్) : దాతల సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు గునిపూడి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని కోరుమామిడి మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలనెం 1 విద్యార్థులకు కొనిజేటి నారాయణ, కెఎన్‌విపి కుమార్ ఆర్థిక సాయంతో వాకర్స్ క్లబ్ నిడదవోలు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్, పెన్ను, పెన్సిల్స్ విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కోశాధికారి కుమార్, యోగా గురువు నరేష్ ,హెచ్‌ఎం రోజ్‌మణి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

నిడదవోలు	: 83410 21222
నిడదవోలు రూరల్	: 9491713669
పెరవలి	: 9493448995
ఉండ్రాజవరం	: 98664 24817

సినిమా గైడ్

నిడదవోలు :

వీరభద్ర	ఆనందోబ్రహ్మ
గణపతి	నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ	జయజానకీ నాయక

22న కాపునాడు ఆధ్వర్యంలో చలో కిర్లంపూడి

నిడదవోలు : కాపునాడు జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు పిలుపు మేరకు ఈనెల 22వ తేదీ మంగళవారం చలో కిర్లంపూడి నిర్వహిస్తున్నామని కాపులంతా పెద్దఎత్తున తరలిరావాలని పట్టణ కాపునాడు అధ్యక్షుడు రంగా మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రంగా సుబ్బారావు సత్యవతి కాపు కళ్యాణ మం డపంలో కాపునాడు ముఖ్యనాయకులు సమావేశం నిర్వహించారు. మధు సూదనరావు మాట్లాడుతూ ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కోరోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా 22వ తేదీ నిడదవోలు నియోజకవర్గం నుంచి చలో కిర్లంపూడి జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటలకు కాపుకళ్యాణ మండపం నుంచి వాహనాలు బయలుదేరుతాయన్నారు. శాంతియుత వాహన ప్రదర్శన కార్యక్రమంలో కాపు యువతీయువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని చలో కిర్లంపూడి జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో యాళ్ళ రామారావు, కాపకాయల సూర్య నారాయణ, కొప్పుల రామదేవుడు, బాపన్న, గాజుల రంగారావు, కత్తినొక్కుల మురళీకృష్ణ, కొత్తూరి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు కాపు కళ్యాణమండపంలో వివరాలు వెల్లడిస్తున్న కాపుసంఘం పట్టణ అధ్యక్షుడు రంగా మధుసూధనరావు

ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

నిడదవోలు : నిడదవోలు పురపాలక సంఘ పరిధిలోఎస్సీ, ఎస్టీ, బీసి, కాపు, మైనారిటీ, క్రిస్టియన్ కార్పోరేషన్ ద్వారా రుణాల పొందేందుకు దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 19వ తేది శనివారం నుంచి 30వ తేది బుధవారం వరకు బ్యాంకుల వారీగా నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ జి.కృష్ణమోహన్ తెలిపారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఆంధ్రాబ్యాంక్,నిడదవోలు, 21వ తేదీ ఉదయం 9 గంటల నుంచి బ్యాంక్ ఆఫ్ ఇండియా-నిడదవోలు, 22వ తేది ఉదయం 9 గంటలకు కెనరా బ్యాంక్-నిడదవోలు, 23వ తేది ఉదయం 9 గంటల నుంచి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్-నిడదవోలు, కార్పోరేషన్ బ్యాంక్-నిడదవోలు, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ , 24 ఉదయం 9 గంటల నుంచి ఇండియన్ బ్యాంక్ కరూర్ వైశ్యా బ్యాంక్, 28వ తేది ఉదయం 9 గంటల నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇం డియా-స్టేషన్‌రోడు, 30వ తేదీ ఉదయం 9 గంటల నుంచిస్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-గణేష్‌చౌక్, నిడదవోలు, బ్యాంకులకు వివిధ కార్పోరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులంతా పైన తెలిపిన తేదీలలో సంబంధిత పత్రాలతో పురపాలక సంఘ కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్

ఆదినారాయణరెడ్డిని బర్తరఫ్ చేయాలి

నిడదవోలు : దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డిని వెంటనే మంత్రిగా బర్తరఫ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిడదవోలు పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేసి మంత్రి దిష్టి బొమ్మ దహనంచేశారు. తహసీల్దార్ ఎమ్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు మత్తి అర్జునుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డిని బర్తరఫ్ చేయాలన్నారు. న్యాయవాది నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగంపై అందరిని సమాన దృష్టితో చూస్తానని ప్రమాణం చేసి ఒక కులాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు చేసినందుకు మంత్రి తక్షణ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బట్టు సురేష్‌బాబు, సిహెచ్.విజయ్‌కుమార్, జువ్వల రాంబాబు, కె.శ్రీనివాసరావు, ముప్పిడి మంగయ్య, పి.రాజేష్‌బాబు, ఎమ్.మహబూబ్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పొలాల్లో గుర్తించిన ఎలుక బొరియలను పూడుస్తున్న రైతులు

ఎలుకల బొరియలు పూడ్చివేత

నిడదవోలు రూరల్ : మండలంలోని 23 గ్రామాల్లోనూ సుమారు 16 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. పంటనష్టం నివారించేందుకుగాను 18,19 తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలనఅమలుకు సర్వం సిద్ధం చేశారు. అందులో భాగంగా శుక్రవారం పంట పొలాల్లోనూ , ఖాళీ ప్రదేశాల్లోనూ, పోరంబోకు స్థలాల్లోనూ,గట్లు వెంబడి ఉన్న సుమారు 3 లక్షల ఎలుక బొరియలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చివేశారు.

వాయిదా పడిన సామూహిక ఎలుకల నివారణ

మండలంలో శనివారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఎలుక నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు మండల వ్యవసాయాధికారి గుత్తుల సత్యనారాయణ తెలిపారు. సామూహిక ఎలుక నిర్మూలన పథకంలో భాగంగా శుక్రవారం ఎలుక బొరియలను పూడ్చి శనివారం ఎలుక నిర్మూలనకు అవసరమైన బ్రోమో డయోలిన్ మందు పంపిణీ చేయవలసి ఉంది. అయితే శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు కార్యక్రమం వాయిదా పడినట్లు సత్యనారాయణ తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది రైతులకు తెలియపరుస్తామని ఆయన తెలిపారు.



మధ్యాహ్నం భోజన పథకం పరిశీలిస్తున్న డీవైఈఓ నాగేశ్వరరావు

ఉత్తీర్ణత శాతం మెరుగుపర్చాలి

కాటకోటేశ్వరం (నిడదవోలు రూరల్) : వెనుకబడిన తరగతుల విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపర్చవచ్చునని జిల్లా ఉప విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. నిడదవోలు మండలం కాటకోటేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నాగేశ్వరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అమలు చేస్తున్న ప్రణాళికను పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎంఈఎం కోలేను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై ప్రశ్నలను వేసి జవా బులను రాబట్టారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



సమిశ్రగూడెం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంక్ అధికారులు

160 మందికి స్వయం ఉపాధి ఇంటర్వ్యూలు

సమిశ్రగూడెం (నిడదవోలు రూరల్) : నిరుద్యోగ యువతకు వివిధ కార్పోరేషన్ల ద్వారా స్వయం ఉపాధి సోపాన పథకం ద్వారా రుణాలు అందించేందుకు శుక్రవారం 160 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు మండల అభివృద్ధి అధికారి అబ్బిరి ఆంజనేయులు తెలిపారు. మండలం నుంచి 200 మంది నిరుద్యోగులు రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వాం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇండియన్ బ్యాంక్ నిడదవోలు బ్రాంచ్, ఇండియన్ బ్యాంక్ వేలివెన్ను బ్రాంచ్ అధికారులు పాల్గొని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 160 మంది హాజరయ్యారన్నారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఆయా బ్యాంక్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

సమిశ్రగూడెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారులు, మధ్యాహ్నం 2 గంటలకు కరూర్ వైశ్యా బ్యాంక్ అధికారులచే ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులు రెండు ఖాతాలు ప్రారంభించేందుకు అవసరమైన డేటాతో హాజరు కావాలని ఆంజ నేయులు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఏర్పాటు



ఎమ్.రాజేష్, అధ్యక్షుడు



పి.సాయి, కార్యదర్శి

నిడదవోలు : నిడదవోలు పట్టణంలో శుక్రవారం ఎస్ ఎఫ్ఐ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి పి.సాయికృష్ణ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎమ్.రాజేష్, కార్యదర్శిగా పి.సాయి మరో ఎనిమిది మంది కమిటీసభ్యులుగా ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి పి.సాయికృష్ణ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచని కారణంగా విద్యార్థులు అర్ధాకలితో చదువులు కొనసాగించవలసి వస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యా వ్యాపారాన్ని పెంచి పోషించేందుకు ప్రభుత్వం కొత్తగా తీసుకు వస్తున్న సెల్ఫ్ ఫైనాన్స్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యు.పార్థసారధి,కె.రాజు, కె.సతీష్ బి.మణికంఠ, కెఎన్‌డి సత్యనారాయణ, చందు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కోట సత్తెమ్మ ఆలయంలో సామూహిక పూజలు

నిడదవోలు :నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని కోటసత్తెమ్మ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. సుమారు ఎనిమిది వందల మంది ముత్తయిదువలు వ్రతాలలో పాల్గొన్నారు. ముత్త యిదువులకు పసుపు కుంకుమ గాజులు, తమలపాకులు, లడ్డూ ప్రసాదం అందజేసినట్లు ఈవో పాతూరి లోకేశ్వరి తెలిపారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, ఛైర్మన్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, సభ్యులు వెంకటేశ్వర్లు విశ్వేశ్వరరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసేవ



రూ.5 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపడతాం

కలిదిండి స్వర్ణ
సర్పంచ్. మొగల్తూరు.

“మొగల్తూరు పంచాయతీ పరిధిలో రూ. 5 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే సహకారంతో రూ.2 కోట్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం నుంచి మరో రూ. 2 కోట్లు పంచాయతీ సొంత నిధులు రూ.50 లక్షలు మంజూరయ్యాయి. గ్రామ స్థుల నుంచి మరో రూ. 50 లక్షలు విరాళాలు సేకరించి డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రానున్న ఏడాది కాలంలో గ్రామంలో నూరుశాతం అంతర్గత రహదారులు పూర్తిచేస్తాం.”

● మొగల్తూరు



నరసాపురం నుంచి రైళ్ల వివరాలు

నెంబర్	రైలు పేరు	సమయం
77265	నిడదవోలు	ఉ. 4.20
57382	గుంటూరు (ఫాస్ట్ ప్యాసింజర్)	ఉ. 6.05
77203	గుడివాడ	ఉ. 7.45
17241	విశాఖ (సింహాద్రి ఎక్స్‌ప్రెస్)	ఉ. 10.00
17213	నాగర్‌సోల్ (ఎక్స్‌ప్రెస్)	ఉ. 10.25
57316	గుంటూరు ప్యాసింజర్	మ. 12.40
77025	భీమవరం	మ. 3.55
17404	తిరుపతి ఎక్స్‌ప్రెస్	సా. 5.15
17255	హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్	రా. 6.55
77241	రాజమండ్రి	రా. 7.45
57264	విశాఖ పాస్ట్‌ప్యాసింజర్	రా. 11.05

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

నరసాపురం : 99854 08990
,, రూరల్ : 80087 07494
నరసాపురం అర్బన్ : 9491018919
మొగల్తూరు : 92474 93435

సినిమా గైడ్ :

నరసాపురం :

అన్నపూర్ణ	నేనే రాజు నేనే మంత్రి
రాజరాజేశ్వరి	జయ జానకీ నాయక
కనకదుర్గ	లై

మొగల్తూరు :

శ్రీదేవి జానకి	జయ జానకీ నాయక
శ్రీదేవి జానకి మినీ	నేనే రాజు నేనే మంత్రి

తీరంలో రహదారులను అభివృద్ధి చేస్తాం

80 కిలో మీటర్ల పీఆర్ రహదార్లను ఆర్అండ్‌బీ రోడ్లుగా మారుస్తాం : ఎమ్మెల్యే మాధవనాయుడు

నరసాపురం రూరల్ : తీర ప్రాంతంలో సుమారు 80 కిలో మీటర్ల పంచాయతీ రహదార్లను ఆర్అండ్‌బీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మాధవనాయుడు అన్నారు. శుక్రవారం పీఎంలంక గ్రామంలో రూ. 5 కోట్లతో చేపట్టే అప్రోచ్ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.37 కోట్లతో చేపట్టే ఈ పనులకు సీఎం చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారన్నారు. దీనివల్ల రహదార్ల విస్తరణ చేస్తామన్నారు. గ్రామాల్లో మౌలికంగా అభివృద్ధికి నోచుకుంటాయన్నారు. ఈ పనుల్లో పీఎంలంక, పేరుపాలెం, బియ్యపుతిప్ప, చినలంక, వేములదీవి, సీతారాంపురం, లక్ష్మణేశ్వరం, ఎల్‌బీచర్ల, తూర్పుతాళ్ళు రహదారులు ఉన్నాయన్నారు. ఈ రహదార్ల వల్ల వరదలు, తుఫాన్‌లు, వాయుగుండాలు సంభవించినా సహాయక చర్యలు త్వరితగతిన చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే పీఎంలంక గ్రామంలో రూ. 10 కోట్లతో వంతెన నిర్మాణాలు, రోడ్ల పనులు చేపట్టామన్నారు. త్వరలో చినలంక నుంచి పేరుపాలెం వరకు సముద్రతీర వెంబడి సుమారు రూ.10 కోట్లతో బీచ్ రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకన సుబ్రహ్మణ్యం, ఎంపీపీ వాతాడి కనకరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆర్. శ్రీరాములు, సర్పంచ్‌లు టి. నాగలక్ష్మి, చామకూరి సుబ్బాలక్ష్మి, టీడీపీ నాయకులు ఆంద్రాజు చల్లారావు, వాతాడి ఉమా, చాగంటి సురేష్, కొండేటి వెంకట సుబ్బారావు, మోసుగంటి శేఖర్‌బాబు, టి.అర్జునరావు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

మసీదు సమీపంలో మద్యం షాపు తొలగించాలి

పీచుపాలెంలో ముస్లింల ధర్నా

నరసాపురం టౌన్ : పీచుపాలెం పెద్ద మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ శుక్రవారం ముస్లిం సోదరులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పట్టణంలోనే పెద్ద మసీదుగా పేరుగాంచిన ప్రదేశ సమీపంలో మద్యం షాపు ఏర్పాటు తగదంటూ నినాదాలు చేశారు. తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ముందుగా పాతబజార్ నుంచి ముస్లిం సోదరులు ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీని కలిశారు. మద్యంషాపు ఏర్పాటు వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. కొందరు మందుబాబులు కిక్ మైకంలో మసీదు అరుగుల మీద పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపును మరో ప్రదేశానికి తరలించాలని విన్నవించారు. అనంతరం ఎక్సైజ్ అధికారులు, స్థలాన్ని అద్దెకి ఇచ్చిన యాజమానితో సబ్ కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఇమాం, ఆలీ, మాజీ వీసీ షేక్ బుల్లిమస్తాన్, ముస్లిం పెద్దలు దావూద్‌ఖాన్, సిలార్‌సాహెబ్, బడావలీ, ఖాజా, బషీర్‌ఖాన్, అయూబ్, నూరుల్లా, భాషా తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ముస్లింలు

‘కండ బలం కంటే.. మానసిక బలం గొప్పది’



స్వామిపరిజ్ఞాయానందకు జ్ఞాపిక అందిస్తున్న వైఎన్ కళాశాల సభ్యులు

నరసాపురం : కండ బలం కంటే.. మానసిక బలమే గొప్పదని రామకృష్ణ మఠం ఎడిటర్ స్వామిపరిజ్ఞాయానంద మహారాజ్ అన్నారు. శుక్రవారం వైఎన్ కళాశాల హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో ‘వ్యక్తిత్వ వికాసం’పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు విలువలతో కూడిన ప్రవర్తనను అలవర్చుకోవాలన్నారు. అప్పుడే సమాజంలో గుర్తింపును పొందుతారన్నారు. మంచి పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. మరో ముఖ్యఅతిథిగా స్వామియోగేషానంద మహారాజ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి అధ్యాత్మికత అలవర్చు కోవాలన్నారు. మనస్సును నియంత్రించుకోవడం, దురవ్యసనాలకు దూరంగా ఉండడం, యోగా, వ్యాయామం వంటి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఆర్ఎస్ కుమార్, డైరెక్టర్లు డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్, డాక్టర్ వెంకటేశ్వరావు, అధ్యాపకులు డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా తెలుగుదేశంకు సిద్ధం కావాలి

• ఎమ్మెల్యే మాధవనాయుడు • కాపు, బీసీ, మైనార్టీలకు రుణాల పంపిణీ



బీసీలకు రుణాలను అందిస్తున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

నరసాపురం టౌన్ : త్వరలో చేపట్టే ఇంటింటా తెలుగుదేశం కార్యాచరణకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని ఎమ్మెల్యే మాధవనాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద టీడీపీ పట్టణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు సమస్యలను తెలుసుకోవాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మూడు నెలల పాటు జరిగే కార్యక్రమంలో పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు కూడా విధిగా పాల్గొనాలన్నారు. వార్డు, పట్టణ స్థాయిలో సమావేశాలు నిర్వహించి కేడర్‌ను సిద్ధం చేయాలన్నారు.

లబ్ధిదారులకు రుణాల పంపిణీ..

బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరైన రుణాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా అర్హులైన వారందరికీ ఈ ఏడాదిలో మరో దఫా రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వీసీ పొన్నాల నాగబాబు, మహిళ కమిషన్ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి, కమిషనర్ రమణ, డీసీసీబి బ్యాంకు మేనేజర్ రామకృష్ణంరాజు, ఆంద్రాజు చల్లారావు, కౌన్సిలర్లు అధికారి అనంత రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

రేపు ‘చలో కిర్లంపూడి’

నరసాపురం టౌన్ : కాపుల రిజర్వేషన్‌పై కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఆదివారం ‘చలో కిర్లంపూడి’ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు కాపు సంఘం నాయకులు కోటిపల్లి సురేష్, తమ్మిశెట్టి బాబ్జి తెలిపారు. ఉదయం 10 గంటలకు తెలగా కల్యాణ మండపం నుంచి కార్ల ర్యాలీగా కిర్లంపూడి తరలివెళుతున్నామన్నారు. కాపు సోదరులు తరలి రావాలని వారు కోరారు.

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్

నరసాపురం టౌన్ : పట్టణంలోని వివేక బాలభారతి స్కూల్ విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు ప్రారంభించారు. క్లబ్ సభ్యులు ఎం.సీతారామ్, టి. లక్ష్మీనారాయణ, ఎం. వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

నరసాపురం టౌన్ : పట్టణంలోని పాతబజార్ ప్రాంతంలోని విజయదుర్గాదేవి ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వరలక్ష్మి, మంగళగౌరి, కుబేర ధనలక్ష్మి, వైభవలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పూజలు చేశారు. కమిటీ సభ్యులు పెమ్మాడి నర్సింహరావు, కొపనాతి రుషేంద్రరావు, సంగాని వెంకటేశ్వరావు, వెంకటకృష్ణ, కృపారావు, కాశి తదితరులు పాల్గొన్నారు.



సూర్యనారాయణమూర్తిని సన్మానిస్తున్న కళాశాల పాలకవర్గం

వ్యాయామంతోనే వ్యాధులకు చెక్

నరసాపురం టౌన్ : వ్యాయామంతో మానసిక ఒత్తిళ్లను తగ్గించుకుని దీర్ఘకాల వ్యాధులకు చెక్ పెట్టవచ్చని ఐయోడెక్స్ ఫార్మ కంపెనీ వీసీ డాక్టర్ యర్రమిల్లి సూర్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం వైఎన్ కళాశాలలో మూత్రపిండాల వ్యాధులపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఇటీవల కాలంలో అత్యధిక మంది బాధపడుతున్న వ్యాధుల్లో మూత్రపిండాలకు సంబంధించిన రోగాలే ఉన్నాయన్నారు. చిన్నతనంలోనే షుగర్, బీపీ వంటి దీర్ఘకాలక వ్యాధులకు గురికావడం వల్ల మూత్రపిండాలు దెబ్బతింటున్నాయన్నారు. మొదటి దశలోనే వ్యాధిని గుర్తిస్తే ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. అనంతరం ఆయనను కళాశాల పాలకవర్గం ఘనంగా సన్మానించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, కోశాధికారి యర్రమిల్లి గోపాలకృష్ణ, బీఈడీ, ఇంటర్ కళాశాల కరస్పాండెంట్‌లు కానూరి స్వామినాయుడు, పోలిశెట్టి రఘురామ్, ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు రోనాల్ట్, ఆనందకుమార్, రామచంద్రరావు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ప్రజా సేవ



తాగునీటి ఎద్దడి లేకుండా
చెరువులు తవ్వించాం

నిమ్మకాయల హిమబిందు,
సర్పంచ్, కొంతేరు

"గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చెరువును రూ.90లక్షలతో తవ్వించాం. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోడ్ల వెంబడి చెట్లు నాటించడంతో పాటు పలు ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వించి ప్రజల్లో నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామంలో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం. స్వచ్ఛ భారత్‌లో భాగంగా రోడ్ల వెంట చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలి."

● పాలకొల్లు రూరల్

స్వచ్ఛ విద్యాలయంగా
గరల్స్ హైస్కూల్ ఎంపిక

పాలకొల్లు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికిగాను జిల్లాలో 4 పాఠశాలలు ఎంపిక కాగా పాలకొల్లు నియోజకవర్గంలో రెండు పాఠశాలలున్నాయి. పట్టణంలోని బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్, యలమంచిలి మండలం ఇలపకుర్రు జడ్పీ హైస్కూల్ ఎంపికైనట్టు ఎంఈవో ముదునూరి రంగరాజు తెలిపారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం నుంచి 24 పాఠశాలలు ఎంపిక కాగా, జిల్లాలోని 4 పాఠశాలల్లో రెండు పాలకొల్లు నియోజకవర్గంలోనివేనని ఎంఈవో తెలిపారు. స్వచ్ఛ విద్యాలయాలుగా పురస్కారానికి ఎంపికైన హెచ్ఎంలకు సెప్టెంబర్ 1న ఢిల్లీలో అవార్డులు అందిస్తారని ఎంఈవో తెలిపారు.

సినిమా గైడ్ :

పాలకొల్లు :

శ్రీ అన్నపూర్ణ	ఫిదా
శ్రీనివాస	ఏజెంట్ భైరవ
శ్రీనివాస మినీ	గ్రీన్ కార్డు
శ్రీనివాసా డిజిటల్	నక్షత్రం
రంజని	ఆనందో బ్రహ్మ
దాసరి మినీ	దువ్వాడ జగన్నాథం
మారుతి	నిన్ను కోరి

పట్టణంలో భారీ వర్షం



పాలకొల్లు అర్బన్ : పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బులు కమ్మి వాతావరణం చల్లగా మారింది. మధ్యాహ్నం చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం సాయంత్రం 7గంటల వరకు కురుస్తూనే ఉంది. దీంతో పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే 7గంటల తరువాత వర్షం తగ్గింది. అయితే ఆకాశం మాత్రం మేఘావృతమై ఉండటంతో రాత్రి మళ్లీ భారీ వర్షం కురిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి

ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు



విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొల్లు : 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు ప్రతి చిన్నారికి ఎంఆర్(తట్టు, రుబెల్లా)వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించాలని ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు అన్నారు. ఎంఎంకేఎన్ఎం హైస్కూల్ హెచ్ఎం ఏఎన్‌వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాక్సిన్‌లు వేశారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఎన్.మస్తాన్ పర్యవేక్షణ చేసి సిబ్బందికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులు తగు సలహాలు, సూచనలు చేశారు.వ్యాక్సిన్ ఆవశ్యకతను తెలిజేశారు. డాక్టర్ జి.సుగుణ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు సెప్టెంబర్ 8వ తేదీలోపు వేస్తామని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి హరిబాబు, ఉపాధ్యాయులు టి.అప్పారావు, జి.లక్ష్మీనారాయణ, ఆర్.కరుణాకరరావు,ఎన్.వి.నాగేశ్వరరావు, పి.రాజ్‌కుమార్, ఎస్.కస్తూరిరావు, వైద్య సిబ్బంది ఎన్.శ్రీనివాసరావు, వి.జ్యోతి లక్ష్మి, వి.కుమార స్వామి, యు.రాంబాబు, ఎన్.రాధాదేవి పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిద్ధులగూడెం మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాల, ఎంబీఎస్ మునిసిపల్ పాఠశాల, వీంద్ర భారతి పాఠశాలల్లోని విద్యార్థులకు వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి కె.వి.నర్శింహం, ఉపాధ్యక్షుడు కె.వి.ఆర్.కె.మోహన్, పీఆర్‌వో చొలస రాంప్రసాద్, కోశాధికారి డాక్టర్ కె.జయభరత్‌రెడ్డి, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. వ్యాక్సిన్లు వేయించుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు లయన్స్ క్లబ్ విద్యార్థులు స్నాక్స్ అందించారు.

జగన్ భాష తీరును మార్చుకోవాలి

ప్రభుత్వ విప్ అంగర రామ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు అర్బన్ :నంద్యాల ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తన భాష తీరును మార్చుకోవాలని, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వ విప్ అంగర రామ్మోహన్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఏఎంసీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షతన శుక్రవారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో అంగర ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు తిరిగి టీడీపీనే గెలిపిస్తారన్న భయంతోనే జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. మునిసిపల్ ఛైర్మన్ వల్లభు నారాయణ మూర్తి మాట్లాడుతూ వచ్చేనెలలో నిర్వహించనున్న ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కల్లుగీత సహకార అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మేడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వృత్తుల పరంగా బీసీల అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్ కర్నేని రోజారమణి, జడ్పీటీసీ బోణం నాని, నాయకులు బోణం నరసింహారావు, జీవీ, పెచ్చెట్టి బాబు, తమ్మినీడి సత్యనారాయణరావు, కోడి విజయ భాస్కర్, దేవరపు దొరబాబు, దాసరి రత్నరాజు, ధనాని ప్రకాశ్, అంగర చిన్న, శ్రీఖాకొల్లు సర్వేశ్వరరావు, దిడ్ల రామాంజనేయులు, పసుపులేటి ప్రభుదాసు, పెన్మెత్స రామభద్ర రాజు, కె.వి.సీతారామ్ పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గుణ్ణం

'అందరికీ అందుబాటులో ఉంటా'

పాలకొల్లు అర్బన్ : నియోజకవర్గంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటాననిజ వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ గుణ్ణం నాగబాబు అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయాన్ని లాకు దిగువ, రామారావుపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండేందుకే తాను ప్రత్యేక కార్యాలయంను ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ కార్యకర్తలు ఎవరైనా తనను కలుసుకోవడానికి వచ్చి సమస్యలు, సమాచారం తెలియజేయవచ్చని ప్రతీ రోజూ కార్యాలయంలో నిర్ణీత సమయాల్లో తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో గుణ్ణం సర్వారావు, పొత్తూరి బుచ్చిరాజు, చందక సత్తిబాబు, వి.ప్రభాకర్, కర్రి జోగయ్య, పి.వీరాస్వామి, గంగాధరం, ప్రసాదరాజు, స్టాలిన్, బి.నాగరాజు, ఎం.నర్శింహరావు, వీరా శ్రీను, మద్దా చంద్రకళ, గంథం సత్యకీర్తి, వలవల ధర్మారావు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు

పాలకొల్లు అర్బన్ : ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా యడ్లబజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయార్చకులు కొత్తలంక యర్రయ్య శర్మ, ఎం.వెంకట రమణ ఈ పూజలు జరిపారు. భక్తుల ఆర్థిక సాయంతో సుమారు 1200 మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.రమణమ్మ, సిబ్బంది సి.హెచ్.రాంబాబు, అన్నవరం పాల్గొన్నారు. పట్టణంలోని బంగారు వారి చెరువుగట్టున ఉన్న శ్రీమావుళ్లమ్మ ఆలయంలోనూ, అచ్చుగట్లపాలెంలోని శ్రీముఖదారమ్మ ఆలయంలోనూ, షావుకారు పేటలోని మావుళ్లమ్మ ఆలయంలోనూ, మహిళలు పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

పాలకొల్లు అర్బన్ : సత్యసాయి ఆదిత్య యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు గురువు వీరా స్వామిజీ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5నుంచి 7గంటల వరకు, సాయంత్రం 6నుంచి 8గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు ఉదయం, సాయంత్రం వేళల్లో హాజరు కావచ్చునని తెలిపారు. అందరికీ ఆరోగ్యం - ఆనందం - మానసిక ప్రశాంతత అందించాలనే సంకల్పంతో భగవాన్ సత్యసాయిబాబా ఆశీస్సులతో ఈ ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, వివరాలకు (94414 64153)సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఏబీసీ బ్రాహ్మణ పింఛన్ల పథకం ప్రారంభం

పాలకొల్లు అర్బన్ : పేద బ్రాహ్మణులు, వృద్ధులు, వింతంతువులు, దివ్యాంగులకు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పింఛన్లు అందించడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని నియోజకవర్గ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ నిట్టల శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీసీ (ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్)బ్రాహ్మణ పింఛన్ల పథకాన్ని సీఎం చంద్రబాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య, ఎండీ మువ్వా పద్మ ప్రారంభించారని తెలిపారు. దరఖాస్తు దారులకు 2017 జూలై 31నాటికి 60ఏళ్లు నిండి ఉండాలని, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, వితంతువులకు భర్త మరణ ధృవపత్రం, దివ్యాంగులు గుర్తింపు ధ్రువపత్రం, ఆధార్ కార్డులతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని శైలజ విజ్ఞప్తి చేశారు. వివరాలకు (9676358685)నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



అమ్మవారి సన్నిధిలో అంగర రామ్మోహన్

దేశాలమ్మకు ప్రభుత్వ విప్ అంగర పూజలు

పాలకొల్లు అర్బన్ : లాకు దిగువన ఉన్న దేశాలమ్మ ఆలయంలో ప్రభుత్వ విప్ అంగర రామ్మోహన్, కృష్ణవేణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆఖరి శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఇంకా పట్టణ ప్రముఖులు వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ గుణ్ణం నాగబాబు, బీజేపీ పట్టణాధ్యక్షుడు శిడగం పాపారావు, టీడీపీ నాయకులు అడబాల వెంకట రమణ, మజ్జి శంకరం, శిడగం బంగారయ్య, యాండ్ర నాగతారక సత్యనారాయణ, మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు.



నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

తీరని దాహం..

మంచినీటి పథకం పూర్తయినా నీళ్ల పంపిణీలో తప్పని జాప్యం

దారపురెడ్డివారి వీధి వాసుల గగ్గోలు

యలమంచిలి : కట్టుపాలెంలోని దారపురెడ్డివారి వీధిలో లక్షల రూపాయలు వెచ్చించి రక్షిత మంచినీటి పథకం నిర్మించి ఏడాది గడిచింది. అయినప్పటికీ నీళ్ల పంపిణీలో అధికారులు జాప్యం వహిస్తున్నారు. 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని' అన్న చందాన రక్షిత మంచినీటి పథకం నిర్మించి ప్రజలకు ఉపయోగపడనప్పుడు ఎందుకు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కట్టుపాలెంలో ఒక రక్షిత మంచినీటి పథకం ఆ గ్రామ వాసులకు సరిపోవడం లేదని రెండోది నిర్మించినప్పటికీ నేటికీ ప్రారంభించకపోవడంలో ఆంతర్యమేమిటని గగ్గోలు చెందుతున్నారు. వేసవి కాలం పూర్తయింది. వర్షాకాలంలోనైనా రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగేందుకు నీళ్లు అందుతాయని ఆశిస్తున్నామని పలువురు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి మంచినీటి పథకాన్ని ప్రారంభించి తాగేందుకు రెండు పూటలా నీరు అందించాలని దారపురెడ్డివారి వీధి మహిళలు కోరుతున్నారు.

త్వరగా సురక్షిత తాగునీరు అందించాలి



ప్రజలకు తాగేందుకు సురక్షిత మంచినీరు అందించాలన్న ఉద్దేశ్యంతో లక్షలు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు త్వరగా అందించాలి. 10 కిలోమీటర్లు దూరం వెళ్లి టిన్నుల నీరు కొనుగోలు చేసి అవస్థలు పడుతున్నాం.

- దారపురెడ్డి శ్రీరామచంద్రమూర్తి, కట్టుపాలెం

పైపులైన్లకు మరమ్మతులు చేయించాలి



రక్షిత మంచినీటి పథకాన్ని ఇంకా ప్రారంభించకపోవడంతో ఆ వీధి వాసులకు తాగేందుకు నీళ్ల కొరత ఏర్పడింది. పైపులైన్లు బద్దలవ్వడం వల్ల నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. సత్వరమే మరమ్మతులు చేయించి తాగునీరు అందిస్తాం.

- బుంగా వెంకట్రావు, సర్పంచ్, కట్టుపాలెం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నరసాపురం ఎమ్మెల్యే మాధవనాయుడు

మొగల్తూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలోను మూడేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులు, పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలకు సంబంధించి మంజూరు చేసిన పథకాలను ప్రతీ కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెలాఖరుకు పార్టీ శిక్షణను పూర్తి చేసుకోవాలని, వచ్చేనెల 3వ తేదీ నుంచి 60 రోజుల పాటు నిర్వహించే ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశానికి పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో నాయకులు బళ్ళ శ్రీను, ఎంపీపీ కత్తిమండ ముత్యాలరావు, జడ్పీటీసీ గుబ్బల నాగరాజు, యువత అధ్యక్షుడు నాగిడి రాంబాబు, యాతం పాండురంగారావు, డొల్లా రత్నంరాజు ఉప సర్పంచ్ కుమార్ బాబు, పంపన శ్రీకృష్ణ భగవాన్, పాలా రాంబాబు, పులపర్తి నానాజీ, ఇందుకూరి శ్రీనివాసరాజు, తోటకూర శివాజీ రాజు, గుండు రాజా, తోట సుబ్బారావు, సత్తినేని త్రినాథ్, తదితరులు మాట్లాడారు.

తూర్పుతాళ్ళులో గర్భిణులకు సీమంతాలు

నరసాపురం రూరల్ : తూర్పుతాళ్ళు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మెగా అభిమానులు పలువురు మహిళలకు సీమంతాలు చేశారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదిమంది మహిళలకు చీర, జాకెట్, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు అందించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. సర్పంచ్ చామకురి సుబ్బలక్ష్మి, రామ్మోహన్‌రావు, మెగా అభిమానులు కోపల్లి శ్రీనివాస్, చామకూరి మురళి, పులపర్తి ప్రతాప్, బళ్ల హనుమంతు, చెన్నంశెట్టి నాగు, దివి సత్యన్, సుబ్బారావు, యాదంరెడ్డి సుబ్బారావు, కొండేటి నాగశ్రీను, రవికుమార్, బోయిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఇంటర్వ్యూలకు 96 మంది హాజరు

మొగల్తూరు : పేరుపాలెం ఆంధ్రాబ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యరులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఈ పథకంలో ఓసీ 46, ఎస్సీ 18, బీసీ 16 మందికి రుణాలందించాల్సి ఉండగా 96 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు.

పింఛన్ల రగడ

రసాభాసగా మండల పరిషత్ సమావేశం

జన్మభూమి కమిటీల పెత్తనంపై వాగ్వాదం

థామస్‌బ్రిడ్జి (నరసాపురం అర్బన్) : ఇటీవల కొత్తగా మంజూరైన పింఛన్ల ఎంపికపై మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సహా పలువురు గట్టిగా నిలదీశారు. శుక్రవారం ఎంపీపీ వాతాడి కనకరాజు అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో వేములదీవి పడమర ఎంపీటీసీ మైల వసంతరావు, సర్పంచ్ మందా నాగేశ్వరరావు, తూర్పుతాళ్లు ఎంపీటీసీ బొక్కా రాధాకృష్ణ ఇటీవల మంజూరు చేసిన పింఛన్లు అధికార పార్టీకి అనుకూలమైన వారికే మంజూరు చేసిందని ఆరోపించారు. వేములదీవి పంచాయతీ పరిధిలో 34 పింఛన్లు తొలుత ఆమోదించి అనంతరం ఎంపీటీసీ, సర్పంచ్‌లకు తెలియకుడా జన్మభూమి కమిటీ ప్రమేయంతో తొమ్మిది మందిని తొలగించడంపై మండిపడ్డారు. దీనికి ఎంపీపీ సమాధానమిస్తూ తొమ్మిది పింఛన్లు ఈనెల ఇచ్చే అవకాశం ఉన్నందున అందులో పేర్లు పెడదామనే తప్ప ఎవరికీ చెప్పకూడదని కాదన్నారు. సీతారాంపురం సౌత్ సర్పంచ్ అడబాల అయ్యపనాయుడు మాట్లాడుతూ సర్పంచ్, ఎంపీటీసీలతో కలిసి ఖరారు చేసిన జాబితా నుంచి పేర్లు తొలగించే సమయంలో వారికి సమాచారం ఇవ్వాలన్నారు. తూర్పుతాళ్ల ఎంపీటీసీ బొక్కా రాధాకృష్ణ మాట్లాడుతూ కేవలం అధికార పార్టీ వారికి పింఛన్లు మంజూరు చేశారని ఆరోపించారు. దీంతో సభ కొద్దిసేపు రసాభాసగా మారింది. ఎంపీడీవో కె.కన్నమనాయుడు మాట్లాడుతూ తమకు ఎవరైనా అనర్హులు ఉంటే తొలగించేందుకు, ఎవరైనా అర్హులకు అందకపోతే వారిని చేర్చేందుకు అధికారం ఉందని తెలిపారు. కొద్దిసేపటి తరువాత సభ సద్దుమణిగింది. హౌసింగ్ ఏఈ ఎండీ గౌస్‌భాషా మాట్లాడుతూ ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో మండలంలో మంజూరైన 667 ఇళ్లు ప్రారం భం అయ్యాయని వీటిలో 240 స్లాబులు పూర్తయ్యాయని తెలిపారు. ఎంఈవో పుష్పరాజ్యం, పాఠశాలల్లో క్రీడాస్థలాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యురాలు ఉమామహేశ్వరి మాట్లాడారు. సమావేశానికి ఎంపీటీసీలు కడలి వెంకటలక్ష్మి, చెల్లబోయిన కనకదుర్గ, మాండ్రు హేమలత, డీవీఆర్, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ, ఎంపీడీవోలను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు



కాంబొట్లపాలెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వామినాయుడు

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్థల పరిశీలన

యలమంచిలి : కాంబొట్లపాలెంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కేటాయించిన స్థలాన్ని తహసీల్దార్ వి. స్వామినాయుడు పరిశీలించారు. శుక్రవారం గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ గెద్దాడ లక్ష్మీపార్వతితో కలసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ స్థలానికి ఒక వైపు గడ్డిమేటును, మరొక వైపు పాకను తొలగించాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట పద్మజ, మెంబరు మొల్లేటి భవాని, జన్మభూమి కమిటీ వాసంశెట్టి కేశవరావు, అనిశెట్టి మహిమవాణి, అనిశెట్టి ప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి డి. శ్రీనివాస్, కుక్కల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



గుంపర్రు రామాలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

గుంపర్రు రామాలయంలో వరలక్ష్మి వ్రతాలు

యలమంచిలి : గుంపర్రు గ్రామంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా రామాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. అర్చకుడు ఖండవల్లి సీతారామభార్గవ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మాట్లాడుతూ వరలక్ష్మి వ్రతం చేయడం వల్ల సకల ఐశ్వర్యాలు కలుగుతాయని తెలిపారు. ప్రతీ ఏడాది భక్తుల సహకారంతో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి గుబ్బల రాము, పెద్దింట్లు, జడ్డు బదరి, సత్తినీడి సీతారామ్, రామానుజాచార్యులు, పులసి సతీష్, ధనరాజు, మహిళా భక్తులు జడ్డు రాజేశ్వరి, రాధాకృష్ణ, వేణి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

నేటి నుంచి సోపానం ఇంటర్వ్యూలు

బుట్టాయగూడెం: 2017-2018లో స్వయం ఉపాధి సోపానం యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకుల వారీగా ఈ నెల 19, 22, 24, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎస్వీఎస్ ప్రసాద్ తెలిపారు. విజయ బ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకున్నవారికి 19న, కన్నాపురం ఆంధ్రాబ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారికి 22న, రెడ్డిగణపవరం ఎస్‌బీఐ, బుట్టాయగూడెం ఎస్‌బీహెచ్ పరిధిలో దరఖాస్తు చేసుకున్నవారికి 24న, బుట్టాయగూడెం డీసీసీబీ బ్యాంకు పరిధిలోని అభ్యర్థులకు ఈ నెల 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు తప్పక హాజరు కావాలన్నారు.

ప్రజాసేవ



పంచాయతీ అభివృద్ధికి కృషి

మడకం లక్ష్మడు, సర్పంచ్ రాచన్నగూడెం.

"గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశాం. రాచన్నగూడెం-తాటిరాముడుగూడెం గ్రామాల మధ్య బీటీ రోడ్డును రూ.కోటి రూపాయల నిధులతో నిర్మించేలా చర్యలు తీసుకున్నాం. తాటిరాముడుగూడెంలో పాడైన పాఠశాల భవనానికి మర మ్మతులు చేయడానికి రూ.7లక్షల నిధులు మంజూరు చేయించాం. గ్రామంలో రూ.45లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మించాం.ఆరోగ్య ఉపకేంద్రాన్ని రూ.12లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించాం."

● జీలుగుమిల్లి

ఎంపీడీవోగా అన్నపాలిన బాధ్యతలు స్వీకరణ

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి ఎంపీడీవోగా వి.అన్నపాలిన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో నిర్మలదేవి పదవీ విరమణ చేశారు. కొన్ని నెలలుగా ఈవోపీఆర్డీ కొండలరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందని, మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సంక్షేమ పథకాలు ప్రజలకందేలా తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

గ్రామసభలు నిర్వహణ

జీలుగుమిల్లి: టి.గంగన్నగూడెం, దర్భగూడెం పంచాయతీల్లో శుక్రవారం ప్రజా సాధికార సర్వే నిర్వహణలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగాతహసీల్దార్ ఎం.రాజశేఖరావు మాట్లాడుతూ ఇటీవల ప్రజా సాధికార సర్వేలో సొంత ఇల్లు లేని వారిని గుర్తించామని, ప్రస్తుతం వారి వాస్తవ పరిస్థితిని గుర్తించేందుకు గ్రామసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలో 12 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉందని ఆయన తెలిపారు.

సినిమా గైడ్

పోలవరం :

గంగాభవాని	శమంతకమణి

కొయ్యలగూడెం :

మహాలక్ష్మి	డీజే
రామదుర్గ	మన్యం సూర్యుడు

ప్రజల ప్రాణాలతో చెలగాటం



కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడులో రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

● చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు
● ఆందోళన చెందుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు

కొయ్యలగూడెం : దిప్పకాయలపాడు గ్రామంలోని కో-ఆపరేటివ్ సోసైటీ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వలన ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చిన్న పిల్లలకు అందేలా కిందకు ఉన్నాయి. ట్రాన్స్‌పార్మర్ల పక్క నుంచే రహదారి గుండా చిన్నారులు పాఠశాలకు వెళుతుంటారు. కేవలం చెయ్యి ఎత్తులోనే ట్రాన్స్‌పార్మర్లు ఉన్నాయి. ఇటీవల సీసీ రోడ్డు వేయడంతో ఎత్తు మరింత తగ్గి చిన్న పిల్లలకు సైతం ట్రాన్స్‌ఫార్మర్లు అందేలా ఉన్నాయి. చిన్నపిల్లలు చెయ్యి పెడితే ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌పార్మర్లను పిల్లలకు అందనంత ఎత్తులో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుల్లత

జీలుగుమిల్లి: ములగలంపల్లి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయక తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు. రౌతుగూడెం, కనకాపురం గ్రామాల సమీపంలో 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లు ఒకే చోట ఉండటం, వ్యవసాయ బోర్లకు వెళ్లే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రహదారి పక్కనే ఉండటంతో తరచు మంటలు వస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధి కారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



జీలుగుమిల్లి మండలం కనకాపురం వద్ద విద్యుత్ లైన్లకు అల్లుకుపోయిన పాదు

ఎంపీలకు ఘన స్వాగతం

పోలవరం : పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్దకు వచ్చిన తమిళనాడు ఎంపీ వి.సత్యభామ , ఏలూరు ఎంపీ మాగంటి బాబులకు పోలవరం జడ్పీటీసీ పుణ్యం సుభాషిణి స్వాగతం పలికారు. అందరి కంటే ముందుగా ఏలూరు ఎంపీ మాగంటి బాబు, సత్యభామతో కలిసి పట్టిసీమ చేరుకున్నారు. అక్కడి నుంచి పోలవరం ప్రాజెక్టు ప్రాంతం వద్దకు వెళ్లి ఇంజనీరింగ్ అధికారులతో ముచ్చటించారు. వారి వెంట జడ్పీ వైస్ చైర్మన్ చింతల వెంకటరమణ, బోరగం శ్రీనివాస్, కుంచె దొరబాబు, నల్లా రాంబాబు, తదితరులు ఉన్నారు.



తమిళనాడు ఎంపీ సత్యభామకు స్వాగతం పలుకుతున్న జడ్పీటీసీ సుభాషిణి

'అభివృద్ధి నిరోధకులెవరో ప్రజలు గమనిస్తున్నారు'

టి.నర్సాపురం : అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలు గమనిస్తున్నారని తిరుమలదేవిపేట పంచాయతీ సర్పంచ్ ఎల్లిన లక్ష్మి అన్నారు. తిరుమలదేవిపేటలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాధనాల నరసింహరావు నివాసం వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ నాయకులు తమను నిరోధకులు అనడం సరికాదని, పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామంలో సీసీ రోడ్లు ఎలా వేశారని ప్రశ్నించారు. ఏప్రిల్ 13వ తేదీన పంచాయతీ భవన నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వడానికి వచ్చిన ఏఈని అడ్డుకున్నది ఎవరని, పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించినప్పుడు అడ్డుకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. అభివృద్ధి నిరోదకులు మేమా, మీరా అని అన్నారు. పంచాయతీ అభివృద్ధిని చూసి ఓర్వలేక మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు పంచాయతీ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేశామని అన్నారు. మండలంలోని 15 పంచాయతీల్లో తిరుమలదేవిపేట పంచాయతీ కంటే ఎక్కువ అభివృద్ధి జరిగిన పంచాయతీ ఏదైనా ఉంటే చూపించాలన్నారు. మహిళా సర్పంచ్‌లను చిన్నచూపు చూడటం వారికి తగదన్నారు. స్థానికంగా నిర్వహించే సంక్షేమ పనుల విషయంలో సర్పంచ్లుకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రతీసారి ప్రోటోకాల్ ఉల్లంఘించడం తగదన్నారు. కార్యక్రమంలో ఎల్లిన వెంకటరత్నం, ఉప్పల సత్యనారాయణ, నెల్లూరి వెంకటరామారావు, వై. రాఘవేంద్రరావు, కె.ప్రేమానందం, రెబ్బా గోవర్ధనరావు, శ్రీను,దాసరి నాగు, కాసగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఎల్లిన లక్ష్మి

గిరిజనులకు పండ్ల మొక్కలు పంపిణీ

బుట్టాయగూడెం: వెంకట్రామన్నగూడెం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీలోని పులిరాముడుగూడెం, రవ్వారిగూడెం, ఇటికలకుంట పీఆర్ గూడెం గ్రామాల్లోని 280 గిరిజన కుటుంబాలకు సపోట, నిమ్మ, పనస, మామిడి మొక్కలను వైస్ ఎంపీపీ సున్నం నాగేశ్వరావు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకుని ఇచ్చిన ప్రతీ మొక్కను పెంచాలని సూచించారు. మొక్కలను పెంచడం ఆరోగ్యానికి కూడా మంచిదన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ ఏఈవో ఎస్.మల్లుదొర, వనసేవక్ ఎన్.యోహాను, వీఎస్ఎస్ ప్రెసిడెంట్ తామా నాగేశ్వరావు, ఫీల్డ్ అసిస్టెంట్ మడకం శిరమయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు

ఎంపీడీవోగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం ఎంపీడీవోగా ఎస్వీఎస్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల సమయంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వెంకటలక్ష్మి ఏలూరు ఎంపీడీవోగా బదిలీ కావడంతో ఇప్పటివరకు ఎవరిని నియమించలేదు. సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉండ్రాజవరం ఈవోపీఆర్‌డీగా పని చేస్తున్న ప్రసాద్ పదోన్నతిపై బుట్టాయగూడెం వచ్చారు. ఆయన కొంతకాలం కొవ్వూరు డీఎల్‌పీవోగా కూడా పని చేశారు. సూపరెంటెండెంట్, ఈవోపీఆర్‌డీ జ్యోతి, ఏపీవో నాగరాజు, సిబ్బంది, కార్యదర్శులు ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో ఈ నెల 20వ తేదిన ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పి.సాయికృష్ణ తెలిపారు. బుట్టాయగూడెంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వారికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. ఏజెన్సీలోని కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీలను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

బుట్టాయగూడెం : ఆదివాసీలను వేధిస్తున్న ఎఫ్‌ఆర్‌వో కె.శ్రీనివాసరావు, డీఎఫ్‌వో ఎన్.నాగేశ్వరావు, ఎస్‌వీకే కుమార్‌లపై చర్యలు తీసుకోవా లని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మొడియం శ్రీనివాసరావు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ముగ్గురి పైన స్థానిక స్టేషన్‌లో కేసు నమోదయిందని, బాధితులను, సాక్షులను వారు బెదిరిస్తున్నారని, కేసు నమోదయినందున తక్షణమే వారిని అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం స్వయం ఉపాధి రుణాల మంజూరు కోసం లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముందుగా లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ తీసుకున్నారు. అనంతరం ఎంపీపీ బి.మణికుమారి, ఎంపీడీవో వి.అన్నపాలిన, విజయ బ్యాంక్ మేనేజర్ అబ్రహం హెండ్రీ, జన్మభూమి కమిటీ సభ్యులు గారపాటి శ్రీను, కొట్టే నాగేశ్వరావు సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ మైనార్టీ కాపు కార్పొరేషన్లకు సంబంధించి జీలుగుమిల్లి విజయ బ్యాంక్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఎంపిక చేశారు. రోజంతా ఎంపీడీవో కార్యాలయం వద్దే లబ్ధిదారులు వేచి ఉండాల్సి వచ్చింది. పలువురు మహిళలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి ఏడు గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.



ప్రజా సేవ



పారిశుధ్యం మెరుగుపరుస్తాం

సూర్యారావు, సర్పంచ్, మంచిలి

గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాం. గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణాలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. త్వరలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచి ముంపు సమస్య లేకుండా చేస్తాం. ఇప్పటి వరకు రూ. 50 లక్షలు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామంలో ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డు నిర్మించుకునేలా చర్యలు చేపడుతున్నాం. బహిరంగ మల విసర్జనపై విస్తృత ప్రచారం చేసి అదుపు చేశాం. త్వరలోనే పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం. ● అత్తిలి

గ్యాస్ సమాచారం

■ సుబ్బారావు అండ్ కో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 11 తేదీన గ్యాస్ నమోదు చేసుకున్న వారికి ఈ నెల 18న డెలివరీ ఇస్తారు.. ఫోన్: 222144, 222534
■ దుర్గా ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 12,13 తేదీల్లో బుక్ చేసిన వారికి ఈ నెల 18న డెలివరీ ఇస్తారు. ఫోన్ : 224330
■ సందీప్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 12,13 తేదీల్లో గ్యాస్ నమోదు చేసు కున్న వారికి ఈ నెల 18న డెలివరీ ఇస్తారు. ఫోన్ : 229776. - తణుకు

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

తణుకు	:	9985411556
తణుకు టౌన్	:	9652889592
తణుకు అర్బన్	:	9966228918
అత్తిలి	:	9848964821
ఇరగవరం	:	9652889592

సినిమా గైడ్

తణుకు :

లక్ష్మి	జయ జానకి నాయక
మినీ లక్ష్మి	లై
నరేంద్ర	మరకతమణి
మినీ నరేంద్ర	నేనే రాజు..నేనే మంత్రి
శ్రీచిత్ర	గౌతమ్ నంద
వెంకటేశ్వర	జయ జానకి నాయక
ప్రత్యూష	దర్శకుడు
ప్రత్యూష మినీ	ఫిదా
అత్తిలి :	
వెంకట్రామ	శమంతకమణి
కనకదుర్గ	నిన్ను కోరి

వద్దన్నా.. వినరే!!

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలంటేనే మోజు
పర్యావరణానికి పెను ప్రమాదం



తణుకు : వినాయక చవితి వచ్చిందంటే గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతీ గల్లీలోనూ ప్రతిష్ఠించి పూజలు చేస్తుం టారు. పర్యావరణం దృష్టిలో ఉంచుకుని ఏ ఒక్కరూ కూడా మట్టి విగ్రహాలు పెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. పర్యావరణానికి హాని కల్పించే విగ్రహాలు తయారు చేయవద్దని పర్యావరణ ప్రేమికుల హెచ్చరికలు కూడా పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రతీ చోట ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నెలకొల్పుతున్నారు. అయినా ఎవరికి వారే ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

రసాయనాలతో కలుషితం

వినాయక చవితి ఉత్సవాలు ముగిసిన తరువాత ఆయా విగ్రహాలను సమీపంలో ఉన్న కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేయాల్సిందే. అపుడు వాతావరణం,గాలి, కాలుష్యాలకు మనమే కారకులవుతున్నాం. రసాయనాలతో చేసిన విగ్రహాల వల్ల విషపూ రితమవుతోంది. ఫలితంగా వాతావరణం కూడా కలుషితమవుతోంది. ఆయా విగ్రహాలు నీటిలోనూ తొందరగా కరిగే పరిస్థితి ఉండదు. ఇన్ని అనర్థాలు జరుగుతున్నా కూడా ఇప్పటికీ మట్టి విగ్రహాలు కాకుండా రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకే చాలా మంది మొగ్గుచూపుతున్నారు.

కానరాని మట్టి విగ్రహాలు...

మట్టి విగ్రహాల తయారీ కనుచూపు మేరలో కనిపించని పరిస్థితి కొనసా గుతోంది. పర్యావరణ కాలుష్యం దృష్ట్యా మట్టి గణపతే మహాగణపతి అంటూ అవగాహన కల్పిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఎందుకంటే భారీగా మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలంటే లక్షలు ఖర్చు పెట్టాల్సిందే.. దీంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలనే చూస్తున్నారు. కొన్ని చోట్ల గ్రామాల్లో చిన్నారులు, యువకులు చేపట్టే పందిళ్ల వద్ద మాత్రమే అరకొరగా మట్టి విగ్రహాలు కనిపించనున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసి ప్రతిమలు నీటిలో కలవవు.. అదే మట్టి విగ్రహాలైతే నీటిలో కలిసిపోతాయి. అందుకే మట్టితో తయారు చేసే విగ్ర హాలు, ప్రతిమలను వాడడం శ్రేయస్కరమని పర్యావరణవేత్తల అభిప్రాయం.

పనులు నాణ్యతగా ఉండాలి

మునిసిపల్ చైర్మన్ పరిమి వెంకన్న బాబు

తణుకు: ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మునిసిపల్ చైర్మన్ పరిమి వెంకన్న బాబు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని వేల్పూరు రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు పనుల ప్రగతిపై వివరించాలని అధికారులను ఆదేశించారు.ప్రత్యూష కాంప్లెక్స్ వద్ద జరుగుతున్న విస్తరణ, డ్రెయిన్ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, కౌన్సిలర్ కలగర వెంకట కృష్ణ, కమిషనర్ జి.సాంబశివరావు, సౌరపల్లి శ్రీనివాస్, ఏఈ ఈశ్వరరెడ్డి, డీఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ వెంకన్న బాబు

'విపక్షాల విమర్శలను తిప్పికొట్టండి'

తణుకు : రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై విపక్షా లు చేస్తున్న విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల టీడీపీ నాయకత్వ శిక్షణ కేంద్రం డైరెక్టర్ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. తణుకు మండలం తేతలిలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోగా కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరందించేందుకు పట్టిసీమ నిర్మించారన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ఎలా తిప్పికొట్టాలో వివరించారు. ఈ కార్యక్రమాన్ని కో ఆర్డినేటర్ భరత్ పర్యవేక్షించారు.



శిక్షణ తరగతులకు హాజరైన నాయకులు, శిక్షణ ఇస్తున్న వెంకట రాజు



తణుకులో నినాదాలు చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

3వ రోజుకు పోస్టల్ ఉద్యోగుల సమ్మె

తణుకు : న్యాయమైన కోర్కెలపై స్పష్టమైన హామీ వచ్చే వరకూ సమ్మె విరమించేది లేదని తపాల ఉద్యోగులు స్పష్టం చేశారు.ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ తపాలా శాఖ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె శుక్రవారం మూడవ రోజుకు చేరుకున్నది. దీనిలో భాగంగా తణుకు శాఖ అధ్యక్షుడు మండెల సత్యనారాయణ మాట్లాడుతూ జీడీఎస్ రిపోర్టు అమలుకై యూనియన్లకతీతంగా ఆత్మగౌరవంతో పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.తక్షణమే కమిటీ రిపోర్టు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి పీవీ ప్రతాప్ మద్దతు తెలిపారు.సమ్మెలో బ్రాంచి సెక్రటరీ డి. బ్రెన్ హాయ్,డి.రామన్న, ఎండీ షాకేరు,ఎస్‌పీ కామేశ్వరి, సువర్ణరాజు పాల్గొన్నారు.

తణుకులో పుట్టపర్తి సాయి రథం

తణుకు : పూరీ జగన్నాథ్, పర్తి జగన్నాథ్ యాత్రలో భాగంగా పుట్టపర్తి సాయిబాబా రథం శుక్రవారం తణుకు చేరుకున్నది.ఈ నెల 14న పూరీ జగన్నాథ్ నుంచి బయలుదేరిన సత్యసాయి రథం శుక్రవారం తణుకులో ప్రత్యక్షమైంది. తణుకు ఏరియా ఆసుపత్రిలో ఉన్న సత్యసాయి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సేవా సమితి మహిళలు స్వామికి హారతులిచ్చారు.రథం ఈ నెల 25న పుట్టపర్తి చేరుకుంటుందని సభ్యులు తెలిపారు.



మంత్రిపై కేసు నమోదు చేయాలి

తణుకు అర్బన్ : దళితులు, జర్నలిస్టుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణ రెడ్డిపై తక్షణమే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం చంద్రరావు అన్నారు. ఎమ్మార్పీఎస్, ఏపీ చర్మకారుల సంక్షేమ సంఘం, రెల్లి కుల సంక్షేమ సంఘం, బేడ బుడ్గా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ చేశారు. దీనిలో భాగంగా వెంకటేశ్వర థియేటర్ వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చర్మకారుల సంక్షేమ సంఘం కన్వీనర్ వేళంగి శ్యామ్ మాట్లాడుతూ మంత్రి పదవి వెంటనే తొలగించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎ.దుర్గారావు, కాకి శంకర్, బంగారు వెంకట రమణ,పెద్దనాగులు,బ్రహ్మయ్య, దుర్గారావు, పాల్గొన్నారు.

నేటి నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

తణుకు అర్బన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ వర్గాల అభ్యర్థులకు ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు మునిసిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ సాంబశివరావు పేర్కొన్నారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2017-18 సంవత్సరానికి రుణ మంజూరుకు ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తు,రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులు స్వయంగా తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.ఎంపికైన అభ్యర్థులకు వెంటనే రుణాలందిస్తామన్నారు.రుణాలను సద్వినియోగం చేసుకుని యువత ముందుకు సాగాలన్నారు.

2016 మందికి ఎంఆర్ టీకా

తణుకు అర్బన్: ఎంఆర్ టీకాలను పట్టణ పరిధిలోని మొత్తం 2016 మంది చిన్నారులకు వేశామని పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పలు స్కూళ్లలో విద్యార్థులకు శుక్రవారం ఎంఆర్‌టీకా వేశారు. వివేకానంద గ్లోబల్, అమృత వాణి , రవీంద్రభారతి, షిర్డీ సాయి, గౌతమి, ఆదర్శ, స్ప్రింగ్ బోర్డు స్కూలులో టీకాలు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ

తణుకు: సేవ చేయాలనే ఆలోచన ఉంటే ఏరూపంలో అయినా చేయవచ్చునని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఖాన్‌రాజు అన్నారు. ఆసుపత్రిలో పని చేసే పారిశుధ్య కార్మికులకు, చిన్న పిల్లలకు శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సంపాదన ధ్యేయంగా కాకుండా సమాజ శ్రేయస్సుకు ఎంతో కొంత వెచ్చించాలన్నారు.పేదలను ఆదుకోవడం ప్రతీ ఒక్కరూ అలవరుచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణ, వేల్పూరు సర్పంచ్ పెనుమర్తి వెంకటలక్ష్మి, ఆర్ఎంవో శ్రీనివాసరావు, సిబ్బంది జయప్రద తదితరులు పాల్గొన్నారు.

బల్లిపాడులో ఎస్ఐ పల్లెనిద్ర

అత్తిలి : గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలు సుఖసంతోషాలతో గడపాలని అత్తిలి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడలో శుక్రవారం పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో పలు అంశాలపై చర్చించారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనానరు. కొత్త వ్యక్తుల సంచారంపై కూడా నిఘా ఉంచాలన్నారు. సెలవులకు గ్రామాంతరం వెళ్లే వారు విలువైన వస్తువులను భద్రం చేసుకోవాలన్నారు. వీధి దీపాల్లేని ప్రాంతాల్లో రాత్రి వేళ్లలో వెలిగేలా చూసుకోవాలన్నారు.యువత సక్రమమైన మార్గంలో ఉండాలని సూచించారు.

ఆలయ దర్శిని

- **కపర్ధీశ్వర స్వామి ఆలయం :** మునిసిపల్ కార్యాలయం పక్కన ఉంది. ప్రతీ సోమవారం శివపార్వతులకు అభిషేకాలు, పూజలు చేస్తారు.
- **కేశవస్వామి దేవస్థానం :** శ్రీ మహాలక్ష్మి సమేత కేశవ స్వామికి నిత్యపూజలు జరుగుతాయి.
- **సిద్ధేశ్వర స్వామి ఆలయం :** సంత మార్కెట్ సమీపంలో శివాలయం. ప్రతీ సోమవారం అభిషేకాలు, పూజలు చేస్తారు.
- **వెంకటేశ్వర స్వామి ఆలయం :** ప్రతీ శనివారం ప్రత్యేక పూజలు , నిత్యం నిత్య పూజలు, భజనలు జరుగుతాయి.
- **శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయం :** ప్రతీ మంగళవారం ఆంజనేయ స్వామికి తమలపాకు, గంగసింధూర పూజలు, భజనలు జరుగుతాయి.
- **సూర్యదేవాలయం :** ప్రతీ ఆదివారం స్వామికి అభిషేకాలు ప్రతీ నిత్యం పూజలు జరుగుతాయి.
- **సాయిబాబా ఆలయం :** ప్రతీ గురు వారం ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం భజనలు,నిత్యపూజలు జరుగుతాయి
- **వినాయకుడి ఆలయం :** నిత్యం పూజలు ప్రతీ నెల పూర్ణిమ తదుపరి చవితికి సంకష్ట హర చతుర్ధి పూజలు, ప్రతీ సోమవారం సాయంత్రం భజనలు, జరుగుతాయి. ప్రతీ ఏకాదశి రోజున గరికపూజలు జరుగుతాయి.
- **కన్యకా పరమేశ్వరి ఆలయం :** ప్రతీ శుక్రవారం ప్రత్యేక పూజలు , ప్రతీ నిత్యం కుంకుమ పూజలు జరుగుతాయి.
- **శ్రీరామసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం :** శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీ సుబ్రహ్మ ణ్య స్వామి ఆలయంలో ప్రతీ మంగళవారం ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి.
- **ముత్యాలమ్మ ఆలయం :** నిత్య పూజలు జరుగుతాయి.ప్రతీ శుక్రవారం కుంకుమపూజలు చేస్తారు.
- **నటరాజ స్వామి ఆలయం :** ప్రతీ సోమవారం శివుడికి ప్రత్యేక అభిషేకాలు, నిత్యపూజలు జరుగుతాయి.

నంద్యాలలో మన నేతలు

అత్తిలి :నంద్యాలలో జరిగే ఉప ఎన్నికల ప్రచారం నిమిత్తం అత్తిలి నుంచి నాయకులు తరలివెళ్లారు.అత్తిలి మండల పార్టీ అధ్యక్షుడు అనాల ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు వెళ్లి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెంట ఉండి ప్రచారం చేస్తున్నారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని తెలిపారు.

ఇంకనూ.. తీరని నగదు కష్టాలు!

- 9 నెలలైనా నగదు కష్టాలే
- పనిచేయని ఏటీఎంలు
- ఖాతాదారులకు ఇబ్బందులు

ఇరగవరం : నవంబరు 8 వెళ్లిపోయి సుమారు 9 నెలలవుతోంది.. అయినా నగదు కష్టాలు ఇంకనూ తీరలేదు.. ఏటీఎంకు వెళదామంటే భయం.. భయం.. ఎందుకంటే డబ్బులుంటాయో లేదోనని.. బ్యాంకులకు వెళదామంటే.. డబ్బులిస్తారో ఇవ్వరోనని.. అనుమానం.. దీంతో ఖాతాదారులకు నగదు కష్టాలు పెరిగిపోతున్నాయి. ఖాతాల నిండా సొమ్ములున్నా జేబులోకి వచ్చే మార్గమే కనిపించడంలేదు. గతంలో ఏటీఎంకు వెళితే అనుమానమే లేదు. ఒక ఏటీఎం పనిచేయకపోయినా మరో బ్యాంకు ఏటీఎం పనిచేసేది.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఏ ఏటీఎం ఎప్పుడు పనిచేస్తుందో తెలియదు. దీనికి ఇరగవరం మండలంలోని ఏటీఎం ఉదాహరణ.. మండల కేంద్రంలో ఉన్న ఏటీఎం ప్రతీ రోజూ బయటకు అందంగా తెరచి ఉంచుతారు. కాని అందులో నగదు మాత్రం ఉండదు.దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో సుమారు 50 వేల మంది జనాభా ఉన్నారు. 21 గ్రామాలుంటే ఇరగవరం, రేలంగి, ఏలేటిపాడు, తూర్పువిప్పర్రు గ్రామాల్లో మాత్రమే బ్యాంకులున్నాయి. మిగిలిన 17 గ్రామాల్లో బ్యాంకుల ఊసేలేదు. వీటిలో మూడు చోట్ల మాత్రమే ఏటీఎంలు ఉన్నాయి. దీంతో ఎక్కువగా ఏటీఎంలపైనే ఆధారపడతారు. ప్రధానంగా మండలం కేంద్రంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ ఏటీఎంలో నగదు కొరత వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సక్రమంగా సేవలందడంలేదు. సుమారు 20 వేల మంది ఖాతాదారులకు బ్యాంక్ సేవలందిస్తుంది. వారందరూ కూడా బ్యాంక్‌లో పగలే నగదు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్ప డింది. దీంతో ఖాతాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏటీఎంలో నగదు ఉండేలా చూడాలని ఖాతాదారులు కోరుతున్నారు.

ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే..

నగదు కొరత ఉండడంతో ఏటీఎంలలో పరిమితంగా పెడుతున్నాం. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే అందరికి బ్యాంక్‌లో నగదు ఇస్తున్నాం. మెయిన్ బ్రాంచి నుంచి వచ్చిన నగదు ఇటు బ్యాంకులో ఖాతా దారులకు, అలాగే ఏటీఎంలో కూడా సరిపె ట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొన్ని రోజులుగా నగదు పెట్టలేకపో తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కరిస్తాం.

- ఉదయ శంకర్, ఎస్‌బీఐ మేనేజర్, ఇరగవరం



ఇరగవరంలో ఎస్‌బీఐ ఏటీఎం



తూర్పువిప్పర్రులో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆకేటి



బొంతువారిపాలెంలో ఎరను తయారుచేస్తున్న సిబ్బంది

ఒక్కటై.. ఎలుకలను తరిమికొడదాం

గ్రామాల్లో వ్యవసాయాధికారుల పిలుపు

ఇరగవరం: సామూహిక ఎలుకల నిర్మూలనకు రైతు లంతా సహకరించాలని జడ్పీటీసీ సభ్యుడు చుక్కా సాయి బాబు అన్నారు.ఇరగవరం మండలం కావలిపురం, యర్రాయిచెరువు,అర్జునుడుపాలెం,కెకెవల్లీ, ఆర్.ఖండ్రిగ, తూర్పు విప్పర్రు, రాపాక, ఏలేటిపాడు, పేకేరు, కాకిలేరు, కంతేరు గ్రా మాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఎలుకల మందును ప్రతీ రైతు పొలాల్లో విని యోగించాలన్నారు.ఇన్‌చార్జి ఎంపీపీ సత్తి సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలుకల మందులతో పాటు కంది విత్తనాలు ఉచితంగా అందజేస్తున్నారన్నారు.అనంతరం రైతులకు ఉచిత ఎలుకల మందు పంపిణీ చేశారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని మార్టేరు ఏడీఎ రమేష్ పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ఏవో కె. రాజేంద్ర ప్రసాద్,ఎంపీఈవోలు కె.అనిల్‌కుమార్,బి.ధనరాజ్, ఎం.సీతారాం, జి.చినబాబు,జె.స్వప్న, ఏఈవోలు ఎన్. రాంబాబు, వై.ఫణికాస్యపస్, సర్పంచ్‌లు ఆకేటి నర్శింహరావు, జుత్తిగ వెంకటేశ్వరరావు, కోటిరెడ్డి, దసరా బుల్లోడు, బృందా వనం రత్నమాణిక్యం,కునుకు నాగకృష్ణ,ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అత్తిలిలో...

అత్తిలి: సామూహికంగా ఎలుకల నిర్మూళన చేపట్టడం ద్వారా మంచి ఫలితం ఉంటుందని ఏవో అన్నదాత గంగాధర్ తెలిపారు.వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత వరి క్షేత్రాల్లో ఎలుకల బెడద ఎక్కువగా ఉందన్నారు.రైతులు ఎలుకలను సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ద్వారా అరికట్టవచ్చునన్నారు. బ్రోమోడయోలిన్ ఎర వ్యవసాయశాఖ సరఫరా చేస్తుందన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

సోపాన రుణాలకు 47 మంది ఎంపిక

తణుకు : సోపాన రుణాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెనుమర్తి వెంకటలక్ష్మి అన్నారు.వేల్పూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ,ఎస్టీ,బీసీ,ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా 2017-18 సంబంధించి రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వేల్పూరు, మహాలక్ష్మి చెరువు గ్రామాలకు చెందిన 47 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో వల్లూరి వెంకట రామ్మోహన్ రావు, ఎంపీడీవో జి.రమణ, బ్యాంక్ మేనేజర్ భాస్కరరావు, ఈవోపీఆర్‌డీ ఎంఎన్‌వీ రామకృష్ణ, కార్యదర్శి ఎ.కృష్ణంరాజు, డి. శంకర్, కేవీ వేణు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జడ్పీటీసీ చుక్కా సాయిబాబు

'వన సంరక్షణ అందరి బాధ్యత'

ఇరగవరం : వన సంరక్షణ ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జడ్పీటీసీ చుక్కా సాయిబాబు అన్నారు. ఇరగవరం మండలం రేలంగి శివారు ప్రాంతమైన బొబ్బరాజుపాలెంలో ఎన్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్,వెలుగు కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్నారు. మొక్కల బాధ్యతను పంచాయతీలు, ఐకేపీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించడం మంచి పరిణామన్నారు. గ్రామంలో 1200 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైనం పాము, ఎంపీటీసీ కామన ఏడుకొండలు, ఉప సర్పంచ్ వడ్డే మార్కొండేయులు, అడ్డాల మెంటారావు, పాతూరు మోషేన్,పాతూరు వెంకట్రావు, ఫీల్డ్ అసిస్టెంట్ మునీశ్వరరావు, కునుకు జనార్దన్, పి. శ్రీను పాల్గొన్నారు.



అత్తిలిలో ప్రజలకు సూచనలు చేస్తున్న ఎస్ఐ వీరభద్రరావు

దొంగలొచ్చారు.. జాగ్రత్త : ఎస్ఐ

అత్తిలి : దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు తెలిపారు. అత్తిలి రామన్నపేట రామాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఇటీవల దొంగలు తిరుగుతున్నట్టు సమాచారం ఉందన్నారు.అందుకే జాగ్రత్తగా ఉండాలని సూచించారు.కొత్తవారు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.



బల్లిపాడులో పూజలు చేస్తున్న మహిళలు

బల్లిపాడులో వరలక్ష్మీ వ్రతాలు

అత్తిలి: బల్లిపాడు మదన గోపాలస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు జరిపారు.ముందుగా గోపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలయ అర్చకుడు పెద్దింటి సత్యనారాయణా చార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వరలక్ష్మిదేవి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు.



ప్రజా సేవ



ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణంతో తాగునీటి ఎద్దడికి చెక్

రామిశెట్టి సురేష్, 32వ వార్డు కౌన్సిలర్

"32వ వార్డులో మునిసిపల్ ఛైర్మన్ సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం. ముఖ్యంగా వార్డులోని ఆరు రహదారులను సీసీ రోడ్లుగా, రెండు ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లను నిర్మింపజేశాం. మాలకొండ చెరువునుంచి కడకట్ల రైల్వే గేట్ వరకు రూ. 19 లక్షలతో బీటీ రహదారిని అభివృద్ధి చేశాం. 31,32 వార్డుల నడుమ రూ. 18 లక్షలతో మరొక రహదారిని అభివృద్ధి చేశాం. వార్డులో తాగునీటి కష్టాలను కడతేర్చేందుకు ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన చేశాం."

● తాడేపల్లిగూడెం టౌన్

వివాహిత ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్: భర్త పై గొడవ పడి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తాడేపల్లిగూడెంలోని కడకట్లలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడకట్లకు చెందిన సూరెడ్డి బుజ్జమ్మ, భర్త రామకృష్ణకు మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భర్త బుజ్జమ్మపై దురుసుగా మాట్లాడటంతో మనస్తాపానికి గురై ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. 85 శాతం కాలిన గాయాలతో బుజ్జమ్మను గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు.ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు.

'విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పోటీలు'

తాడేపల్లిగూడెం టౌన్: నవంబర్ 14 నుంచి నిర్వహించనున్న గ్రంథాలయ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లోని ప్రతి ఒకటి, మూడో గురువారాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రంథాలయం రికార్డ్ అసిస్టెంట్ వైవీ సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు కూడా మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు ఆయా గురువారాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉంటాయన్నారు. వివరాలకు 08812 226009, 81218 26686 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిండు వాన..



మాకు.. చొక్కాలే గొడుగులు..

తాడేపల్లిగూడెం అర్బన్ : అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో జనం అవస్థలు పడ్డారు. ప్రజలు గొడుగులు, రెయిన్‌కోట్ సహాయంతో బయటకు వచ్చారు. తాలూకాఆఫీస్ సెంటర్, జడ్పీహైస్కూల్ ఆవరణ, ఆర్టీసీ కాంప్లెక్స్, కోడే వెంకట్రావు మునిసిపల్ హైస్కూల్, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోను వర్షం నీరు చేరి చెరువులను తలపించాయి. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు పడతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



వానైనా.. తప్పదు మరి...

బైక్ ప్రయాణమా....

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

మునిసిపల్ కమిషనర్ బాలాజీ



లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ నిమ్మగడ్డ బాలాజీ

తాడేపల్లిగూడెం అర్బన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసే విధానంలో పారదర్శకంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ నిమ్మగడ్డ బాలాజీ సూచించారు. మెప్మా భవనంలో ఓరియంటల్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, ఐడీబీఐ, ఇండియన్ ఓవర్సీస్, యూకో, పంజాబ్ నేషనల్ బ్యాంక్, దీనా బ్యాంకుల ఆధ్వర్యంలో వివిధ వార్డుల నుంచి వచ్చిన లబ్ధిదారులను ఎంపిక చేసే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కమిషనర్ నిమ్మగడ్డ బాలాజీ మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి తప్పనిసరిగా బయోమెట్రిక్ తీసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఈనెల 31వ తేదీ లోపు ఇంటర్వ్యూలు ముగించి అప్‌లోడ్ చేయాలన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ లోపు లబ్ధిదారుల నుంచి రెండు అకౌంట్‌లను ప్రారంభించాల్సి ఉందన్నారు. 16-30వ తేదీ లోపు లబ్ధిదారులు గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. ఎంపికైన లబ్ధిదారులు తప్పనిసరిగా యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా బ్యాంకుల అధికారులు, సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

తాడేపల్లిగూడెం టౌన్ : విద్యార్థికి సౌశీల్యం ఎంతో ముఖ్యమని యూఎస్ఏలో నివాసముంటున్న ప్రవాస భారతీయుడు సాగిరాజు రవితేజవర్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1982- 83 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు స్నేహ స్పందన ఫౌండేషన్ పేరుతో స్థానిక పాఠశాలలో విద్యాభివృద్ధి కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రవితేజ వర్మ పాఠశాలకు రూ. తొమ్మిది వేలు విలువచేసే క్రీడా సామగ్రిని శుక్రవారం వ్యక్తిగతంగా అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ బాయిశెట్టి శ్రీనివాస్ రూ. 18 వేలు విలువ చేసే బ్లాక్ గ్రావెల్ మెటీరియల్‌ను, ఫౌండేషన్ సభ్యులు మరో నాలుగు లక్షల రూపాయల విలువ చేసే కొన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. అనంతరం వర్మను ఘనంగా సత్కరించారు. స్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎవీఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యాయులు ఏవీ రామరాజు, కేవీ గణపతిరావు, పూర్వ విద్యార్థులు ప్రవా శ్రీనివాస్, ఈగల తాతారావు, అందే మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐ వర్మను సత్కరిస్తున్న దృశ్యం



తపాలా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల సమ్మె

తాడేపల్లిగూడెం అర్బన్ : గ్రామీణ డాక్ సేవక్‌లుగా 8గంటలు పని కల్పించి సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. నిరవధిక దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐజీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సమ్మె చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు, అధ్యక్షుడు ప్రసాద్, డివిజన్ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన్స్‌లో భగవద్గీత శ్లోకాల పోటీ

తాడేపల్లిగూడెం రూరల్ : భారతీయ విద్యా వ్యవస్థలో చదవడం మన విద్యార్థులకు వరమని భగవద్గీత ప్రచార కర్త డాక్టర్ ధూళిపాల మహదేవమణి పేర్కొన్నారు. పెద తాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌లో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులను అనుకరించేందుకు మిగిలిన దేశాల వారు ఆసక్తి చూపుతున్నారన్నారు. పోటీల్లో తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్స్ విభాగంలో ఎం సరయు(భీమవరం) మొదటి స్థానంలో నిలవగా, సీనియర్స్ విభాగంలో ఎం.సాత్విక ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో భవన్స్ ఛైర్మన్ చెరుకువాడ శ్రీరంగ నాథరాజు, ప్రిన్సిపాల్ రాజీవ్‌కుమార్ శర్మ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల జిల్లా జట్ల ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్ : జిల్లా కబడ్డీ, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, త్రోబాల్, చెస్ క్రీడల్లో జిల్లా ఇంటర్ గురుకుల పాఠశాలల జట్ల ఎంపిక శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పీడీ జయరాజు శుక్రవారం తెలిపారు.



సత్యసాయి రథాన్ని తీసుకొస్తున్న సేవా సమితి సభ్యులు

● గూడెం చేరిన సత్యసాయి రథం

తాడేపల్లిగూడెం అర్బన్ : పూరి నుంచి పుట్టపర్తి వరకు సాగే సత్యసాయి రథోత్సవం శుక్రవారం తాడేపల్లిగూడెం చేరింది. ఈనెల 14 ఒడిశాలోని పూరి నుంచి ఈ రథయాత్ర ప్రారంభమైంది. స్థానిక ప్రతిపాడు జైంక్షన్ వద్దకు సత్యసాయి సేవాసమితి భక్తులు తరలివెళ్లి రథానికి స్వాగతం పలికారు. ఈ రథాన్ని డీఎస్‌చెరువు వద్ద ఉన్న సత్యసాయి మందిరానికి తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం ఉంచారు. కార్యక్రమంలో సత్యసాయి ఆధ్యాత్మిక కన్వీనర్ ప్రవా శ్రీనివాస్, సత్యసాయి సేవాసమితి సభ్యులు జంధ్యాల నాగేశ్వరరావు, పద్మావతి, విష్ణుమూర్తి, ఆకుల వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి, టీ శ్రీనివాస్, సుగుణ, పల్లవి, రామలక్ష్మి, దర్శిపర్రు, వల్లూరుపల్లికి చెందిన సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

● కశ్యప పెన్షన్ పథకం ద్వారా చేయూత

తాడేపల్లిగూడెం అర్బన్ : పేద బ్రాహ్మణ వృద్ధులకు, అనాథ పిల్లలకు, దివ్యాంగులకు, వితంతువులకు ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందించే కశ్యప పథకాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గం కోఆర్డినేటర్ ప్రవా శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రతి నెల రూ.1000 వంతున అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ వృద్ధాశ్రమాల్లో ఇలాంటి వారు ఉంటే ప్రతినెలా రూ.3వేలు అందిస్తున్నామన్నారు. ఈ పథకానికి రూ.75వేలకు తక్కువగా సంవత్సర ఆదాయం ఉన్నవారు అర్హులని తెలిపారు.

● కృష్ణయోగ మందిరంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం టౌన్ : కామికా ఏకాదశిగా పిలువబడే శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యానమందిరంలో కృష్ణపరమాత్మకు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా పంచామృతాభిషేకాలు, తులసీ దళాలతో సహస్ర నామార్చనలు తదితరాలు నిర్వహించారు. స్వామివారికి నూతన పట్టు వస్త్రాలను మంగిపూడి వెంకట సుబ్రహ్మణ్య రామశాస్త్రి, ఈమని జానకి సమర్పించారు. శ్రావణమాసంలోని చివరి శుక్రవారం కావడంతో మందిరంలోని చింతామణీ అమ్మవారికి, కృష్ణపరమాత్మలకు మహిళలు పెద్ద ఎత్తున పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు సామూహిక భగవద్గీత, అష్టలక్ష్మీ స్తోత్రాల పఠనాలు, మందిర రూపకర్త పోడూరి కృష్ణవేణిమాతాజీ శిష్యబృందంతో విరాటపర్వ పఠనం, తత్వవిచారణలు చేశారు. ఆయా కార్యక్రమాలను మందిర నిర్వాహకులు ఇందుకూడి మోహన్‌రాజు నిర్వహించారు. నున్న సరోజిని, చాముండేశ్వరి, ఉప్పల సీతామహాలక్ష్మి, నడిపల్లి కాశీఅన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటే టీకా.. రెండు వ్యాధుల నివారణ

తాడేపల్లిగూడెం రూరల్ : ఒక వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా పిల్లలకు తట్టు, రూబెల్లా వ్యాధులు సోకకుండా ఉంటాయని న్యూఢిల్లీకి చెందిన కన్సల్టెంట్ డాక్టర్ అబ్బాస్ పేర్కొన్నారు. రవీంద్రభారతి పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారికి తప్పకుండా ఈ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఇమ్యునేషన్ అధికారి డాక్టర్ ఐ.మోహన కృష్ణ, ప్రాజెక్టు అధికారి డాక్టర్ జె.నాగేశ్వరరావు, వెంకట్రామన్నగూడెం మెడికల్ అధికారి డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ ఎల్.చండేశ్వరి పాల్గొన్నారు.

బెండ రైతుల బెంగ



- రైతుల వద్ద కిలో రూ.12
- బహిరంగ మార్కెట్‌లో మాత్రం కిలో రూ.40
- కూలీల ఖర్చు కూడా రావడం లేదు..
- రైతుల ఆవేదన

తాడేపల్లిగూడెం రూరల్: బహిరంగ మార్కెట్‌లో కిలో బెండ కాయలు రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నా రైతులకు మాత్రం బెంగే మిగులుతోంది. కనీసం కూలి ఖర్చు కూడా రాలేని పరిస్థితిలో ఇంటిల్లాపాది పనులు చేసుకునే పరిస్థితి నెలకొంది. కూరగాయలు పండించే గ్రామాల్లో రైతులను కదిలిస్తే కన్నీళ్లే తక్కువ అన్నట్టుగా కదిలిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి బెండ కూరగాయలు పండించి తీరా మార్కెట్‌కు పట్టుకెళితే దళారులు దందాకు రైతులు విలవిల్లాడే పరిస్థితి నెలకొంది. పది కిలోలు రూ.120కే విక్రయించాల్సిన పరిస్థితి. ఎకరం చేలో ఇద్దరు కూలీలను పెట్టి కోత పనిచేయిస్తే 100 నుంచి 150 కిలోల వరకూ కోతకు వస్తుంది. దీంతో కూలీల ఖర్చులకే సగం పోతే మిగిలేది కౌలుకు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే దిగుబడి 50 కేజీల లోపు ఉంటే కూలీల ఖర్చుకూడా మిగలడంలేదని దీంతో కూలి డబ్బులైనా మిగుల్తాయని తామే పనిచేసుకుంటామని రైతులు చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎల్‌అగ్రహారం, లింగారాయుడుగూడెం, ఇటుకులగుంట, వెంకట్రామన్నగూడెం, జగ్గన్నపేట, జగన్నాథపురం గ్రామాల్లో కూరగాయల సాగు చేస్తున్న రైతుల దీన స్థితి ఇది.



మార్కెట్‌లో ధర బాగున్నా రైతులకు నష్టాలే...

మద్ది రఘునాథరావు, దండగర్ర

నేను 20 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. సగం వరి పంట వేయగా, మరికొంత కూరగాయలు సాగు చేస్తున్నాను. బహిరంగ మార్కెట్‌లో ధర బాగున్నా రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. దళారులు మమ్మల్ని దోచుకుంటున్నారు. దీంతో కనీసం కూలి ధరలు కూడా రావడంలేదు.



దళారులు దోచుకుంటున్నారు..

చిక్కాల సుబ్బారావు, దండగర్ర

మార్కెట్‌లో రైతుల వద్ద అయినకాడికి కూరగాయలు కొని సొమ్ము చేసుకుంటున్న దళారుల ఇబ్బందులు పడలేకపోతున్నాం. దీంతో రైతుల నుంచి కూలీలే కూరగాయలు కొనుగోలు చేసి సైకిల్స్‌పై వ్యాపారాలు చేస్తున్నారు. రైతులకు మాత్రం ఏమి ఉండటం లేదు.

ఎడతెరిపి లేని వాన

తాడేపల్లిగూడెం రూరల్ : ఎడతెరిపి లేకుండా శుక్రవారం కురిసిన వానకు జనజీవనం స్తంభించింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో ఎలుకల కన్నాలను గుర్తించేందుకు రైతులకు ఇది అంతరాయంగా ఏర్పడింది. పల్లపు పొలాలు వర్షపునీటితో మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమ యమయ్యాయి. వెంకట్రామన్న గూడెం, మెట్టఉప్పరగూడెం, ఉప్పరగూడెం, ఇటుకుల గుంట, లింగారాయుడు గూడెం ప్రాంతాల్లో కూరగాయల పంటలకు కొంత నష్టం ఏర్పడింది.

ఇంటర్వ్యూలకు 134 మంది

పెంటపాడు : మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు సీబీఐ, తిరుపతిపురం చైతన్యగోదావరి బ్యాంకుల పరిధిలోని 134 మంది లబ్ధిదారులు హాజరయ్యారని ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. ఎంపీపీ పెదపోలు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ కిలపర్తి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల కార్యవర్గం ఎంపిక

పెంటపాడు : తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల నూతన వీఆర్వోల కార్యవర్గ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఎస్.నాగేంద్రప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఎంఎస్‌వీఎస్ఎస్ శర్మ, కార్యదర్శిగా బి.పద్మ, కోశాధికారిగా జేఎన్‌వీ స్వామి నియామకమయ్యారు.

సినిమాలు

తాడేపల్లిగూడెం :

రంగమహల్	ఫిదా
లక్ష్మీనారాయణ-1	నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీనారాయణ-2	జయజానకి నాయక
శేషమహల్	జయజానకి నాయక
చలపతి	నేనే రాజు నేనే మంత్రి
వెంకట్రామా	లై
శ్రీపద్మజ	నక్షత్రం

అర్హులైన లబ్ధిదారులకే రుణాలు : ఎంపీడీవో



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో

తాడేపల్లిగూడెం రూరల్ : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్, వికలాంగ కార్పొరేషన్‌లలో అర్హత గల లబ్ధిదారులకు రుణాలు ఇస్తామని ఎంపీడీవో వీవీ రామాంజనేయశర్మ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం యూనియన్ బ్యాంకు పరిధిలోని కుంచనపల్లి, మెట్టఉప్పరగూడెం గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. లబ్ధిదారులతో బయోమెట్రిక్ హాజరు వేయించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 120 మందికి పైగా కార్పొరేషన్ లబ్ధిదారులు హాజరయ్యారు. ఇంటర్వ్యూల్లో యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేష్, వైస్ ఎంపీపీ కొండపల్లి రాయుడు, ఎంపీటీసీ కొనాల మురళీమోహన్, సర్పంచ్‌లు కామంచి అబ్బులు, జువ్వల మణికుమారి, మాదాసు అశోక్‌రాజ్ కుమార్, టీడీపీ మండ లాధ్యక్షుడు కోరశిఖ మునేశ్వరరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి బాలం కృష్ణ, వేదాల మోషే పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించండి : ఎంఈవో

తాడేపల్లిగూడెం రూరల్ : విద్యార్థులకు బోధన విషయంలో పాఠశాలల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఎంఈవో వి.హనుమ పేర్కొన్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వివరాలు సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు పాఠశాలల వారి విడుదలైన నిధుల జాబితాను వివరించారు. పాఠశాల ఆవరణలో పెరటితోటల పెంపకం చేపట్టి విద్యార్థులకు అవసరమైన కూరగాయలు పండించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎంఈవో

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి : ఎంపీపీ



ఎంపీడీవో మల్లికార్జునరావును సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు తదితరులు

పెంటపాడు : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు కలసి పనిచేయాలని ఎంపీపీ పెదపోలు వెంకటేశ్వర్లు అన్నారు. పెంటపాడు పాతయూపీ ఆదర్శపాఠశాలలో నూతనంగా కల్పించిన పలు మౌలిక వసతులను శుక్రవారం ఎంపీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి హెచ్ఎం టి.వి.రామకృష్ణ అధ్యక్షత వహించగా జడ్పీటీసీ కిలపర్తి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ పాతూరి రాంప్రసాద్‌చౌదరి మాట్లాడుతూ పాతయూపీ పాఠశాలను ఆదర్శపాఠశాలగా తీర్చిదిద్దడంలో హెచ్ఎం రామకృష్ణ కృషిని అభినందించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ఎంపీడీవో మల్లికార్జునరావును, పాఠశాల అభివృద్ధిలో సహకారం అందించిన ఎంపీపీ వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ పాతూరి రాంప్రసాద్‌చౌదరి, మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు దాసరి సతీష్‌కుమార్‌లను హెచ్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో శాలువా, పూలదండలతో సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం శి రుమామిళ్ళ పెద్దిరాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్ : ఎలుకల బొరియలను పూడ్చి తెరుచుకున్న బొరియల వద్ద ప్రభుత్వం పంపిణీ చేసే బ్రోమోడయోలిన్ మందును పెడితే ఎలుకల నివారణ చేయవచ్చని తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. దండగర్రలో రైతు క్షేత్ర పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో బి.రాజారావు వరిలో ఆకు ఎండు తెగులు ఎంటీయూ 1121, 7029 రకాల్లో వస్తుందని రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఆకుఎండు తెగులు నివారణకు కొసైడ్ అనే మందును పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈవో మౌనిక, ఆత్మా బీటీఎం సాగర్, రైతులు సుబ్రహ్మణ్యం, సోమేశ్వరరావు, కర్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోపాలరాజు సేవలు అభినందనీయం

పెంటపాడు : ఆపదలో ఉన్న పేదవారికి, విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాలరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని మండల మానవత చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయుడు చింతలపాటి గోపాలరాజు నల్లజర్ల గ్రామానికి చెందిన పేద విద్యార్థి ముత్యాల భారతికి తన తల్లిదండ్రులు సూరపురాజు, పుల్లమ్మల జ్ఞాపకార్థం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మానవత నల్లజర్ల రీజనల్ చైర్మన్ కొండేపు సూర్యనారాయణ, గుత్తికొండ వరప్రసాద్, టి.పాల్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

పెంటపాడు : శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్దనున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధానార్చకులు కొత్తలంక శివసత్యనారాయణ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో బీవీ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ బండి బలుసులరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలను పరిశీలించిన ఏడీ

తాడేపల్లిగూడెం రూరల్ : కొత్తపంటలు సాగు చేసుకునే రైతులకు ప్రస్తుత వర్షాకాలం మంచి తరుణమని ఏలూరు ఉద్యాన శాఖ ఏడీ పి.బాలాజీకుమార్ పేర్కొన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన పంటల పరిశీలనలో భాగంగా మండలంలోని పలు పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్, కోకో వేసుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని దానిని ఉపయోగించుకుని పంటలు వేసుకోవాలని వివరించారు. ఎకరాకు 450 మొక్కలు వేసుకోవడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. జామ (తపేదా) రకం చిన్న సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. మండలంలోని కడియద్ద, కొమ్ముగూడెం, పట్టింపాలెం, నీలాద్రిపురం గ్రామాల్లో పర్యటించారు. ఉద్యాన అధికారి డి.సుధీర్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



ప్రజా సేవ



పారిశుధ్య పరిరక్షణలో ప్రజల సహకారం తప్పనిసరి

గొంట్లా గణపతి,
సర్పంచ్, ఆకివీడు

“ఆకివీడు గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు అభివృద్ధి, పారిశుధ్యం, డ్రెయిన్లపై దృష్టి సారించి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే కోట్లాది రూపాయల వ్యయంతో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేశాం. వేసవిలో రెండు పూటలా మంచి నీటి సరఫరాకు ఆటంకం రాకుండా కృషి చేశాం. మంచినీటి చెరువుల్లో తాగునీరు కలుషితమవ్వకుండా ఇన్‌లెట్‌లకు నిధులు కేటాయించి పనులు నిర్వహించాం. ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శివ సహకారంతో కృషి చేస్తున్నాం. డెయిన్లలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలి. శానిటేషన్ సిబ్బంది సమస్య ఇబ్బందిగా ఉంది. ప్రజలు సహకరించనంత కాలం పర్యావరణాన్ని కాపాడుకోలేం.”

● ఆకివీడు

నేడు ఎలుకల మందు పంపిణీ

పాలకోడేరు : సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మోగల్లు గ్రామంలో ఉచిత ఎలుకల మందును పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జయవాసుకీ తెలిపారు. సామూహికంగా ఎలుకలను నివారించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హలో... ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

కాళ్ళ :	9397139966
పాలకోడేరు :	9866283848
ఉండి :	9493476701
ఆకివీడు :	9440364437
,, రూరల్ :	9030966667

సినిమాలు

ఆకివీడు :

విజయ ఏసీ	జయ జానకి నాయక
విజయ మినీ ఏసీ	ఆనందోబ్రహ్మ
వెంకటలక్ష్మి	నేనే రాజు నేనే మంత్రి
సంగీత	లై
శ్రీవెంకట గంగారత్నం	మాయా మాల్



మాలవానితిప్ప- బోసు కాలనీ
వంతెన అప్రోచ్ రోడ్డు కుంగిన చిత్రం

కుంగిన అప్రోచ్ రోడ్డు

● మరమ్మతులు చేపట్టాలని
ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజల విజ్ఞప్తి

బోసుకాలనీ-మాలవానితిప్ప గ్రామాల మధ్య మొగదిండి స్ట్రయిట్‌కట్ పై రూ.2కోట్లతో వంతెన నిర్మించారు. వంతెన అప్రోచ్ ప్రస్తుతం కృంగిపోయింది. వంతెనకు రెండు వైపులా ఇదే పరిస్థితి. ఈ ప్రాంతంలో ఆక్వారంగమే ప్రధానం. భారీ వాహనాల్లో తవుడు తీసుకురావడం, దిగుమతి చేసుకోవడం వంటివి కూడా ఎక్కువగానే జరుగుతుంటాయి. దీనికి తోడు చేపల పట్టుబడులు కూడా ఈ ప్రాంతంలో సాగుతుంటాయి. వంతెన అప్రోచ్ కృంగిపోయి శిథిలావస్థకు చేరింది. జువ్వలపాలెం నుంచి బోసుకాలనీ, మాలవానితిప్ప, గోగుతిప్ప ప్రాంతాలకు తవుడు లారీలు చెరువుల వద్దకు తీసుకు వెళుతుంటారు. రాత్రి, పగలు సమయాల్లో ఈ వంతెన పై నే లారీలు నిలుపుదల చేస్తుంటారు. కృంగిపోయిన అప్రోచ్‌ను మరమ్మతులు చేయాలని ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. -కాళ్ళ

కాళ్ళ సంక్షేమ హాస్టల్ ఆకస్మిక తనిఖీ..

● విద్యార్థినుల హాజరు తక్కువ..
● హాస్టల్‌లో మెట్రిన్ లేరు...

కాళ్ళ : జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్, జడ్పీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ఆదేశాలతో సోషల్ వెల్ఫేర్ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ మేడపాటి కృష్ణకుమారి, కాళ్ళ జడ్పీటీసీ బర్రె శ్రీవెంకటరమణ కాళ్ళ బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్, కాళ్ళ బాలుర హాస్టళ్ళను శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బాలికల హాస్టల్ విద్యారినులు 135మంది ఉండగా శుక్రవారం 100మంది విద్యార్థులు బయోమెట్రిక్ హాజరు వేశారు. భోజనానికి మాత్రం 35మంది మాత్రమే ఉన్నారు. సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థినులే భోజనాలు వడ్డించుకోవలసిన పరిస్థితి కనిపించింది. మెనూ ప్రకారమే వంట చేసినప్పటికీ ఆ వంటలు రుచికరంగా లేవని కృష్ణకుమారి, బర్రెశ్రీవెంకటరమణ తెలిపారు. అదే సమయంలో మెట్రిన్ లేకపోవడమే కా ఫోన్ చేసినా స్పందించలేదు. ఇదే విషయాన్ని బీసీ సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌కు ఫోన్ చేశామని ఆమె తెలిపారు. అదే విధంగా కాళ్ళ బాలుర హాస్టల్‌ను కూడా పరిశీలించారు. కనీస వసతులు, సౌకర్యాలు లేక బాలుర హాస్టల్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరింది. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మూడేళ్ళ క్రితం మంజూరయ్యాయి. ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టలేదని హాస్టల్ వార్డెన్ డి శ్రీహరి వారికి తెలిపారు. హాస్టల్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. హాస్టల్ పరిస్థితులను జిల్లా కలెక్టర్, జడ్పీ చైర్మన్‌లకు వివరిస్తామని ఆమె తెలిపారు. ఆమెతో పాటు బర్రె జయరాజు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్, జడ్పీటీసీలు ఎం. కృష్ణకుమారి, శ్రీవెంకటరమణ

ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి

ఆకివీడు: మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం పున నిర్మాణం పనులు వేగవంతం జరుగుతున్నాయని చైర్మన్ సన్నిధి వెంకటేశ్వర్రావు అన్నారు. మొవ్వా వెంకట సుబ్రహ్మణ్యం-సత్యవర్ధనమ్మ జ్ఞాపకార్థం రుద్రపాక సోదరులు మొవ్వా వెంకటరత్నం రూ.1,00,116 చెక్కును శుక్రవారం దేవస్థాన ప్రాంగణంలో అందజేశారు. వెంకన్నబాబు మాట్లాడు తూ దేవదాయశాఖ, దాతలు సహకారంతో ఆలయ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. దాతలను అభినందించారు. గోర్తి గోపి, భమిడిపాటి సూర్యభాస్కర్రావు అర్చకులు మొవ్వా వెంకటరత్నం కమిటీ సభ్యులు పాల్గొన్నారు



విరాళం అందజేస్తున్న దాతలు

సామూహిక ఎలుకల నిర్మూలనపై విస్తృత ప్రచారం

కాళ్ళ : గ్రామాల్లో రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణకు ముందుకు వచ్చి నిర్వహించడం అభినందనీయమని వ్యవసాయాధికారి వైవిఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం నాడు సామూహిక ఎలుకల నివారణ కోసం ఆటో ద్వారా ప్రచారాన్ని పలు గ్రామాల్లో నిర్వహించారు. తొలుత కాళ్ళలో కాళ్ళ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్ ప్రారంభించారు. కాళ్ళ, సీసలిలో రైతులకు సామూహిక ఎలుకల నివారణ కోసం అవగాహన కల్పించారు. ఎలుకల బొరియల గుర్తింపు చేలలోను, చేల గట్లలోను చేపట్టారు. వ్యవసాయ శాఖ ఉచితంగా బ్రొమోడయోలిన్ మందును పంపిణీ చేస్తుందని గ్రామ పంచాయతీల ద్వారా నూనె, నూకలను ఆయా గ్రామపంచాయతీ పొలాల్లో ఎలుకల బొరియల రంధ్రాల్లో వీటిని ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. ఏ ఒక్క రైతు నిర్లక్ష్యం వహించినా ఎలుకల పొలంలోకి పారిపోయే ప్రమాదం ఉందని సూచించారు. ఎలుకల ఉండే రంధ్రాలను గుర్తించారు. మట్టితో పూడ్చాలని రైతులకు సూచించారు. గ్రామాల వారీగా రైతులు తమ పొలాల్లో, ఖాళీ స్థలాల్లోను సామూహికంగా రైతులు ఎలుకల బొరియలను పూడ్చాలన్నారు. శనివారం నాడు ఆ రంధ్రాల్లో ఈ మందును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కట్రెడ్డి శ్రీనివాసరావు, నూకల తాతయ్య, గుల్లిపల్లి జోగయ్య, కట్రెడ్డి సీతారామయ్య, బరకాల శ్రీనివాస్, సర్పంచ్ బండారు రాధాకృష్ణ, విఆర్వో పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఎలుకల నివారణ పై
అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఉండి ఎమ్మెల్యే శివ, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ

నంద్యాలలో ఎమ్మెల్యే శివ ప్రచారం

పాలకోడేరు : నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వేటుకూరి వెంకటశివరామరాజు ప్రచారంలో తనదైన శైలిలో ముందుకు దూసుకెళుతున్నారు. నంద్యాల ఉపఎన్నికలు టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీగా జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే శివరామరాజు ప్రచారంలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా నంద్యాలలో ప్రజలను చిరునవ్వుతో పలకరిస్తూ ఓటర్లను తనదైన శైలిలో ఆకట్టుకుంటున్నారు. ఎమ్మెల్యే శివరామరాజు ప్రచారంలో పాల్గొంటుండగా అక్కడ ప్రజలు సైతం శివరామరాజును ఆహ్వానిస్తున్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం అభ్యర్థి గెలవాలని, అందుకే తాము మీ ముంగిటకు వచ్చామంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఉండి, భీమవరం ప్రాంతం నుంచి వెళ్ళిన అనేకమంది ఎక్కువగా నంద్యాలలో వ్యాపారాలు చేసుకుంటూ అక్కడే స్థిరపడి ఉండటంతో ఎమ్మెల్యే శివకు అక్కడకూడా ఘనస్వాగతం లభించింది. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టిన అభ్యర్థి గెలిపించాలంటూ కోరుతున్నారు. ఎమ్మెల్యే శివరామరాజు వెంట తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణతోపాటు ఉండికి చెందిన నాయకులు జుత్తిగ నాగరాజు, బుడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళలో ఉపాధి ఇంటర్వ్యూలు

కాళ్ళ : నిరుద్యోగ స్వయం ఉపాధి శోపానం ఇంటర్వ్యూలు శుక్రవారం జరిగాయి. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, బిసి, కాపు కార్పొరేషన్‌కు సంబంధించి ఏలూరుపాడు ఆంధ్రాబ్యాంకుకు సంబంధించి ఇంటర్వ్యూలు జరిగాయి. 202మంది రుణాల కోసం ధరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు నమోదు చేశారు. కాళ్ళ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, ఎంపీడీవో ఎన్‌వి శివప్రసాద్‌యాదవ్, ఏలూరుపాడు గ్రామకార్యదర్శి బి వసంతవాణీప్రసాద్‌లు లబ్ధిదారులతో మాట్లాడారు. శనివారం నాడు కాళ్ళ ఆంధ్రాబ్యాంకు పరిధిలో 338మందికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎన్‌వి శివప్రసాద్‌యాదవ్ తెలిపారు.

కౌలురైతులపై కనికరం ఏదీ..?

నీరు గారుతున్న ప్రభుత్వ లక్ష్యం.
అరకొరగానే బ్యాంకు రుణాలు
నిరుపయోగంగా ఎల్ఈసీ కార్డులు.

కాళ్ళ : నానాటికీ అప్పుల ఊబిలో కూరుకుపోతున్న కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించాలన్న ప్రభుత్వలక్ష్యం నీరు గారుతోంది. కౌలురైతులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వాలన్న జిల్లాస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బ్యాంకర్లు బేఖాతరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కౌలురైతుల సంక్షేమం గాడిన పడటం లేదు. జిల్లా వ్యాప్తంగా లక్షా 50వేల మంది కౌలురైతులు ఆదిలో ఉత్సాహంగా కౌలురుణ అర్హత కార్డులు పొందినా వాటి రెన్యువల్‌లో మాత్రం ఏడాది ఏడాదికి తగ్గుతూ వెనుకపడ్డారు. ఈ ఏడాదికి వచ్చేసరికి కొత్త నిబంధనలు తీసుకురావడం, కౌలు రైతు రుణ అర్హత కార్డు పొందేందుకు భూమి కలిగిన రైతు కూడా అంగీకరించినట్లు పత్రాలు ఇవ్వాలని కొన్నిచోట్ల అనడంతో కౌలురైతుకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనితో మొత్తం మీద ఈ ఏడాదికి వచ్చేసరికి రుణాలు పొందిన వారు దాదాపుగా కౌలురుణఅర్హత కార్డులను రెన్యువల్ చేయించుకుని కొత్త రుణాలు పొందారే తప్ప మిగిలిన లక్ష మందికి పైగా కౌలురైతులు రుణ అర్హతకార్డులు పొందినా రుణాలు రావడం లేదు అని కొందరు, మరికొందరు నిబంధనలతో రుణఅర్హత కార్డులను రెన్యువల్ చేయించుకోలేకపోయారు. దీనితో 20వేల నుంచి 30 వేల మంది వరకు గతంలో కార్డులు పొందిన రైతులు ఈ ఏడాది వాటిని పొందలేకపోయారు. ఏ విధంగా చూసినా రుణఅర్హతకార్డుల ద్వారా కౌలురైతులకు ఈ ఏడాది ఒరిగింది ఏమి లేదన్నట్టుగానే వారి నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

దౌర్జన్యం కేసు నమోదు

ఆకివీడు: మహిళ దగ్గర వడ్డీకి తీసుకున్న వ్యాపారిని నగదు చెల్లించాలని అడిగినందుకు దుర్భాషలాడి గాయపరచినట్టు మహిళ చేసిన ఫిర్యాదుపై ఎస్ఐ సుధాకర్‌రెడ్డి వ్యాపారిని అరెస్ట్ చేశారు. సాలిపేటకు చెందిన కొట్టు మాధవి ఇంటి ప్రక్కన అద్దెకు ఉంటున్న రావు జగదీష్ సింగ్‌కి వ్యాపారం నిమిత్తం 2015 సంవత్సరంలో రూ.5లక్షలు వడ్డీకి ఇచ్చింది. ఈ నెల 3న ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న జగదీష్ సింగ్ దగ్గరకు ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి మాధవి వెళ్ళి డబ్బులు అడిగితే అవమానించి, అసభ్యకరంగా ప్రవర్తించి దుర్భాషలాడి గాయపరచాడు. ఈ విషయం భర్తకు తెలిపి పెద్దలతో చర్చించి ఈ నెల 16న పోలీస్ స్టేషన్‌లో మాధవి ఫిర్యాదు చేసింది.

రైల్వే సమాచారం

ఆకివీడు నుంచి నుంచి గుడివాడ వైపు

నెంబర్ రైలు పేరు సమయం

17016 విశాఖ ఎక్స్‌ప్రెస్- రాత్రి 10.05నిలకు,
17209 శేషాద్రి ఎక్స్‌ప్రెస్- రాత్రి 8.46నిలకు
-17644 సర్కార్ ఎక్స్‌ప్రెస్‌రాత్రి 6.07నిలకు,
ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్-18519 ఉదయం 3.59నిలకు,
17255 నర్సాపురం ఎక్స్‌ప్రెస్- రాత్రి 8.17నిలకు
17407 తిరుపతి-నర్సాపురం ఎక్స్‌ప్రెస్- రాత్రి 6.46నిలకు,
17231నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్- ఆదివారం-శుక్రవారం (వయా గుంటూరు మీదుగా), మిగతా రోజుల్లో-17213 రైలు వయా ఖమ్మం-వరంగల్ మీదుగా ఉదయం 11.34నిలకు,
17479 హౌరా ఎక్స్‌ప్రెస్ (పూరి-తిరుపతి) బిలాస్‌పూర్ నుంచి ఆదివారం-బుధవారం 17481, మిగతా రోజుల్లో-ఉదయం 5.30నిలకు,

ఆకివీడు నుంచి భీమవరం వైపు

ఆకివీడు స్టేషన్ నుంచి భీమవరం వైపు వెళ్ళేవి
విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు- 17015 ఉదయం 00.59నిలకు,
శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు- 17210 ఉదయం 2.55నిలకు,
సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు- 17643 ఉదయం 5.28నిలకు,
ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు- 18520 ఉదయం 5.57నిలకు,
నర్సాపురం ఎక్స్‌ప్రెస్ రైలు- 17256 ఉదయం 6.27నిలకు,
తిరుపతి-నర్సాపురం- రైలు- 17403 ఉదయం 4.39నిలకు,
నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు- 17232 మంగళవారం-ఆదివారం (వయా గుంటూరు మీదగా), మిగతా రోజుల్లో-17214 వయా ఖమ్మం-వరంగల్ మీదుగా ఉదయం 7.52నిలకు,
హౌరా ఎక్స్‌ప్రెస్ (పూరి-తిరుపతి) బిలాసపూర్‌కు ఆదివారం-గురువారం 17482, మిగతా రోజుల్లో -17480 ఉదయం 8.54,
కోకినాడ ఎక్స్‌ప్రెస్ ఏసీ వారానికి రెండు రోజులు ఆదివారం-బుధవారం 12775 ఉదయం 3.51నిలకు
గుడివాడ పాసింజర్ రైలు-77202 ఉదయం 5.46నిలకు,
నర్సాపురం పాసింజర్ రైలు-77231 ఉదయం 10.17నిలకు,
గుంటూరు పాసింజర్ (మాచర్ల) రైలు-57318 మధ్యాహ్నం 1.57నిలకు,
నర్సాపురం పాసింజర్ రైలు-77204 సాయంత్రం 5.03నిలకు,
గుడివాడ పాసింజర్ రైలు-77264 రాత్రి 7.51నిలకు,
మచిలీపట్నం పాసింజర్ రైలు-57229 రాత్రి 11.35నిలకు,
పాస్ట్ పాసింజర్ రైలు-57381 రాత్రి 8.42నిలకు.

ఆక్వా ధరలు





		వనామి రొయ్య ధర కేజీలో	
కట్లా-బొచ్చె	రూ.104=00	30 కౌంట్	రూ.430=00
శీలావతి	రూ.102=00	40 కౌంట్	రూ.380=00
పండుగప్ప	రూ.350=00	50 కౌంట్	రూ.330=00
గడ్డిచేప	రూ. 90=00	60 కౌంట్	రూ.300=00
రూప్‌చంద్	రూ. 85=00	70 కౌంట్	రూ.280=00
బంగారుతీగ	రూ. 90=00	80 కౌంట్	రూ.270=00
వాలుగ	రూ.140=00	90 కౌంట్	రూ.240=00
కొరమీను	రూ.330=00	100 కౌంట్	రూ.230=00
ఫంగస్	రూ. 58-00		

అధికారుల ఫోన్ నెంబర్లు

ఉండి తహసీల్దార్- దుర్గాకిశోర్ 9491041459
ఎండీవో (ఇన్‌చార్జి)- రెడ్డియ్య 9493742460
ఎంఈవో - సూర్యనారాయణమూర్తి 9515159454
వ్యవసాయాధికారి- రాజేష్ 8886612983
ఏపీఎంవో - రాజేష్ 9959442246
ఎస్ఐ - రవివర్మ 9440796648
ఇరిగేషన్ డీఈ - వెంకటేశ్వరరావు 9848855557
ఆర్అండ్‌బీ ఏఈ - రామరాజు 9440818719

గ్రామాల్లో డ్రెయిన్లు అస్తవ్యస్తం

● ప్రక్షాళన చేపట్టాలని ప్రజల వినతి

కాళ్ళ : వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించినా గ్రామాల్లో మాత్రం ఫలితం



కోమటిగుంటలో డ్రెయిన్‌లో నిలిచిపోయిన నీరు

లేకుండాపోతోంది. పారిశుధ్య పనులు గ్రామాల్లో అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలతో నిర్మించిన డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా ప్రధాన డ్రెయినేజీ ఏర్పాటుకు కృషి చేస్తోంది. అయితే ఇప్పటికే నిర్మించిన డ్రెయినేజీలు అధ్వానంగా తయారవుతున్నాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఉన్న డ్రెయినేజీలు సిల్టుతో పూడుకుపోయాయి. చెత్తచెదారాలతో నిండి ఉన్నాయి. రోజులు తరబడి నీరు నిల్వ ఉండటం వల్ల తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోమటిగుంట, కాళ్ళ, బొండాడ, కోపల్లె, వేంపాడు



బొండాడలలో సిల్ట్ పేరుకుపోయిన డ్రెయినేజీ

తదితర గ్రామాల్లో ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీటి పారుదల సరిగా లేకపోవటంతో మట్టి పూడుకుపోయింది. చెత్తచెదారాలతో నిండి ఉన్నాయి. దీనితో రాత్రి వేళల్లో దోమల ఉధృతి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలోని నీటిపారుదల వెళ్ళే ఏర్పాట్లు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొల్లేరు పెద్దింట్లమ్మ ఆలయంలో
సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఆకివీడురూరల్ : కొల్లేటికోటలో కొలువాయున్న శ్రీపెద్దింటి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం అత్యంత వైభవంగా జరిగింది. దేవస్థానం ఆధ్వర్యంలో కార్య నిర్వహణాధికారి ఆకుల కొండలరావు అన్ని ఏర్పాట్లు చేశారు. 200 మందికి పైగా భక్తులు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. భక్తులకు దేవస్థానం తరపున పూజాద్రవ్యాలు అందజేశారు. వ్రతం పూర్తైన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిం చారు. ఆలయ ప్రధాన ఉప అర్చకులు పి. పరమేశ్వరశర్మ వ్రత కల్పం చదివి భక్తులచే పూజ గావించారు.

సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన సదస్సు

పెదకాపవరం(ఆకివీడురూరల్) : వరి పంట కాలంలో నష్టాన్ని కలుగచేసే ఎలుకలను సమర్థవంతంగా నివారించాలంటే ఎలుకల నివారణను సామూహికంగా చేపట్టాలని ఏవో నిమ్మల శ్రీనివాస్ అన్నారు. పెదకాపవరం గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఈనెల 18, 19వ తేదీలలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్రోమోడయోలోన్ అనే విషపు ఎరను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని ఎర తయారికి అవసరమైన నూకలు నూనెను రైతులు సేకరించాలని కోరారు. 500 గ్రాములు విషపు ఎర 50 ఎలుక కన్నాలకు సరిపోతుందని తెలిపారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో మొదటి రోజు ఎలుక కన్నాలను గుర్తించి వాటిని పూడ్చివేయాలని సూచించారు. రెండవ రోజు తెరవబడిన ఎలుక కన్నాలను గుర్తించి వాటిలో విషపు ఎరను పెట్టాలని తెలిపారు. పదవ రోజు తెరవబడిన కన్నాలలో రెండవ సారి విషపు ఎరను



పెదకాపవరంలో రైతులకు ఎలుకల నిర్మూలనపై అవగాహన సదస్సు అధికారులు, పాల్గొన్నరైతులు

ఉంచాలని తెలిపారు. సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా ఎలుకలు తప్పించుకునే పరిస్థితి ఉండదని అన్నారు. ఎరను తయారు చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు తొడుక్కోవాలని, విషపు ఎర విరుగుడుకు విటమిన్ కె1 దగ్గర ఉంచుకోవాలన్నారు. ఎరను పొలాల వద్ద మాత్రమే తయారు చేసుకోవాలని, వ్యవసాయాధికారి, విస్తరణాధికారి సూచనలు పాటిస్తూ ఎలుకల నివారణ చేపట్టాలని ఆయన సూచించారు.



ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్న నాయిని శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎంపీడీవోకు కార్యదర్శుల సన్మానం

ఆకివీడు: నీతి-నిజాయితీకి మారుపేరుగా..విధి నిర్వహణలో ఎక్కడా రాజీపడని తత్వంతో ఎంపీడీవో నాయిని శ్రీనాథ్ వ్యవహరిస్తారని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. బెస్ట్ ఎంపీడీవో అవార్డు అందుకున్న ఎంపీడీవో నాయిని శ్రీనాథ్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఘనంగా సన్మానించి మాట్లాడారు. విధి నిర్వహణలో బాధ్యతులు సక్రమంగా లేకపోతే ఊరుకోరన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఠాగూర్, సూపరింటెండెంట్ ప్రభాకర్, ఎంపీపీ నౌకట్ల రామారావు తదితరులు ఉన్నారు.



శ్రమదానంతో రోడ్డుపై గోతులు పూడుస్తున్న కాపులు

వినూత్నంగా కాపుల నిరసన

ఆకివీడు: ముద్రగడ పాదయాత్రకు అనుమతించా లంటూ ఆకివీడులో కాపు సంఘం నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. గ్రామంలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం పాత కట్టడాలు తొలగించిన రాళ్ళను గమేళాలతో తీసుకొచ్చి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలోని గోతులుపడిన 165 జాతీయరహదారిని పూడ్చారు. ముద్రగడ పాదయాత్రను అడ్డుకున్న దగ్గర నుంచి రోజూ ఏదో విధంగా రాధా-రంగ మిత్రమండలి ఆధ్వర్యంలో ఆకివీడులో నిరసనలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో నిమ్మల నాగు, మోటుపల్లి రాజు, బండారు వెంకటరత్నం నాయుడు తదితరులు ఉన్నారు.

పశుగ్రాస క్షేత్రాలకు ఆసక్తి కరువు

ఆకివీడు: పశువుల్లో పాల ఉత్పత్తి దిగుబడి పెరగడానికి పశుగ్రాస క్షేత్రాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే పలు కారణాల వలన రైతులు క్షేత్రాలు నిర్వహించడానికి పెద్దగా ఉత్సాహం చూపటంలేదు. ఈ పథకంలో రైతులు, పాడి రైతులు పశుగ్రాసాన్ని తమ సొంత భూమి లేదా కౌలు భూమిలో పెంచుకోవచ్చు. ఒక రైతు ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకూ పశుగ్రాస క్షేత్రాలను నిర్వహించవచ్చు. దీనికి ఏడాది పొడుగునా నీరు అందే భూమిని ఎంచుకోవాలి. ఎకరం భూమిలో పశుగ్రాస క్షేత్రం ఏర్పాటు కోసం రెండేళ్ళకు ప్రభుత్వం కౌలు రూపంలో ఏడాదికి రూ.25వేలు ఇస్తుంది. పొలం దున్నడానికి, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సుమారు రూ.29వేలు, విత్తనం నుంచి కోత వరకూ రెండేళ్ళ కూలి ఖర్చు రూ.48వేలు అందజేస్తుంది. అయితే ఆక్వా చెరువుల కారణంగా కౌలు రేట్లు ఎక్కువగా ఉండటంతో పశుగ్రాస క్షేత్రాలు నిర్వహించడానికి రైతులు ముందుకు రావడంలేదు. కొద్దిపాటి భూమిలో ఆదాయం అధికంగా వచ్చే ధాన్యం, అపరాలు వంటి పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు.

ఈ నెల 23న ఆకివీడు మండల ప్రజా పరిషత్ సమావేశం

ఆకివీడు : ఈ నెల 23న మధ్యాహ్నం జరిగే మండల ప్రజా పరిషత్ సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీడీవో నాయిని శ్రీనాథ్ శుక్రవారం తెలిపారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా హాజరవుతారన్నారు.



బయో మెట్రిక్ ద్వారా స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

చురుగ్గా ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

ఆకివీడు: స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చురుగ్గా సాగుతోంది. శుక్రవారం ఉదయం ఆకివీడు కెనరా బ్యాంక్, మధ్యాహ్నం ఏలూరుపాడు ఆంధ్రాబ్యాంక్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను బయోమెట్రిక్ విధానం ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 16 నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనార్టీస్, క్రిస్టియన్ మైనార్టీస్‌కు స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. అయితే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ బ్యాంక్ మేనేజర్లు రుణాలు మంజూరు చేయడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాయిని శ్రీనాథ్, ఈవోపీఆర్డీ నరసింహరాజు, ఎంపీపీ నౌకట్ల రామారావు, ఎంపీటీసీ బొల్లా వెంకట్రావు, రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
13
ఉంగుటూరు
శనివారం 19 ఆగస్టు 2017
నిడమర్రు । గణపవరం । ఉంగుటూరు । భీమడోలు

నేటి నుంచి సోపానం ఇంటర్వ్యూలు

నిడమర్రు: మండలంలో స్వయం ఉపాధి సోపానం కింద బీసీ, కాపు, యస్సీయస్టీ, ముస్లిం, క్రైస్తవ మైనార్టీలకు సంబంధించి 2017-18 సంవత్సరానికి లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.దామోదరరావు తెలిపారు. ఈనెల 19న ఆంధ్రాబ్యాంక్ గణపవరం, 21న గోదావరిగ్రామీణబ్యాంకు నిడమర్రు, 22న సెంట్రల్‌బ్యాంక్ ఆఫ్ఇండియా నిడమర్రు 23న ఎస్‌బీఐ నిడమర్రు, 24న ఇండియన్‌ఓవర్‌సీస్ బ్యాంకు నిడమర్రు 28న స్టేట్‌బ్యాంక్ఆఫ్ఇండియా గణపవరం 29న డీసీసీబీ బ్యాంక్ ఆకివీడు, 30న డీసీసీబీ బ్యాంక్ గణపవరంకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహిస్తామన్నారు.

ప్రజా సేవ



సాయన్న పాలెంలో నీటి సరఫరాకు చర్యలు

సుజాత, సర్పంచ్, పూళ్ళ

పూళ్ళ శివారు సాయన్నపాలెం గ్రామానికి ఆదివారం నుంచి ఏలూరు గోదావరి కాలువ నుంచి తాగునీటిని అందించనున్నాం. దీనికి రూ.45 లక్షల రూపాయలతో ఓ హెచ్ఎస్ఆర్ నిర్మించి నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నాం. పూళ్ళ గ్రామంలో తాగునీటి చెరువు చుట్టూ ప్రహరీగోడ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు వెచ్చించాం. పూళ్ళ గ్రామంలో ఇప్పటి వరకు 143 మందికి కాపు రుణాలు, 43 మందికి బీసీ రుణాలు, 31 మంది ఎస్సీ రుణాలను అందజేశాం.

● భీమడోలు

ఎడతెరిపిలేని వర్షాలు

లోతట్టు ప్రాంతాలు జలమయం



భువనపల్లిలో వర్షానికి మునిగిన రోడ్డు



భీమడోలులో రాజులవీధి దుస్థితి

నిడమర్రు: అల్పపీడన ప్రభావం వల్ల శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. వర్షం వల్ల భువనపల్లి, మండలపర్రు, బావాయిపాలెం, అడవికొలనుల్లోని పల్లపు వరిచేలల్లో నీళ్ళు నిలిచిపోయాయి. నీళ్ళు బయటకు పోయే ప్రయత్నాలు చేపడుతున్నారు. ఓ పక్క వర్షాల వల్ల గోతులమయమైన అడవికొలను, భువనపల్లి రహదారి, క్రొవ్విడి రహదారి బురదమయమై గోతుల్లో నీరు ఉండడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క రొయ్య రైతుల గుండెల్లో గుబులు నెలకొంది. వాతావరణం నిరంతరం మేఘావృతం కావడంతో వైరస్ ఉధృతి అవుతుందనే అంచనాతో ముందస్తుగా ఆక్వా మందులు కొనుగోలు చేసుకుని తమ చెరువుల వద్ద నిల్వచేసుకుంటున్నారు.

గణపవరం: ఎడతెరిపి లేకుండా శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు గణపవరం మండలంలో జన జీవనం స్తంభించింది. ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు ఇళ్ళకేపరిమితం అయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలన్నీ బోసిపోయాయి. గణపవరం, పిప్పర మార్కెట్‌లో షాపులన్నీ వెలవెలబోతున్నాయి. గణపవరంలోని సినిమా హాల్స్‌కూడా వెలవెలబోయాయి. ముఖ్యంగా చిరువ్యాపారులు, రోజువారీ కూలీలకు వర్షం ఆశనిపాతంలా తగిలింది. గణపవరంలోని ఇందిరమ్మకాలనీ, సరిపల్లె, వెలగపల్లి, డికెపల్లి, కోమర్రు, పిప్పర, అప్పన్నపేట, కేశవరం, జల్లికొమ్మర గ్రామాల్లో పల్లపుప్రాంతాలు, కాలనీల్లో వర్షపునీరు చేరింది.

భీమడోలు : ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. భీమడోలు, పూళ్ళ, గుండుగొలను గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని రహదారులు గోతులు, బురదమయంగా మారుతున్నాయి. ప్రధానంగా మండల కేంద్రంలోని భీమడోలు రాజులవీధి ఆర్అండ్‌బి రోడ్డు పెద్దపెద్ద గోతులతో రహదారిపై వెళ్ళేందుకు దారి లేకుండా పోయింది. దీనికితోడు రహదారిపై ఉన్న గోతుల్లో ఇటీవల వ్యర్థమట్టిని వేయడంతో సమస్య మరింత జఠిలమైంది. రోడ్డుపై ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. రహదారిని పునఃనిర్మించాలని ఆర్అండ్‌బి అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

ఆ భవనాన్ని తీసుకోలేము

మత్స్యశాఖ సహాయ సంచాలకులు రాధాకృష్ణ

ఉంగుటూరు: తాడేపల్లిగూడెం మార్కెట్‌యార్డ్ ప్రాంగణంలో నిర్మించిన చేపల భవనాన్ని తాము తీసుకోలేమని మత్స్యశాఖ సహాయ సంచాలకులు జి.రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన బాదంపూడి మత్స్య అభివృద్ధి కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. మార్కెటింగ్ శాఖ తమ శాఖ ప్రతిపాదనలు కానీ అభిప్రాయాలు తీసుకోకుండా చేపలు కేంద్రాన్ని అక్కడ నిర్మించారని ఆయన అన్నారు. మత్స్యశాఖ అనుమతి లేకుండా ఈ సముదాయాన్ని నిర్మించారన్నారు. ఈ భవన సముదాయం వల్ల మత్స్యకారులకు కానీ, వినియోగదారులకు కానీ ప్రయోజనం ఉండదని ఆయన పేర్కొన్నారు.



గొల్లగూడెంలో దగ్ధమైన అట్టల ఫ్యాక్టరీ

అట్టల ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో శుక్రవారం తెల్లవారు జామున దేవిప్యాకేజర్స్ అట్టల ఫ్యాక్టరీ దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని భీమడోలు అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కోడిగుడ్ల అట్టలు, సిరామిక్ అట్టలు తయారుచేసే ఈ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం వల్ల మొత్తం యంత్రాలు కాలిపోయాయి. ఈ ఆస్తినష్టం సుమారు రూ.96లక్షలు ఉండవచ్చునని భీమడోలు ఫైర్‌ఆఫీసర్ వెంకటేశ్వరరావు విలేకర్లకు తెలిపారు. ఈ సంఘటనపై వీఆర్వో శామ్యూల్ అధికారులకు నివేదిక సమర్పించారు.



పాఠశాలకు పాడైన గుడ్లు సరఫరా చేసిన దృశ్యం

ఎంపీపీ పాఠశాలకు పాడైన కోడిగుడ్లు సరఫరా

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు ఎంపీపీ పాఠశాలకు పంపిణీ చేసిన కోడిగుడ్లు పాడయ్యాయని ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు తెలిపారు. గత శుక్రవారం సరఫరా అయిన కోడిగుడ్లు కుళ్ళి, పాడైపోయి వచ్చాయని, వాటిని బయట పారవేస్తున్నామని ఆయన తెలిపారు. ఈవిషయమై గ్రామసర్పంచ్ మారిశెట్టి లక్ష్మీనారాయణ, పంచాయితీ కార్యదర్శి కెవి గిరిధర్‌ల దృష్టికి తీసుకువెళ్ళామని, రోజుకు 60 కోడిగుడ్లు విద్యార్థులకు ప్రత్యేకంగా తెప్పించి వండిపెడుతున్నామని తెలిపారు.

పత్రికా పఠనాన్ని పెంపొందించుకోవాలి

ఉంగుటూరు: విద్యార్థులు చదువుతో పాటు పత్రికాపఠనాన్ని పెంపొందించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర పూర్వాధ్యక్షులు డి.సోమసుందర్ కోరారు. శుక్రవారం యూనియన్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పత్రికలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి సర్పంచ్ గంటా శ్రీలక్ష్మీ అధ్యక్షత వహించారు. ఏరియా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి యద్దనపూడి సుబ్బారావు పాల్గొన్నారు

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ఇంటూరి

గణపవరం: రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలన చేయాలని గణపవరం మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ఇంటూరి చంద్రమోహన్‌రావు కోరారు. శుక్రవారం ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని సర్పంచ్ ఇంటూరి చంద్రమోహన్‌రావు మొయ్యేరులో ప్రారంభించారు. ఎలుకల నిర్మూలన అవగాహన చైతన్య రథాన్ని కూడా ప్రారంభించారు. అధికారులతో కలిసి మొయ్యేరు ఆయకట్టులోని వరి చేలల్లో గట్లపై ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఇంటూరి పాపారావు చౌదరి, టీడీపీ గ్రామ ధ్యక్షులు కానుమిల్లి వెంకటేశ్వరరావు (చంటి), సొసైటీ కార్యదర్శి యండి శ్రీనివాస్, గ్రామకార్యదర్శి సునీల్‌రాజుపాల్గొన్నారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన

గణపవరం: విపత్తులు జరిగినప్పుడు ప్రజలను కాపాడేందుకు అవగాహన ఉండాలని, అందుకు ప్రతీ విద్యార్థి కాలేజీ దశ నుంచే అవగాహన పెంచుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ కోఆర్డినేటర్ ధర్మారావు అన్నారు. శుక్రవారం గణపవరం చింతలపాటి బాపిరాజు డిగ్రీకాలేజీలో విపత్తులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండోరోజు సదస్సుకు కాలేజ్ ప్రిన్సిపాల్ మధురాజు అధ్యక్షత వహించారు. రెండోరోజు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. గుండెపోటు, విద్యుత్‌షాక్, కాలిన గాయాలు, తెగిన గాయాలకు ప్రథమచికిత్స ఎలా చేయాలి అనే అంశంపై ధర్మారావు శిక్షణ ఇచ్చారు. రెడ్‌క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నిర్మల ఎముకలు విరిగినప్పుడు ప్రథమచికిత్స ఎలా చేయాలి అనేదానిపై శిక్షణ ఇచ్చారు.

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి

గణపవరం: గ్రామ సీమలు పచ్చదనంతో కళకళలాడి ఆహ్లాదవాతావరణాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటుకోవాలని జల్లికొమ్మర సర్పంచ్ కవల నాగమణి కోరారు. శుక్రవారం జల్లికొమ్మర గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ డైరెక్టర్ కవల కోదండ రాంబాబు, గ్రామకార్యదర్శి షేక్‌సయ్యద్‌బాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం అందజేత

గణపవరం: బిడ్డ పుట్టిన తక్షణమే జనన ధ్రువీకరణ పత్రాన్ని తాము అందజేస్తున్నామని గణపవరం వైద్యఅధికారి రవికుమార్ తెలిపారు. గణపవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పుడే ప్రసవించిన ఇద్దరు శిశువులకు జన్మదిన సర్టిఫికెట్లను వారి తల్లులకు అందించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని అది దివ్యఔషధమని అన్నారు. శిశువులకు డిసిజి, పోలియోచుక్కలు, హెపటైటిస్ బి టీకాలు, విటమిన్ కె ఇంజక్షన్‌ను అందించారు. ప్రసవించిన మూడురోజుల పాటు ఉచిత భోజనసౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు.



పాఠశాల ఆవరణలో చెత్త మొక్కలు తొలగిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉపాధ్యాయులు, విద్యార్థుల శ్రమదానం

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చక్కని పర్యావరణ వాతావరణం ఏర్పాటు చేసుకోవచ్చునని నిడమర్రు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు యర్రంశెట్టి శేషగిరిరావు అన్నారు. శుక్రవారం స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించే కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. పిచ్చిమొక్కలు తొలగించిన ప్రదేశంలో కూరగాయల విత్తనాలు చల్లి బడితోటను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదనరావు, అప్పారావు, పుష్ప, మురళీకృష్ణ, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ఉపాధి శిక్షణ

నిడమర్రు: విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు ఉచిత ఉపాధి శిక్షణ నిర్వహిస్తామని ఎంపీడీవో దామోదరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి తదనంతరం ఉపాధి అవకాశాలు ఏర్పాటుచేయుటకు షెడ్యూల్ విడుదలచేసినట్లు ఆయన తెలిపారు. అందులకు కంప్యూటర్, ఇంటర్‌నెట్‌లో శిక్షణ, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కోచింగ్, ఆండ్రాయిడ్ అప్లికేషన్ కోచింగ్ పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వబడునని తెలిపారు. శారీరక, బధిర అభ్యర్థులకు బ్యూటీషియన్, కంప్యూటర్‌అసిస్టెంట్, డీటీపీ, హోటల్‌మేనేజ్‌మెంట్, స్పోకెన్ఇంగ్లీషు, టైపింగ్‌లో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణకు పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులు. అర్హులైన అభ్యర్థులు ఈ క్రింది షెడ్యూల్‌ను అనుసరించి ఎంపిక కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈనెల 19న మునిసిపల్‌కార్యాలయం ఏలూరు, 22న మునిసిపల్‌కార్యాలయం తాడేపల్లిగూడెం, 23న మునిసిపల్‌కార్యాలయం కొవ్వూరు, 26న మునిసిపల్‌కార్యాలయం భీమవరంలో నిర్వహించే ఎంపిక శిబిరానికి హాజరుకావచ్చునని తెలిపారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

ఉంగుటూరు	: 9848050089
భీమడోలు	: 9440396818
గణపవరం	: 9949396998
నిడమర్రు	: 8341412277

సినిమా గైడ్

గణపవరం :

మహాలక్ష్మి	జయ జానకి నాయక
కుమారి	లై

భీమడోలు :

శ్రీనివాస	నక్షత్రం